


ESTD: 1999

www.voodayam.com

# వుదయం

కరీంనగర్ | 20-03-2026 శుక్రవారం | సంపుటి : 14 | సంచిక :101 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 4.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously Published from Karimnagar, Hyderabad, Adilabad, Khammam, Guntur & Warangal

Follow us on






# సాదా బైనామాలకు త్వరలో పరిష్కారం

## పంటలకు గిట్టుబాటు ధరతోపాటు బోనస్ ఇస్తున్నాం

- దేశంలో అతి తక్కువ రైతు రుణభారం కలిగిన రాష్ట్రం తెలంగాణ
- పరిశ్రమలు ఎన్ని వచ్చినా ఇప్పటికి వ్యవసాయమే ప్రధాన జీవనాధారం
- 25.35 లక్షల రైతు కుటుంబాలకు రూ. 20, 616 కోట్ల రుణమాఫీ చేశాం
- వ్యవసాయాన్ని లాభసాటిగా చేసి రైతును రాజుగా చేస్తాం
- ఈ నెల 22 నుంచి రైతు భరోసా అందిస్తాం
- భూ భారతితో రైతాంగ సమస్యలకు పరిష్కారం చూపుతున్నాం
- తెలంగాణలో దేశంలోనే అతితక్కువ రుణభారం ఉన్న రైతులున్నారు

ఉగాది వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, మార్చి 19 (వుదయం ప్రతినిధి) :** తెలంగాణలో సాదా బైనామా భూములకు సంబంధించి తొందరలోనే పరిష్కారం చూపించబోతున్నామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. వ్యవసాయాన్ని లాభసాటిగా చేసి రైతును రాజుగా నిలబెట్టాలన్న సంకల్పంతో ముందుకు వెళుతున్నామని చెప్పారు. ఉగాది పండుగను పురస్కరించుకుని భాషా సాంస్కృతి శాఖ, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో నిర్వహించిన శ్రీ పరాభవ నామ ఉగాది వేడుకల్లో సీఎం, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా శ్రీ పరాభవ నామ ఉగాది పంచాంగాన్ని ఆవిష్కరించారు. ప్రకృతి వైపరీత్యాలు రాకుండా ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ నెల 22న రైతు భరోసా



అందించబోతున్నామని తెలియజేస్తూ రైతులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. రైతు సంక్షేమం, అభివృద్ధికి కట్టుబడి ప్రభుత్వం పనిచేస్తుందని పునరుద్ఘాటించారు. ధరణి రూపంలో భూతమై రైతులను బాధ పెడుతున్న సందర్భంగా రైతులకు అండగా దాన్ని తరిమేసి భూ భారతితో రైతాంగ సమస్యలను పరిష్కరిస్తున్నట్లు వివరించారు. సాదా బైనామాకు సంబంధించి తొందరలోనే పరిష్కారం చూపించబోతున్నామని చెప్పారు. సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న రైతాంగాన్ని గట్టెక్కించడానికి పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు బోనస్ కూడా ఇచ్చి ఆదుకుంటున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన లెక్కల మేరకు దేశంలో అతితక్కువ రుణ భారం కలిగిన రైతులున్న రాష్ట్రాల్లో తెలంగాణ మొదటి స్థానంలో ఉండటం గర్వకారణమన్నారు. పరిశ్రమలు ఎన్ని వచ్చినా, ఐటీ రంగాలు ఎంతగా రాణించినప్పటికీ రాష్ట్రంలో ఇప్పటికీ ప్రధాన జీవనాధారం వ్యవసాయమేనని చెప్పారు.

మిగతా 2లో

# నేడే రాష్ట్ర బడ్జెట్

పెట్టుబడి రూ. 3.26 లక్షల కోట్లు?

సంక్షేమం వ్యవసాయం ఇరిగేషన్



- నేడు అసెంబ్లీ, మండలిలో ప్రవేశపెట్టనున్న మంత్రులు భట్టి, శ్రీధర్ బాబు
- సంక్షేమం, వ్యవసాయం, నీటి పారుదల రంగాలపై సర్కార్ ఫోకస్
- తెలంగాణ విజన్-2047 డాక్యుమెంట్‌లోని అంశాలపై ప్రత్యేక నిధులు
- ఉదయం కేబినెట్ భేటీలో ఆమోదం
- ఎన్నికల హామీల అమలు దిశగా బడ్జెట్‌లో కేటాయింపులు
- కేంద్ర ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్లు వాడుకోవాలనే యోచన

వ్యవసాయానికి తొలి ప్రాధాన్యం

**హైదరాబాద్, మార్చి 18 (ఎఎంఎస్) :** రాష్ట్ర బడ్జెట్ ఖరారు.. ఆమోదానికి సమయం ఆసన్నమైంది. శాఖల వారీగా సమీక్షలు.. సమావేశాలు నిర్వహించిన ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క కీలక శాఖల నుంచి అవసరమైన నిధుల ప్రతిపాదనలు తెప్పించుకున్నారు. సుదీర్ఘ కసరత్తు తర్వాత మొత్తం రూ.3.26 లక్షల కోట్లతో పద్దును ప్రవేశపెట్టేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఈ బడ్జెట్ లో రాష్ట్ర ప్రభుత్వం.. ప్రధానంగా సంక్షేమం, వ్యవసాయం, నీటి పారుదల రంగాలపై దృష్టి పెట్టినట్లు సమాచారం. మరోవైపు.. తెలంగాణ విజన్-2047 డాక్యుమెంట్‌లోన అంశాలపై ప్రత్యేక నిధులు కేటాయించనుంది. నేడు ఉదయం తెలంగాణ కేబినెట్ భేటీ అయి.. బడ్జెట్‌కు ఆమోదం తెలపనుంది. తర్వాత మంత్రి భట్టి విక్రమార్క అసెంబ్లీలో.. మంత్రి శ్రీధర్ బాబు మండలిలో ప్రవేశపెట్టనున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా.. ఈ బడ్జెట్‌లో కేటాయింపులు చేసేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ చర్యలు చేపట్టింది. ఈ ఏడాది బడ్జెట్ రూ.3.26 లక్షల కోట్లు ఉండొచ్చని అధికారిక వర్గాల నుంచి విశ్వసనీయంగా తెలిసింది.

**హామీల అమలు దిశగా కేటాయింపులు**

ఎన్నికల ముందు, తర్వాత రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు భవిష్యత్ అవసరాలను తీర్చడమే లక్ష్యంగా ఈ బడ్జెట్‌ను రూపొందించినట్లు సమాచారం. అదే సమయంలో తెలంగాణ విజన్-2047 డాక్యుమెంట్ అమలు దిశగా ప్రత్యేకంగా నిధులను కేటాయించనున్నట్లు తెలుస్తోంది. ఈ బడ్జెట్‌పై నేడు ఉదయం 9.30 గంటలకు అసెంబ్లీ కమిటీ హాల్‌లో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన తెలంగాణ మంత్రి వర్గ సమావేశం జరగనుంది. ఈ భేటీ తర్వాత బడ్జెట్‌కు మంత్రివర్గం ఆమోదం తెలపనుంది. ఆ తర్వాత అసెంబ్లీలో తెలంగాణ డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్ 2026-27ను ప్రవేశపెట్టనుండగా.. అటు శాసనమండలిలో శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పద్దును సభ ముందుకు తీసుకురానున్నారు. గతేడాది రాష్ట్ర ప్రభుత్వ ఓన్ ట్యాక్స్ రెవెన్యూ (ఎస్ఓటీఆర్) పెరిగింది. వచ్చే ఏడాది సర్కార్ ఆదాయం మరింత పెరుగుతుందని.. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి వచ్చే నిధులు కూడా పెరుగుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. గతేడాదితో పోలిస్తే.. ఈసారి కాస్త అధికంగానే సర్కార్ బడ్జెట్ ప్రవేశపెట్టనున్నట్లు చర్చ జరుగుతోంది. దీంతో ఈసారి బడ్జెట్ రూ.3.26 లక్షల కోట్ల వరకు ఉండొచ్చని భావిస్తున్నారు. మరోవైపు.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన నేపథ్యంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మహిళా సంక్షేమం, సన్న బియ్యం కోసం భారీగా నిధులు కేటాయించేందు కు సర్కార్ సిద్ధమైనట్లు సమాచారం.

మిగతా 2లో

## అసెంబ్లీకి ముగ్గురు కొత్త విప్‌లు

- యెన్నం, విజయరమణా రావు, వేముల



**హైదరాబాద్, మార్చి 18 (ఎఎంఎస్) :** రాష్ట్ర శాసనసభలో ప్రభుత్వ కార్యకలాపాలను మరింత వేగవంతం చేసేందుకు, సభా వ్యవహారాలను సమన్వయం చేసేందుకు వీలుగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ముగ్గురు ఎమ్మెల్యేలను అసెంబ్లీ విప్‌లుగా నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణా రావు, మహబూబ్ నగర్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం విప్ లుగా నియమితులైన వారిలో ఉన్నారు. శాసనసభలో ఏదైనా బిల్లుపై ఓటింగ్ జరిగినప్పుడు లేదా ముఖ్యమైన చర్చలు జరిగినప్పుడు అధికార పార్టీ ఎమ్మెల్యేలందరూ హాజరయ్యేలా చూడటంలో విప్‌ల పాత్ర అత్యంత కీలకం. ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా ఎవరూ ఓటు వేయకుండా పార్టీ లైన్‌ను అమలు చేయడం వారి ప్రధాన బాధ్యత. బడ్జెట్ సమావేశాలు, ఇతర కీలక సెషన్ల నేపథ్యంలో ఈ నియామకాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. రాజకీయంగా అనుభవం ఉన్న నాయకులకు ఈ బాధ్యతలు అప్పగించడం ద్వారా సభలో ప్రభుత్వ పట్టును మరింత బలోపేతం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నట్లుగా తెలుస్తోంది. తాజా నియామకాలపై సదరు ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రికి, పార్టీ అధిష్టానానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

# 'మహా'లో 11 మంది లొంగుబాటు

## గడ్చిరోలిలో లొంగిపోయిన వారిలో కీలక మావోయిస్టు నేతలు



**నేషనల్ డెస్క్, మార్చి 19 :** మహారాష్ట్రలోని గడ్చిరోలిలో మావోయిస్టులకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ప్రభుత్వ లొంగుబాటు, పునరావాస విధానానికి ఆకర్షితులై, హింసా మార్గాన్ని వీడి 11 మంది కీలక మావోయిస్టులు గురువారం అక్కడి పోలీసుల ఎదుట లొంగిపోయారు. వారిలో డివిజనల్ కమిటీ మెంబర్ లాలు అలియాస్ మంగూ పోర్యామి, ఏరియా కమిటీ సెక్రటరీ కమలేష్ అలియాస్ గుండు జుగా మడావిలతో పాటు ఏడుగురు కమాండర్ స్థాయి నేతలు, ఇద్దరు సెక్షన్ స్థాయి సభ్యులు పోలీసుల ఎదుట సరెండర్ అయ్యారు. లొంగిపోయిన పదకొండు మంది మావోయిస్టులపై మహారాష్ట్ర ప్రభుత్వం గతంలోనే భారీ రివార్డులను ప్రకటించింది. వీరిపై కలిపి మొత్తం రూ.68 లక్షల నగదు రివార్డు ఉంది. 2025 నుంచి ఇప్పటివరకు 123 మంది లొంగిపోయినట్లు వెల్లడించిన గడ్చిరోలి పోలీసులు వెల్లడించారు. అత్యంత కీలకమైన పదవుల్లో ఉన్న వారు లొంగిపోవడంతో గడ్చిరోలి జిల్లాలో మావోయిస్టు నెట్‌వర్క్ మరింత బలహీనపడినట్లయింది.

# చిత్ర పరిశ్రమకు చేయూత

## తెలుగు సినీ పరిశ్రమ హాలీవుడ్ స్థాయికి ఎదగడం అభినందనీయం

### తెలుగు సినిమాలతో అనేక సందేశాత్మక మార్పులు : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్, మార్చి 19 (వుదయం ప్రతినిధి) :** తెలుగు చిత్ర పరిశ్రమ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన సహకారం అందిస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. తెలుగు చిత్ర పరిశ్రమ హాలీవుడ్ స్థాయికి ఎదగడం ఈ ప్రాంత ప్రజలకు గర్వకారణమన్నారు. అనేక సందేశాత్మక తెలుగు సినిమాలు ప్రజల్లో మార్పునకు నాంది పలికాయని చెప్పారు. గురువారం హైదరాబాద్ లోని మాదాపూర్ హైటెక్స్ కన్వెన్షన్ సెంటర్ లో తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డుల ప్రదానోత్సవం అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావు, మెగాస్టార్ చిరంజీవి, టీఎఫ్‌డీసీ దిల్ రాజు హాజరయ్యారు. ఈ వేదికపైనే జ్యూరీ సభ్యులకు మెమొంటోలతో పాటు నగదు పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ తెలంగాణ ఆత్మను ప్రపంచానికి పరిచయం చేసిన మహనీయుడు గద్దర్. ఆయన పేరిట అవార్డులు ఇవ్వడం అంటే ప్రభుత్వ ఆలోచన ఏమిటో ప్రపంచానికి చెప్పడమే అన్నారు. తెలుగు సినిమా తెలంగాణ రాష్ట్రానికే పరిమితం కాకుండా ప్రపంచానికే తలమానికం కావాలని సీఎం రేవంత్ రెడ్డి గద్దర్ పేరిట సినిమా అవార్డులను తిరిగి ప్రారంభించారని చెప్పారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం సినిమా అవార్డులు ఇవ్వలేదన్నారు. గద్దర్ ఫిలిం అవార్డుల ఫంక్షన్ కోసం ఎంతో బిజీగా ఉండే ప్రముఖ నటులు హైద్రాబాద్ కు వచ్చినందుకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ధన్యవాదాలు తెలిపారు. సామాజిక సందేశాత్మక సినిమాలను పారదర్శకంగా ఎంపిక చేసిన ఫిలిం డెవలప్మెంట్ కౌన్సిల్, జ్యూరీ సభ్యులకు భట్టి విక్రమార్క అభినందనలు తెలిపారు. కాగా ఇప్పటికే ప్రభుత్వం గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్-2025 విజేతలను ప్రకటించింది.

గురువారం మాదాపూర్ హైటెక్స్ కన్వెన్షన్ సెంటర్ లో జరిగిన గద్దర్ సినీ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు, ఫిలీం డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు, బాలీవుడ్ హిరోయిన్ మాధురీ దీక్షిత్, జెనిలియా దంపతులు



## కవిత పార్టీకి లైన్ క్లియర్?

### ఆమె అభ్యర్థనపై నిర్ణయం తీసుకోవాలని ఇసికి ఢిల్లీ హైకోర్టు సూచన



**హైదరాబాద్, మార్చి 19 (వుదయం ప్రతినిధి) :** కొత్త రాజకీయ పార్టీ నమోదు వ్యవహారంలో కల్వకుంట్ల కవితకు ఢిల్లీ హైకోర్టులో ఊరట లభించింది. కవిత కొత్త పార్టీ అంశంపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని ఈసీకి సూచించింది. 'తెలంగాణ ప్రజా జాగృతి' పేరుతో నూతన రాజకీయ పార్టీ నమోదు కోసం కవిత ఈ ఏడాది జనవరి 23న కేంద్ర ఎన్నికల సంఘానికి దరఖాస్తు చేసుకున్నారు.

మిగతా 2లో

# వందేమాతరం పాడాల్సిందే

## లేదంటే లోపలేస్తాం

- జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఎంఐఎం అరాచకాలను ఎండగడతాం
- రైతు సంక్షేమంపై ప్రభుత్వానిది ద్వంద్వ నీతి
- రైతు కూలీలు, కౌలు రైతులకు పెట్టుబడి సాయం ఏమైందీ?
- కరీంనగర్‌లో కేంద్ర మంత్రి బండి సంజయ్



**కరీంనగర్, మార్చి 19 (వుదయం ప్రతినిధి) :** దేశంలో ఉండాలంటే వందేమాతరం పాడాల్సిందేనని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. లేదంటే లోపల వేస్తామని హెచ్చరించారు. అసెంబ్లీలో గవర్నర్ శుక్లా ప్రసంగంపై ధన్యవాద తీర్మనంపై చర్చ సమయంలో జరిగిన వందేమాతరం ఆలాపన సమయంలో ఎంఐఎం ఎమ్మెల్యేలు సభ నుంచి బయటకు వెళ్లిపోవటాన్ని బండి సంజయ్ తీవ్రంగా తప్పుబట్టారు. ఈ దేశంలో ఉండేవారు ఎవరైనా వందేమాతరం పాడాల్సిందేనని అన్నారు. తాము అధికారంలోకి వస్తే దీనిని తప్పనిసరి చేస్తామని.. అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గురువారం కరీంనగర్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎంఐఎం నేతల ఓటు బ్యాంకు రాజకీయాలకు సీఎం, స్పీకర్ తలొగ్గుతున్నారని విమర్శించారు. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఎంఐఎం అరాచకాలను ఎండగడతామని, అసదుద్దీన్ ఓవైసీ నడిపే విద్యా సంస్థల్లోనే ఉగ్రవాద మూలాలు ఉన్నాయని సంచలన ఆరోపణలు చేశారు. రైతు సంక్షేమంపై రాష్ట్ర ప్రభుత్వం ద్వంద్వ నీతి అవలంభిస్తోందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం రైతు కూలీలకు, కౌలు రైతులకు సాయం ఎందుకు అందడం లేదో ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. ఈ నెల 22న ఇస్తామన్న రైతు భరోసా సహా, పెండింగ్‌లో ఉన్న ఐదు వాయిదాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. గుజరాత్‌లో సబర్మతి నదిని అభివృద్ధి చేసినట్లు ఇక్కడా మూసీ పునరుజ్జీవం చేయాలన్నారు. అందు కోసం బుల్డోజర్లతో పేదల ఇళ్లను కూల్చివేస్తే బీజేపీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. బాధితులకు తగిన పరిహారం చెల్లించిన తర్వాతే ముందడుగు వేయాలని సూచించారు. పార్టీ ఫిరాయింపుల విషయంలో స్పీకర్ నిర్ణయం చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని బండి సంజయ్ చురకలంటించారు. శాసనసభ, స్పీకర్ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హిందూ బంధువులందరికీ పరాభవ నామ సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరి కష్టాలు తొలిగిపోయి సుఖశాంతులతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని చెప్పారు.

# ఈ యేడాది దేశానికి మంచి : కిషన్ రెడ్డి

## మోడీ నాయకత్వంలో అభివృద్ధి పథంలో భారత్

### బీజేపీ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఉగాది పంచాంగం



**హైదరాబాద్, మార్చి 19 (వుదయం ప్రతినిధి) :** ఈ ఏడాది దేశానికి ఎంతో మంచి భవిష్యత్తు ఉందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి చెప్పారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు పుష్కలంగా పండుతాయన్నారు. ప్రజలందరూ ఎటువంటి సమస్యలు లేకుండా సుఖశాంతులతో జీవించబోతున్నారని వెల్లడించారు. మన దేశ ఎదుగుదలను ఓర్వలేని శత్రువులకు, దేశద్రోహులకు మాత్రమేనని పరాభవం ఉంటుందని చెప్పారు. గురువారం బీజేపీ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన 'శ్రీ పరాభవ నామ సంవత్సర' ఉగాది వేడుకల్లో పాల్గొన్న కిషన్ రెడ్డి పంచాంగ శ్రవణం అనంతరం రాష్ట్ర ప్రజలకు, తెలుగు వారందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోని అనేక దేశాలు నేడు యుద్ధాలు, ఆర్థిక సంక్షోభాలు, శాంతిభద్రతల సమస్యలతో సతమతమవుతున్నాయని చెప్పారు. భారతదేశం మాత్రం ప్రధాని మోడీ శక్తివంతమైన నాయకత్వంలో అభివృద్ధి పథంలో నిరంతరం దూసుకుపోతోందని చెప్పారు. దేశ ప్రజలు ఐక్యంగా నిలబడి, ఏ సమస్యనైనా ఎదుర్కొనే ఆత్మవిశ్వాసంతో ఉన్నారని ఇది మనందరికీ గర్వకారణమన్నారు. ఉగాది పచ్చడిలోని షడ్రుచులు మన జీవితానికి ప్రతీక అని కిషన్ రెడ్డి చెప్పారు. సుఖదుఃఖాలు, కష్టనష్టాలు అన్నీ కలగలిసి ఉండటమే జీవితం అన్న ఆయన ఈ కొత్త సంవత్సరంలో భారతదేశానికి మరింత అభివృద్ధి, శాంతి, సుభిక్షం కలగాలని ఆకాంక్షించారు.



# నేడే రాష్ట్ర బడ్జెట్

మొదటి పేజీ తరువాయి

ఈ సారి బడ్జెట్ లో రాష్ట్ర ప్రభుత్వం ఇతర రాష్ట్రాల్లో లేని విధంగా వ్యవసాయ రంగానికి భారీ ఎత్తున నిధులు కేటాయించే అవకాశాలు కనిపిస్తున్నాయి. రైతు భరోసా, రైతు బీమా, సన్న వడ్ల బోనస్ వంటి పథకాలకు పెద్ద ఎత్తున నిధులను కేటాయించనున్నట్లు సమాచారం. అనుబంధ శాఖ అయిన సాగు నీటి ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ చేసేందుకు రూ.5 వేల కోట్ల వరకు అవసరం అవుతాయని అంచనా వేస్తున్నారు. వాటికి కూడా ఈ బడ్జెట్‌లో నిధులను కేటాయించనున్నారు. తుమ్మిడిహెట్టి, పాలమూరు–రంగారెడ్డి, సీతారామ, కొడంగల్ నారాయణ్‌పేట్ ఎత్తిపోతల పథకం, ఎస్ఎల్‌బీసీలకు ఈ బడ్జెట్‌లో రేవంత్ రెడ్డి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. అలాగే కాలేజీ యువతులకు ఈవీ స్కూటీలను ఇస్తామని హామీ ఇచ్చిన నేపథ్యంలో.. ఈ బడ్జెట్‌లో వీటికి కూడా నిధులు కేటాయించే అవకాశాలు ఉన్నాయి. ఇక విద్యా రంగానికి కూడా మరిన్ని కేటాయింపులు చేసే అవకాశాలు ఉన్నాయి. ఈ బడ్జెట్‌లో ఉద్యోగులకు పీఆర్సీ అమలు, డీఏల విడుదల, రిటైర్డ్ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిల కోసం వీలైనన్ని ఎక్కువ కేటాయింపులు చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. మూసీ పునరుజ్జీవం, ఆర్ఆర్ఆర్, ఎయిర్‌పోర్టులు, హైదరాబాద్ మెట్రో రెండో దశ, స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ హాస్టల్స్ వంటి వాటికి భారీగా నిధుల కేటాయింపు ఉండే అవకాశాలు ఉన్నాయి. చివరగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న పథకాలకు.. మ్యాచింగ్ గ్రాంట్లను ఇచ్చి ఆ నిధులను వాడుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఉపాధి హామీ పథకంలో రాష్ట్రాల వాటా 40 శాతం ఉండాలని కేంద్ర ప్రభుత్వం నిబంధన పెట్టగా.. రాష్ట్రంపై రూ.1800 కోట్ల భారం పడుతుందని అంచనా వేస్తున్నారు. వాటికి అనుగుణంగా బడ్జెట్‌లో కేటాయింపులు కేటాయించనున్నారు.

# సాదా బైనామాలకు పరిష్కారం

మొదటి పేజీ తరువాయి



రైతులు బాగున్నప్పుడే రాష్ట్రం బాగుంటుందన్న సీఎం... రాష్ట్రంలో 25.35 లక్షల రైతు కుటుంబాలకు రూ. 20,616 కోట్ల మేరకు రుణమాఫీ చేసి రైతులను ఆత్మగౌరవంతో బతకడానికి ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని వివరించారు. ప్రతి ఎకరాకు రూ. 12 వేల చొప్పున రైతు భరోసా అందిస్తున్నామనీ ఇప్పటికే రూ. 18 వేల కోట్లు రైతు భరోసా కింద అందించినట్లు చెప్పారు. పండించిన పంటలపై రైతుల్లో విశ్వాసం కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమన్నారు. వ్యవసాయ రంగానికి ఉచిత కరెంట్, పంటలకు గిట్టుబాటు ధర కల్పించడం, రుణమాఫీ చేయడం, రైతుభరోసా అందించడంతో పాటు రైతు బీమా అమలు చేయడం వంటివన్నీ రైతు సంక్షేమం, అభివృద్ధి కోసం తీసుకున్న నిర్ణయాలన్నారు. ప్రభుత్వం రైతుల కోసం ప్రయత్నాలు, నిర్మిస్తున్న సాగునీటి ప్రాజెక్టులు, సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలన్నీ దేశంలో తెలంగాణ ప్రతిష్టను పెంపొదిస్తాయన్నారు. మన పొలాల్లో సమృద్ధిగా పంటలు పండినప్పుడే రాష్ట్రం సుఖశాంతులతో విలసిల్లుతుందని సీఎం అభిప్రాయపడ్డారు. కాగా ఈ వేడుకల్లో ప్రముఖ జ్యోతిష్యులు డాక్టర్ బాచంపల్లి సంతోష్ కుమార్ శాస్త్రి పంచాంగ శ్రవణం చేశారు. కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ ఆలయాలకు చెందిన అర్చకులను సీఎం రేవంత్ రెడ్డి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, పలువురు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# కవిత పార్టీకి లైన్ క్లియర్?

మొదటి పేజీ తరువాయి




అయితే ఈ విషయంలో ఈసీ నిర్ణయం తీసుకోవడంలో జాప్యం జరిగింది, దీంతో తమ దరఖాస్తును కేంద్ర ఎన్నికల సంఘం వేగంగా పరిశీలించి నిర్ణయం వెలువరించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ ఇటీవల కవిత ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. కవిత పిటిషన్‌పై గురువారం విచారణ జరిపిన కోర్టు.. తెలంగాణ ప్రజా జాగృతిపై వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకోవాలని ఎన్నికల కమిషన్‌కు సూచించింది. కవిత దరఖాస్తులో లోపాలున్నాయని గతంలో కోర్టుకు ఎన్నికల కమిషన్ చెప్పగా లోపాలన్నీ సరిచేసినట్లు తాజాగా కవిత తరఫున న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. సాంకేతిక తప్పులు సరిచేసి ఈసీకి మళ్లీ దరఖాస్తు చేశామని కోర్టుకు వివరించారు. ఈసీ స్పందిస్తూ కవిత కొత్త పార్టీ దరఖాస్తుపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని వెల్లడించింది. ఈసీ త్వరగా నిర్ణయం తీసుకుంటామనడంతో కోర్టు విచారణ ముగించింది.



# సేవ్ బర్డ్స్ రైతు నేస్తానికి ముప్పు

**వాతావరణ కాలుష్యం**
**సెల్ ఫోన్ రేడియేషన్ తో**
**కనుమరుగవుతున్న పిచ్చుకలు**
**సంరక్షణకు నడుంకట్టిన అనంతుల రమేష్**
**నేడు ప్రపంచ పిచుకల దినోత్సవం**

**కరీంనగర్, మార్చి 19(వుదయం ప్రతినిధి) :** ఒకప్పుడు విరివిగా కనిపించే పిచ్చుకలు నేడు అరుదుగా కనిపిస్తున్నాయి.. పట్టణీకరణ ఎంత వేగంగా జరుగుతుందో అంతే వేగంగా పిచ్చుకల సంఖ్య తగ్గిపోవడం బర్డ్ లవర్స్ ని కలచివేస్తుంది.. జీవ వైద్యంలో పిచ్చుకదే ప్రముఖ పాత్ర..

వాతావరణ మార్పులు పిచ్చుకలపై బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగిస్తున్నాయి. తెలతెలవారుతుండగా ఒకప్పుడు పక్షుల కిలకిలరావాలు పల్లెసీమలను అలరించేవి. పొలాల్లో పురుగుపుట్రా తింటూ రైతుకు ఎంతో మేలు చేసేవి. శరవేగంగా మారుతున్న పట్టణీకరణ, సెల్‌టవర్ల తరంగాలు, పొలాల్లో




విషపూరిత పురుగుమందుల వాడకం పక్షుల మనుగడకు ప్రతికూలంగా పరిణమించింది. పిచ్చుకలైతే దాదాపు అంతరించిపోతున్నాయి. ఈ తరుణంలో పిచ్చుకల సంరక్షణ కోసం



నడుంకట్టాడు.కరీంనగర్ కిసాన్ నగర్ కు చెందిన అనంతుల రమేష్ . తన ఇంటి ఆవరణాన్ని పిచ్చుకలకు ఆవాసంగా మార్చారు.. పిచ్చుకల కోసం ఇంటి ఆవరణంలో కృత్రిమ గూళ్ళు, తినడానికి గింజలు, ఇంటి చుట్టు మట్టి చిప్పల్లో నీళ్లు ఇంటి చుట్టూ పచ్చని చెట్లు ఉండడంతో . వందలాది పిచ్చుకలు వచ్చి అక్కడ ఏర్పాటు చేసిన గూళ్ళ ఏర్పాటు చేసుకుని, గుడ్లు పెట్టి.. సంతానోత్పత్తి చేస్తున్నాయి. ఉదయం గుంపులుగా వచ్చే పక్షులు కిల కిల రావాలతో ఇంటిల్లి పాది నిద్ర లేస్తారు అక్కడికి వచ్చే పక్షులను చూడడానికి స్కూలుకు వెళ్లి చిన్న పిల్లలు చుట్టుపక్కల వారు వచ్చి పక్షుల కిలకిల రావాలని చూస్తూ ఆనందిస్తారు.. "సొంత పిల్లల్లా చూసుకుంటాం. ఉదయం పిచ్చుకల కిలకిల రావాలతోనే నిద్రలేస్తాం.. మా ఇంటికి విచ్చేసిన పిచ్చుకలు ఉదయం నుండి సాయంత్రం వరకు మా ఇంటి చుట్టూ ఉన్న పచ్చని చెట్ల పైన సందడి చేస్తాయి.. వాటికి అనువుగా ఉండేందుకు కృత్రిమ గుళ్లను , ప్రత్యేకమైన బర్డ్ ఫీడర్స్ ను ఏర్పాటు చేశాం..దీంతో మా పిల్లలు కూడా ఎంతో ఇష్టంగా వీటికి తిండి గింజలు మంచినీటిని ఏర్పాటు చేస్తారు. ప్రతిరోజు వచ్చి కిచకిచమంటూ సందడి పిచ్చుకలతో మా ఇంటి చుట్టు పక్కల వారు ఎక్కువ సమయం మా ఇంట్లోనే గడుపుతారు.

## పెద్దపల్లి నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలి

**పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు**



**పెద్దపల్లి మార్చి 19 (వుదయం ప్రతినిధి) :** శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని పెద్దపల్లి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన పంచాంగ శ్రావణ పఠాన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న గౌరవ పెద్దపల్లి శాసనసభ్యులు శ్రీ.చింతకుంట విజయరమణా రావు తదుపరి ఎమ్మెల్యే విజయరమణా రావు గారు పోలీస్ అధికారులకు, కౌన్సిలర్లకి ,సర్పంచ్ లకు కాంగ్రెస్ పార్టీ నాయకులకు,కార్యకర్తలకు ఉగాది పచ్చడిని వితరణ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణా రావు మాట్లాడుతూ పెద్దపల్లి నియోజకవర్గ ప్రజలందరికీ పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలియజేస్తూ ఈ నూతన సంవత్సరంలో పెద్దపల్లి పట్టణ ప్రజలందరూ సుఖ సంతోషాలతో,ఆయురారోగ్యాలతో ఉండాలని రైతులు సైతం పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య, కౌన్సిలర్లు,ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ ప్రవీణ్ కుమార్,సర్పంచులు,అర్చకులు కొండపాక శ్రీనివాస చార్యులు,శివ మరియు కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు,నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రూప్ వన్ అభ్యర్థిని అభినందించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**కరీంనగర్, మార్చి 19(వుదయం ప్రతినిధి) :** రాష్ట్రంలోని అత్యున్నత పదవి గ్రూప్ 1 లో కరీంనగర్ పట్టణంలోని మంకమ్మ తోటకు చెందిన బత్తుల శివ కుమార్ డీఎస్పీ గా ఎంపికై ట్రైనింగ్ ముగించుకొని మొదటిసారి జిల్లాకు విచ్చేసిన సందర్భంగా చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ డిసిసి అధ్యక్షులు మేడిపల్లి సత్యం ని కరీంనగర్ లోని వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసినారు. ఈ సందర్భంగా చొప్పదండి శాసన సభ్యులు, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు డా , మేడిపల్లి సత్యం బత్తుల శివ ని శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేసినారు.

## బాలికలకు ఎయిర్ హోస్టస్ ట్రైనింగ్



**పెద్దపల్లి మార్చి 19 (వుదయం ప్రతినిధి) :** పెద్దపల్లి జిల్లా నుండి 20 మంది అమ్మాయిలను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని గో ఫ్లై ఇంటర్నేషనల్ వారి వద్ద ఎయిర్ హోస్టస్ ట్రైనింగ్ 6 నెలలు కోర్స్ కి పంపివ్వడం జరిగింది. 12 మంది అమ్మాయిలు వివిధ ఉద్యోగాలకు ఎంపికైనట్లు జిల్లా యువజన, క్రీడాధికారి సురేష్ తెలిపారు. ఈ జిల్లాలోని బాలికలకు ప్రోత్సాహించాలనే ఉద్దేశ్యం తో ట్రైనింగ్ పంపివ్వడం జరిగింది. ఇదేవిధంగా జిల్లాలోని బాలికలను ఈ ట్రైనింగ్ కు సంబందించిన అన్ని ఖర్చులు మేమే చెల్లిస్తామని కలెక్టర్ గారు తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగం పొందిన వారిని కలెక్టర్ గారు అభినందించారు. ఈ కార్యక్రమంలో గో ఫ్లై డైరెక్టర్ విశ్వరూపిణి, వ్యాయామ ఉపాధ్యాయులు కుమార్, ఉద్యోగం పొందిన విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

## భీమన్న ఆలయంలో ఉగాది పంచాంగం



**వేములవాడ మార్చి19(వుదయం ప్రతినిధి) :** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి దేవాలయంలో శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉగాది పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం సాయంత్రం 4:30 గంటలకు ఆలయ ప్రాంగణంలో పంచాంగ శ్రవణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ ఉప ప్రధాన అర్చకులు చంద్రగిరి శరత్ నిర్వహించగా, ప్రభుత్వం విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ఆలయ ఈవో రమాదేవి చేతుల మీదుగా పండితులకు ,అర్చకులకు సన్మానం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కి స్వామివారి శేష వస్త్రం కప్పి ఆశీర్వచనాలు అందజేశారు.

## కార్పొరేటర్ ఏన్నంలక్ష్మి ప్రకాష్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు

**కరీంనగర్ మార్చి19(వుదయం ప్రతినిధి) :** కరీంనగర్ నగరపాలక సంస్థ49 వ డివిజన్ కార్పొరేటర్ ఏన్నం లక్ష్మి ప్రకాష్ ఆధ్వర్యంలో ఉగాది పరాప నామ నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని కార్పొరేటర్ లక్ష్మి ప్రకాష్ మున్సిపల్ కార్మికులందరికీ నూతన సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలియజేసి , ఉగాది పచ్చడి, భక్షాలు, స్వీట్లు పంపిణి చేశారు. ఈ సందర్భంగా కార్మికులందరినీ శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు లంబు సుధాకర్ రెడ్డి, ముదుగంటి ప్రవీణ్, గాదగొని రమేష్ గౌడ్, జవాన్ లక్ష్మయ్య తో పాటు కార్మికులు పాల్గొన్నారు.

## పంచముఖి ఆంజనేయ దేవాలయంలో ఉగాది వేడుకలు

**కరీంనగర్, మార్చి 19, వుదయం ప్రతినిధి :** కరీంనగర్ నగరపాలక సంస్థ ఎనిమిదో డివిజన్ అలుగునూరు పరిధిలోని శ్రీ వెంకటేశ్వర కాలనీలో గల శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయంలో ఉగాది పర్వదిన మహోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి.వేద పండితులు, ఆలయ అర్చకులు తిరునగిరి వెంకటాద్రి స్వామి, తిరునగిరి హర్షవర్ధన్ ల ఆధ్వర్యంలో దేవాలయంలో శ్రీ పట్టాభి రామచంద్రస్వామి, పంచముఖ ఆంజనేయస్వామి దేవతలకు ప్రత్యేక పూజలు చేపట్టి, పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈ సందర్భంగా పండితులు తిరుమలగిరి వెంకటాద్రి స్వామి పంచాంగ శ్రవణం వినిపించి, ఉగాది, పరాభ నామ సంవత్సర విశిష్టత గురించి ఆధ్యాత్మిక సందేశాన్ని తెలియజేశారు. 'పరాభవ' నామ సంవత్సరం – వైఫల్యం నుంచి వైభవం వైపు ప్రయాణం చేసేలా కొనసాగుతుందన్నారు."తెలుగు వారి పండుగలలో ఉగాదికి ఒక ప్రత్యేక స్థానం ఉందనీ, ఇది కేవలం క్యాలెండర్ మారే రోజు మాత్రమే కాదు, మన ఆలోచనలను, ఆశయాలను కొత్తగా నిర్దేశించుకునే సమయం అన్నారు."అయితే, 2026 మార్చి 19న ప్రారంభం కాబోయే కొత్త ఏడాదికి 'పరాభవ' అనే పేరు ఉండటం చాలా మందిలో ఆసక్తిని, మరికొందరిలో ఆందోళనను కలిగిస్తోందన్నారు. "సాధారణంగా 'పరాభవం' అంటే అవమానం లేదా ఓటమి అని మనం భావిస్తాం "కానీ, ఈ పేరు వెనుక ఉన్న లోతైన ఆధ్యాత్మిక అర్థం తెలిస్తే, మనం ఈ ఏడాదిని ఎంత ఉత్సాహంగా



ఆహ్వానించాలో అర్థమవుతుందన్నారు.'పరాభవ' అనే పదాన్ని విడదీసి చూస్తే,పరా: అంటే అత్యున్నతమైన, గొప్పదైన లేదా అతీతమైన అని అర్థం అన్నారు.భవ: అంటే పుట్టుక, లేదా స్థితి అని అర్థం అన్నారు.అంటే, మనలోని అజ్ఞానాన్ని, అహంకారాన్ని, బలహీనతలను ఓడించి (పరాభవం) ఒక ఉన్నతమైన స్థితిలో కొత్తగా జన్మించడమే ఈ ఏడాది యొక్క అసలు సందేశం అని తెలియజేశారు.నేనుఅనే అహంకారాన్ని తగ్గించుకుని, వినయంతో కూడిన జ్ఞానాన్ని సంపాదించాలన్నారు.మార్పు ఎప్పుడూ చేదుగానే ఉంటుందని,ఉగాది పచ్చడిలో వేపపువ్వు చేదును కూడా మనం ఎందుకు ఇష్టంగా స్వీకరిస్తాం.. ఎందుకంటే, ఆ చేదు మన శరీరానికి ఆరోగ్యాన్ని ఇస్తుంది..అలాగే, జీవితంలో వచ్చే కొన్ని కఠినమైన మార్పులు ప్రారంభంలో ఇబ్బందిగా అనిపించినా, అవి మనల్ని మరింత దృఢంగా మారుస్తాయి. 'విశ్వావసు' సంవత్సరంలో మనం నేర్చుకున్న పాఠాలను పునాదిగా చేసుకుని, ఈ 'పరాభవ' సంవత్సరంలో మనల్ని మనం ఒక కొత్త వ్యక్తిగా మలుచుకోవాలన్నారు. "2026 ఉగాది మనకు ఒక కొత్త ఆరంభం.2026 ఉగాది మనకు ఇచ్చే గొప్ప అవకాశం ఏమిటంటే మనల్ని మనం పునర్ నిర్మించుకోవడం.ఓటమిని చూసి కుంగిపోకుండా, దాన్ని గెలుపుకు మెట్టుగా మార్చుకోవడమే ఈ పరాభవ నామ సంవత్సర విశిష్టత.అని పండితులు వెంకటాద్రి స్వామి ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పంచముఖ ఆంజనేయస్వామి ధర్మకర్తల సేవా సమితి అధ్యక్షులు చిందం నరసయ్య, కమిటీ బాధ్యులు గడప శేఖర్, సల్ల రాజయ్య, సిరిపురం శ్రీనివాస్, ఐతం వెంకన్న,బూట్ల కరుణాకర్, రాజేందర్ , సుధాకర్ రెడ్డి, రాజిరెడ్డి , బైరి లక్ష్మయ్య , యమా సాగర్, కొత్తూరి శ్రీనివాస్, చిందం అంజి , మృత్యుంజయం, రేవంత్ తదితరులు పాల్గొన్నారు.

## జగ్గారెడ్డి ఆధ్వర్యంలో సంగారెడ్డి రామ్ మందిర్ లో ఘనంగా ఉగాది సంబురాలు



- ఉగాది వేడుకల్లో పాల్గొన్న టీజీఐఐసి చైర్ పర్సన్
- నిర్మలా జగ్గారెడ్డి, జయా చైతన్య రెడ్డి, భరత్ సాయు రెడ్డి
- పేలాల లడ్డూ ప్రసాదం... అందుకున్న వారికి కలుగును అదృష్టం
- గత కొన్ని దశబ్దాలుగా రామ్ నగర్
- రామ్ మందిర్ లో పేలాల లడ్డూ ప్రసాదం విసిరే ఆచారం
- పేలాల లడ్డు ప్రసాదం కోసం
- రామ్ మందిర్ కు తరలి వచ్చిన వేలాది భక్తులు
- భజనలు, భక్తి గీతాలు, ఉట్టి కొట్టడం, లడ్డూ
- ప్రసాద వితరణ కార్యక్రమాలతో సందడిగా ఉగాది వేడుకలు

**సంగారెడ్డి మార్చి 19 (వుదయం ప్రతినిధి) :** ప్రతీ ఏడూ మాదిరిగా ఈ ఏడాది రామ్ మందిర్ లో ఉగాది వేడుకలు అంబరాన్ని అంటాయి. టీపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యం లో రామ్ నగర్ రామ్ మందిర్ లో ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. జగ్గారెడ్డి స్వయంగా పాటలు పాడుతూ, భక్తి గీతాలు ఆలపిస్తూ భజన లో పాల్గొన్నారు. పేలాల లడ్డు ప్రసాదం తో భజన కీర్తనలు పాడుతూ రామ్ నగర్ లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం రామ్ మందిర్ లో శ్రీ కృష్ణ భగవానుడి ఉట్టి కొట్టడం నిర్వహించారు. అనంతరం తరాలుగా వస్తున్న ఆచారం ప్రకారం రామ్ మందిర్ పై నుండి పేలాల లడ్డూ ప్రసాదాన్ని భక్తుల పైకి విసిరేశారు. ఉగాది రోజు ఈ లడ్డూ ప్రసాదాన్ని అందుకుంటే అదృష్టం వరిస్తుందని భక్తులకు నమ్మకం. ఈ ప్రసాదాన్ని అందుకోవడానికి వేలాది మంది భక్తులు రామ్ మందిర్ కు చేరుకుని ప్రసాదాన్ని అందుకోవడానికి పోటీలు పడ్డారు. ఈ కార్యక్రమం లో టీజిఐఐసి నిర్మలా జగ్గారెడ్డి తో పాటు జగ్గారెడ్డి కూతురు జయా చైతన్య రెడ్డి, కొడుకు భరత్ సాయి రెడ్డి లతో పాటు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## కెసిఆర్ తోనే పామాయిల్ పంటకు మహర్ధశ

**దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి**

**వుదయం, దుబ్బాక ( మార్చి 19) :** తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కృషితోనే సిద్దిపేట జిల్లాలో పామాయిల్ పరిశ్రమ కు మహర్దశ వచ్చిందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట్టలోని ఫామాయిల్ ఫ్యాక్టరీ వద్ద జరిగిన కిసాన్ మేళా కార్యక్రమంలో మంత్రులతో కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడారు. పామ్ ఆయిల్ పంట అవశ్యకతను గుర్తించిన కేసీఆర్ సిద్దిపేట జిల్లాలోని నర్మెట ప్రాంతంలో పామాయిల్ ఫ్యాక్టరీ కి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. గతంలో ఫామాయిల్ అంటే ఖమ్మం జిల్లా లోని అశ్వరావుపేట గుర్తుకు వచ్చేదని నేడు దానికి దీటుగా నర్మెటలో ఫ్యాక్టరీ పెట్టడం మూలంగా సిద్దిపేట ప్రాంతంలో ఫామ్ ఆయిల్ సాగు పెద్ద ఎత్తున విస్తరించడం జరిగిందన్నారు. ఫామ్ ఆయిల్ పంటకు గాలిలో తేమ శాతం అవసరం ఉంటుందని మల్లన్న సాగర్ ప్రాజెక్టు, రంగనాయక సాగర్ ప్రాజెక్టు మూలంగా గాలిలో తేమ శాతం పెరిగిందని పంట సాగుకు అనుకూలంగా మారిందన్నారు. ఈ ప్రాంతంలో పామాయిల్ పంట సాగు కోసం మాజీ మంత్రివర్యులు తన్నీరు హరీష్ రావు అహర్నిశలు కృషి చేయడం జరిగిందని గుర్తు చేశారు.నేడు పామాయిల్ సాగు చేయడానికి రైతులు ముందుకు వస్తున్నారని ప్రభుత్వం సహకరించాలని ఆయన కోరారు.

## ఇఫ్తార్ వేడుకల్లో పాల్గొన్న చెరుకు శ్రీనివాస్ రెడ్డి



**వుదయం, దుబ్బాక (మార్చి 19) :** ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుంటుందని మైనార్టీ ల సంక్షేమానికి కట్టుబడి ఉందని నియోజక వర్గంలోని ప్రతి పేద వారికి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం రోజున దుబ్బాక నియోజకవర్గం రాయపోల్ మండలం సయ్యద్ నగర్ గ్రామంలో దావత్–ఏ–ఇఫ్తార్ వేడుకల్లో దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గంగా–జమున తహజీబ్‌కు నిదర్శనంగా మనం అన్ని పండుగలను కలిసిమెలసి జరుపుకోవడం మన సంస్కృతి అని రంజాన్ పండుగ క్రమశిక్షణ, దానగుణం సోదరభావాన్ని చాటుతుందని ఆయన కొనియాడారు.ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ మైనారిటీల సంక్షేమానికి కట్టుబడి ఉంటుందని నియోజకవర్గంలోని ప్రతి పేదవాడికి ప్రభుత్వం అందించే ఫలాలు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.పవిత్రమైన ఈ మాసంలో ముస్లిం సోదరులు చేసే ప్రార్థనల వల్ల రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, గ్రామ శాఖ మైనార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో ఉగాది ఘనంగా వేడుకలు

**పాల్గొన్న మంత్రి వివేక్ , పూజల హరికృష్ణ**
**సిద్ది పేట ప్రజలకు పరాభవ నామ ఉగాది సంవత్సర శుభాకాంక్షలు**




**వుదయం - సిద్దిపేట బ్యూరో (మార్చి 19) :** సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ క్యాంప్ కార్యాలయంలో ఘనంగా పరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ ఉత్సవాల్లో మంత్రి వివేక్ తో కలిసి సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పూజల హరికృష్ణ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉగాది పర్వదిన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలందరి సుఖ సంతోషాలతో అష్ట ఐశ్వర్యాలతో ఉండాలని భగవంతుని కోరుకున్నాను తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందాలని రాబోయే రోజుల్లో పేద ప్రజలకు మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేసే విధంగా కాంగ్రెస్ పార్టీ నాయకులకు ప్రభుత్వానికి బలాన్ని ఇవ్వాలని ఉగాది పండుగ సందర్భంగా దేవుడిని వేడుకున్నానని తెలిపారు. ఈ కార్యక్రమం లో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు అత్తు ఇమామ్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొమ్మల యాదగిరి,కలీముద్దీన్ అహ్మద్, కౌన్సిలర్ పయ్యావుల ఎల్లం యాదవ్,దాస అంజన్న పూజల గోపిక్రిష్ణ,డీసీసీ మహిళ అధ్యక్షులు ముద్దం లక్ష్మి చిన్న కోడూరు మండల కాంగ్రెస్ అధ్యక్షులు మీసం మహేందర్, అర్బన్ మండల బిక్షపతి,రాజ బహదూర్ రెడ్డి,కొత్త మహిపాల్ రెడ్డి,ఎర్ర మహేందర్,ఎల్లు శ్రీనివాస్ రెడ్డి,చెంది శ్రీనివాస్ ముదిరాజ్, గాయశుద్దీన్,మేరుగు రాజు, కరుణాకర్ భాగన్న,మహిళ అధ్యక్షులు మార్క పద్మ,అంబటి మహేష్,కృష్ణ వంశీ,అరవింద్ తదితరులు పాల్గొన్నారు.



# జాతీయం-అంతర్జాతీయం





## అయోధ్య రామ యంత్ర ప్రతిష్ఠ

### పాల్గొన్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము.. బాలరాముడికి పూజలు

**అయోధ్య :** భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అయోధ్యలోని రామ జన్మభూమి ఆలయాన్ని గురువారం నాడు దర్శించారు. బాలరామునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. టెంపుల్ కాంప్లెక్స్‌లో 'రామ యంత్ర' ప్రతిష్ఠలో పాల్గొన్నారు. ఉత్తర్‌ప్రదేశ్ గవర్నర్ ఆనందీబెన్ పటేల్, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కూడా రాష్ట్రపతి వెంట ఉన్నారు.
ఆలయ నిర్మాణంలో పనిచేసిన సుమారు ఆరువేల మంది కార్మికులను, అంగడి వ్యాపారులను, కళాకారులను ఈ కార్యక్రమానికి రామజన్మభూమి ఆలయ ట్రస్టు ఆహ్వానించింది. శ్రీరామ యంత్రాన్ని రాష్ట్రపతి ప్రతిష్ఠించి, హారతి ఇచ్చారు. అనంతరం టెంపుల్ కాంప్లెక్స్‌లోని ఏడు ఆలయాలను ఆమె దర్శించారు. ఈరోజుతో రామ్‌లల్లా నిర్మాణం పూర్తి కావడం విశేషమని, యావద్దేశ ప్రజలే కాకుండా విదేశీయులు సైతం ఇక నుంచి పూర్తి ఆలయాన్ని దర్శించుకోవచ్చని శ్రీరామ జన్మభూమి తీర్థ్ క్షేత్ర ట్రస్టు కోశాధికారి స్వామి గోవింద్ దేవ్ గిరి మహరాజ్ తెలిపారు. కాగా 2024 మే 1న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తొలిసారిగా రామాలయాన్ని సందర్శించారు. మరోసారి ఉగాది పర్వదినం సందర్భంగా అయోధ్య రాముని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు రామ యంత్ర ప్రతిష్ఠాపనలో పాల్గొనడం విశేషం.

## ఇరాన్ యుద్ధం.. ప్రపంచానికి పరీక్ష సమయం



**న్యూఢిల్లీ :** ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా పశ్చిమాసియా పరిణామాలు మన దేశానికే కాకుండా ప్రపంచానికే పరీక్షగా మారాయని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. దేశ ఇంధన అవసరాలు తీరేలా చూసుకోవడానికి సంబంధిత దేశాలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపింది. ఈ మేరకు విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ మీడియాతో మాట్లాడుతూ.. పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తున్నామని అన్నారు. కువైట్ యువరాజుతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట్లాడారని జైశ్వాల్ తెలిపారు. ఆయా దేశాలు, భాగస్వామ్య పక్షాలతో దౌత్యపరంగా చర్చలు జరుపుతున్నట్లు వెల్లడించారు. ఈ చర్చల ఫలితంగా రెండు ఎల్పీజీ నౌకలు హర్మూజ్ జలసంధి ద్వారా మన దేశానికి చేరుకున్నాయని తెలిపారు. చిన్న, మధ్య తరహా, ఇతర వినియోగదారులకు పంపిణీ చేసేందుకు గాను రాష్ట్రాలకు అధిక పరిమాణంలో బొగ్గును కేటాయించాలని బొగ్గు మంత్రిత్వ శాఖ ఇప్పటికే కోల్ ఇండియా, సింగరేణి కాలరీస్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు కేంద్ర అధికారులు వెల్లడించారు.

## అండర్‌సీ కేబుళ్లపై ఇరాన్ గురి..?

### ఐరోపా, ఆసియా, ఆఫ్రికాలోని ఇంటర్నెట్ ట్రాఫిక్‌లో వీటిదే ప్రధానపాత్ర
### ఎర్రసముద్రం అడుగునుంచి 17 కేబుళ్లు
### కమ్యూనికేషన్ వ్యవస్థలకు సముద్రగర్భ కేబుళ్లు అత్యంత కీలకం



**వుదయం,** పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధానికి ముగింపు ఎప్పుడో తెలియని అనిశ్చితి నెలకొంది. ఈ పరిస్థితుల్లో ప్రపంచదేశాల నెత్తిన మరో కత్తి వేలాడుతోంది..! ఇప్పటికే హర్మూజ్ అంతరాయాలు, గ్యాస్, చమురు క్షేత్రాలపై దాడులతో ఇంధన ధరలు భగ్గుమంటున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లు కుదేలవుతున్నాయి. చమురు క్షేత్రాలపై దాడులతో యుద్ధం మరోస్థాయికి చేరిన నేపథ్యంలో ఇంటర్నెట్‌పై ఇరాన్ గురిపెట్టనున్నట్లు ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

హర్మూజ్‌లో ఇరాన్.. ఎర్ర సముద్రం దక్షిణ ముఖద్వారం బాబ్ అల్ మందేబ్ జలసంధిలోని సముద్రగర్భ కేబుళ్లను హూతీలు టార్గెట్ చేస్తారా..? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ రెండుచోట్ల సముద్రం అడుగున వేల కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న ఈ కేబుళ్లు.. ప్రపంచ ఇంటర్నెట్‌కు అత్యంత కీలకం. వీడియో కాల్స్, ఈమెయిల్స్, బ్యాంకింగ్ లావాదేవీలు, ఏఐ సర్వీసులకు సంబంధించిన డేటానంతా మోసుకెళ్తాయి. ఎర్రసముద్రం అడుగునుంచి 17 కేబుళ్లు వెళ్తున్నాయి. ఐరోపా, ఆసియా, ఆఫ్రికాలోని ఇంటర్నెట్ ట్రాఫిక్‌లో వీటిదే ప్రధానపాత్ర. అలాగే పర్షియన్ గల్ఫ్‌లో కూడా. భారతదేశ విదేశీ డేటా కనెక్షన్లకు ఇవి కీలకం.

#### టెక్ కంపెనీల్లో వణుకు..

అమెజాన్, మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటి సంస్థలు గల్ఫ్ దేశాల్లో డేటాసెంటర్ల కోసం బిలియన్ల కొద్దీ డాలర్లను కుమ్మరించాయి. ఈ ప్రాంతాన్ని కృత్రిమ మేధకు ఒక ముఖ్యమైన కేంద్రంగా మార్చాలన్నది ఆ టెక్ సంస్థల ప్రణాళిక. ఆసియా, ఆఫ్రికా ఖండాల్లోని యూజర్లు, మార్కెట్లను డేటా సెంటర్లతో ఈ కేబుళ్లు అనుసంధానిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సీమైన్స్ పేలుడు, ఉద్దేశపూర్వకంగా కత్తిరించడం, ఏదైనా ప్రమాదం వంటివి వాటిని కొన్ని వారాలు లేక నెలలు పనిచేయకుండా చేస్తాయి. ఎందుకంటే.. దెబ్బతిన్న కేబుళ్లను సరిచేసేందుకు ప్రత్యేక నౌకలు ఆ జలసంధుల వద్దకు వెళ్లాల్సి ఉంటుంది. ప్రస్తుత పరిస్థితుల్లో అలా వెళ్లడం అసాధ్యంగా కనిపిస్తోంది. ఇరాన్ అనుబంధ గ్రూప్ హూతీ తన మిత్రులకు మద్దతుగా ఎప్పటికప్పుడు ఎర్రసముద్రంపై విరుచుకుపడుతుంటుంది. హమాస్‌పై ఇజ్రాయెల్ దాడులకు నిరసనగా 2024లో రెడ్‌సీలో పలు కేబుళ్లపై దాడులు చేసింది. దాంతో ఆసియా, ఆఫ్రికాలో ఇంటర్నెట్ వేగం నెమ్మదించింది. వాటిని సరిచేయడానికి నెలల సమయం పట్టింది. ఇప్పుడు హర్మూజ్‌లో ఇరాన్ సీమైన్స్‌ను పరిచిన సంగతి తెలిసిందే. ఇవి ఇంటర్నెట్‌కు ప్రమాదంగా పరిణమించాయి.

#### యాక్సెస్ పాయింట్లు ఉన్నాకానీ..

ఇదిలాఉంటే, ప్రస్తుతం సముద్రగర్భంలో 300కు పైగా కీలక ఫైబర్ ఆప్టిక్ లైన్లు ఉన్నాయి. ఫోన్‌కాల్స్, రోజువారీ జరిగే బిలియన్ డాలర్ల అంతర్జాతీయ నగదు లావాదేవీలు, దౌత్య సందేశాలు వంటివి వీటినుంచే సాగుతుంటాయి. ప్రపంచ కమ్యూనికేషన్లలో 90 శాతానికి ఇవే ఆధారం. శాటిలైట్ కనెక్షన్, ఉపరితల కేబుళ్లతోపాటు ప్రపంచ కమ్యూనికేషన్ వ్యవస్థలకు సముద్రగర్భ కేబుళ్లు అత్యంత కీలకంగా వ్యవహరిస్తాయి. సాధారణంగా, ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లు బహుళ యాక్సెస్ పాయింట్లను ఏర్పాటుచేస్తారు. ఏదైనా సమస్య వల్ల ఒకటి విఫలమైనా.. మిగిలిన పాయింట్ల నుంచి వినియోగదారులకు ఇంటర్నెట్ అందుతుంది. అయితే సేవలు నెమ్మదిస్తాయి.

## 'సిమెంట్-డ్రమ్' అదే ప్లాన్ !

### ప్రాణాలు దక్కించుకోవడానికి భార్యను ప్రియుడికే అప్పగించిన భర్త!

**లక్నో :** ఉత్తరప్రదేశ్‌లో ఒక వింతైన, భయంకరమైన ఉదంతం వెలుగులోకి వచ్చింది. సాధారణంగా పెళ్లి అంటే నూరేళ్ల పంట అనుకుంటారు, కానీ ఇక్కడ రాజ్ కుమార్ అనే వ్యక్తికి తన భార్య ఫోన్లో కనిపించిన మూడు పదాలు మరణ శాసనంలా అనిపించాయి. 'సిమెంట్ – డ్రమ్' ... ఈ పదాల వెనుక ఉన్న కిరాతక కోణాన్ని అర్థం చేసుకున్న ఆ భర్త, తన ప్రాణాలను కాపాడుకోవడానికి తన భార్యను ఆమె ప్రియుడితోనే పంపించేశాడు. రాజ్‌కుమార్ భార్యకు గత కొంతకాలంగా వేరే వ్యక్తితో అక్రమ సంబంధం ఉంది. తరచుగా గొడవ పడుతూ, తన ఆరు నెలల బిడ్డను కూడా వదిలేసి ప్రియుడి వద్దకు వెళ్ళిపోయేది. నిలదీసిన ప్రతిసారీ ఆమె తప్పించుకునే ప్రయత్నం చేసేది. ఒకరోజు ఫోన్ ఆమె మాట్లాడుతుండగా రాజ్‌కుమార్ ఆ ఫోన్‌ను లాక్కున్నాడు. అందులో అతనికి కనిపించిన దృశ్యాలు మైండ్ బ్లాక్ చేశాయి.
ఫోన్ లో ఉన్న ఫేస్ బుక్‌లో... హత్యలకు సంబంధించిన కథనాలు, వాటికి 'సిమెంట్ – డ్రమ్' అనే క్యాప్షన్లు, నగ్న చిత్రాలు ఉన్నాయి. దీంతో, తనను అంతమొందించేందుకు వాళ్లు ప్లాన్ చేస్తున్నారని రాజ్ కుమార్ భావించాడు. రాజ్ కుమార్ ఇంతగా భయపడటానికి ఒక బలమైన కారణం ఉంది. సరిగ్గా ఏడాది క్రితం (2025 మార్చిలో), మీరట్‌లో ముస్కాన్ రస్తోగి అనే మహిళ తన ప్రియుడితో కలిసి భర్త సౌరభ్‌ను చంపి, బాడీని 15 ముక్కలు చేసి, ఒక నీలి రంగు డ్రమ్ములో పెట్టి సిమెంటుతో సీల్ చేసిన ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. తన భార్య కూడా అదే ప్లాన్ వేస్తోందని రాజ్‌కుమార్ గ్రహించాడు. బిడ్డను పట్టించుకోకుండా, వంట చేయకుండా, తనను, తన సోదరులను చంపేస్తానని బెదిరిస్తున్న భార్యతో వేగలేక రాజ్ కుమార్ పోలీసులను ఆశ్రయించాడు. కౌన్సెలింగ్‌లో కూడా ఆమె తన ప్రియుడితోనే ఉంటానని తెగేసి చెప్పింది. దీంతో రాజ్‌కుమార్ ఒక నిర్ణయం తీసుకున్నాడు. తన ప్రాణాలు కాపాడుకోవడానికి, ఆమెను తన కళ్లముందే ప్రియుడికి అప్పగించి పంపించేశాడు.

## 200 బిలియన్ డాలర్లు యుద్ధం కోసం ఇవ్వండి!

### అమెరికా పార్లమెంట్‌కు పెంటగాన్ ప్రతిపాదన



**వాషింగ్టన్ :** ఇజ్రాయెల్‌తో కలిసి ఇరాన్‌పై భీకర యుద్ధం చేస్తోన్న అమెరికా.. ఇందుకోసం భారీగా ఖర్చుపెడుతోంది. ఇప్పటికే రూ.వేలాది కోట్ల విలువైన ఆయుధాలను వినియోగించగా.. రానున్న రోజుల్లో దీనిని కొనసాగించేందుకు భారీ ప్రణాళికలు సిద్ధం చేసుకుంటోంది. ఈ క్రమంలో 200 బిలియన్ డాలర్లకుపైగా నిధులు ఇవ్వాలని అమెరికా పార్లమెంట్‌కు చేసిన ప్రతిపాదనను ఆమోదించాలని పెంటగాన్ కోరినట్లు తెలిసింది. ఈ మేరకు వాషింగ్టన్ పోస్టు కథనాన్ని ప్రచురించింది. దీనిపై ఇరాన్ స్పందిస్తూ.. ఇజ్రాయెల్ అజెండాను అమలు చేసేందుకు సొంత పౌరుల పైనే అమెరికా భారం మోపుతోందని విమర్శలు గుప్పించింది.
''ఇరాన్, అమెరికాలపై రుద్దిన ఈ యుద్ధం మొదలై మూడు వారాలు మాత్రమే అయ్యింది. 200 బిలియన్ డాలర్లు అనేది చిన్న మొత్తమే. ఇజ్రాయెల్ అజెండా కోసం రూ.లక్షలాది కోట్లు ఖర్చుపెడుతున్నారు. అమెరికా ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసే ఈ చర్యల పట్ల ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుకు అమెరికన్లు కృతజ్ఞత చెప్పాలి. సామన్య అమెరికన్ల పైనే యుద్ధభారం పడుతోంది '' అని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ వ్యంగ్యంగా స్పందించారు.
ఈ యుద్ధంలో పాల్గొనడం అమెరికాకు ఇష్టం లేదని అరాగ్చీ ఇటీవల పేర్కొన్న విషయం తెలిసిందే. అమెరికాను నెతన్యాహు ఇందులోకి లాగారని అన్నారు. అమెరికాలోని కొందరు అధికారుల కారణంగా అక్కడి పౌరులు ఈ యుద్ధ భారాన్ని మోస్తున్నారని అన్నారు. మరోవైపు, ఇరాన్ గ్యాస్ క్షేత్రాలపై దాడి గురించి ఇజ్రాయెల్ తమకు చెప్పలేదని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు.

## కేరళ సీఎం పినరయి విజయన్ నామినేషన్ దాఖలు

### ధర్మదం నియోజకవర్గం నుంచి మూడోసారి పోటీ
### కాంగ్రెస్ నుంచి అబ్దుల్ రషీద్ | బీజేపీ అభ్యర్థిగా కె.రంజిత్
### ఏప్రిల్ 9నఎన్నికలు, మే 4న ఫలితాలు



**తిరువనంతపురం :** కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో నామినేషన్ల పర్వం ఊపందుకుంటోంది. సీపీఎం వెటరన్ నేత, ముఖ్యమంత్రి పినరయి విజయన్ కన్నూరు జిల్లా ధర్మదం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి గురువారం నామినేషన్ వేశారు. ఉదయం 11 గంటల ప్రాంతంలో తలస్సేరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి సీఎం చేరుకున్నారు. ఆయనకు కన్నూరు రిజిస్ట్రార్ ఎబీ సత్యన్ స్వాగతం పలికారు. అనంతరం నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి పినరయి విజయన్ అందజేశారు. ఈ కార్యక్రమానికి పార్టీ జిల్లా కార్యదర్శి కేకే రఘేష్, సీనియర్ నేతలు ఈపీ జయరాజన్, అసెంబ్లీ స్పీకర్ ఏఎన్ షంసీర్, పొలిటికల్ సెక్రటరీ పి.శశి తదితరులు హాజరయ్యారు.
ఎనభై ఏళ్ల పినరయి విజయన్ తన రాజకీయ జీవితంలో ఏడోసారి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ పడుతున్నారు. ధర్మదం నియోజకవర్గం నుంచి పోటీ చేస్తుండటం ఇది మూడోసారి. 2016, 2021 అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన ఇదే నియోజకవర్గం నుంచి గెలుపొందారు. అంతకుముందు మూడుసార్లు కుతుపరంబ నియోజకవర్గానికి, ఒకసారి పయ్యన్నూరు నియోజవర్గానికి ప్రాతినిధ్యం వహించారు. కాగా, పినరయి విజయన్‌పై అబ్దుల్ రషీద్‌ను కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ పోటీకి నిలిపింది. బీజేపీ తమ అభ్యర్థిగా కె.రంజిత్‌ను నిలబెట్టింది. దీంతో ధర్మదం నియోజకవర్గంలో కీలకంగా త్రిముఖ పోటీ నెలకొంది. కేరళ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఒకే విడతలో ఏప్రిల్ 9న జరుగనుంది. మే 4న ఫలితాలు వెలువడతాయి. కేరళ ప్రస్తుత అసెంబ్లీ పదవీకాలం మే 23తో ముగియనుంది.

## జలుక్‌బారీ బరిలో హిమంత బిశ్వ శర్మ

### అస్సాం అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల ప్రకటన
### తొలి విడుతలో 88 మంది అభ్యర్థులతో జాబితా
### కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరిన ప్రద్యుత్ బోర్డోలోయ్‌కు టికెట్



**గువాహటి :** అస్సాం అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే 88 మంది అభ్యర్థుల తొలి జాబితాను బీజేపీ గురువారం విడుదల చేసింది. ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ జలుక్‌బారీ నియోజకవర్గం నుంచి పోటీలో ఉన్నారు. భవానీపూర్-సోర్భోగ్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు రంజీత్ కుమార్ పోటీ పడుతున్నారు. ఇటీవలే కాంగ్రెస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరిన లోక్‌సభ ఎంపీ ప్రద్యుత్ బోర్డోలోయ్‌కు దిస్పూర్ టికెట్ ఇచ్చారు. నల్బరి నుంచి మంత్రి జయంత్ మల్లా బారువా పోటీ చేస్తున్నారు. బీజేపీ తొలి జాబితాలో ఆరుగురు మహిళలకు టిక్కెట్ లభించింది.

#### పోటీలో లేను.. ప్రతీక్ బోర్డోలోయ్...

అస్సాం ఎంపీ ప్రద్యుత్ బోర్డోలోయ్ బీజేపీలో చేరడంతో ఆయన కుమారుడు, కాంగ్రెస్ నేత ప్రతీక్ కీలక ప్రకటన చేశారు. మార్గెరీటా నియోజకవర్గం నుంచి తాను కాంగ్రెస్ టికెట్‌పై పోటీ చేయడం లేదని ప్రకటించారు. పార్టీ సభ్యుడిగానే తాను ఉంటానని తెలిపారు. తన తండ్రి మరో పార్టీలో చేరాలని నిర్ణయం తీసుకోవడంతో తాను కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయడం తగదని భావించినట్టు చెప్పారు. ఈమేరకు కాంగ్రెస్ అధ్యక్షుడు, సెంట్రల్ ఎలక్షన్ కమిటీ ఛైర్మన్ మల్లికార్జున్ ఖర్గేకు ఆయన లేఖ రాశారు. అస్సాం అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఒకే విడతలో ఏప్రిల్ 9న జరగనుంది. మే 4న ఫలితాలు వెలువడనున్నాయి.

## ఆరేళ్లలో 18వేల గుండెపోటు మరణాలు

**చండీగఢ్ :** హరియాణాలో గత ఆరేళ్లలో 18-45 ఏళ్ల వయసు వారు దాదాపు 18వేల మంది హార్ట్‌ఎటాక్‌తో మరణించినట్లు అసెంబ్లీలో హరియాణా ప్రభుత్వం వెల్లడించింది. యువతలో గుండెపోటు కారణంగా సంభవించిన మరణాలపై అసెంబ్లీలో కాంగ్రెస్ ఎమ్మెల్యే ప్రశ్నించారు. జనవరి, 2020 నుంచి జనవరి, 2026 వరకు ఏ జిల్లా నుంచి ఎంతమంది, ఏ వయసు వారు హార్ట్‌ఫెయిల్ అవడం వల్ల చనిపోయారో తెలపాలని ఎమ్మెల్యే అడిగారు. ''ఈ మరణాలకు కరోనా వైరస్, కొవిడ్ వ్యాక్సినేషన్‌తో ఏమైనా సంబంధం ఉందా.. ఆ దిశగా ఏమైనా సర్వే చేపట్టారా..?'' అని అడిగారు. అలాంటి సర్వే నిర్వహించలేదని ప్రభుత్వం సమాధానమిచ్చింది.

#### ఆరేళ్లలో మరణాల సంఖ్య...

2020లో 2,394, 2021లో 3,188, 2022లో 2,796, 2023లో 2,886, 2024లో 3,063, 2025లో 3,255, 2026 జనవరిలో 391, మొత్తంగా 17,973 హార్ట్‌ఎటాక్ మరణాలు సంభవించినట్లు ప్రభుత్వం తెలిపింది. యమునానగర్ జిల్లాలో అత్యధికంగా, రోహ్‌తక్ జిల్లాలో అన్నింటికంటే తక్కువగా ఈ మరణాల సంఖ్య ఉందని ప్రభుత్వం పేర్కొంది.

## సౌదీ -పాక్ బంధానికి బీటలు !

### పాకిస్థాన్ నిజస్వరూపం సౌదీ అరేబియాకు అర్థమైందా?
### పాకిస్థాన్ నుంచి అందని ఎలాంటి సైనిక సహాయం
### ఇస్లామాబాద్ విశ్వసనీయతపై అంతర్జాతీయంగా చర్చ



**వుదయం,** పశ్చిమాసియాలో రాజుకుంటున్న సంక్షోభం, సౌదీ అరేబియా-పాకిస్తాన్ మధ్య ఉన్న వ్యూహాత్మక సైనిక రక్షణ ఒప్పందం (ఎస్ఎండీఏ) బలాన్ని, విశ్వసనీయతను ప్రశ్నార్థకం చేస్తోంది. ఒకప్పుడు అత్యంత దృఢమైనదిగా ప్రచారం పొందిన ఈ బంధంలో తాజా పరిణామాలు తీవ్రమైన బీటలను బహిర్గతం చేశాయి. ఇరాన్, సౌదీ అరేబియా, పాకిస్తాన్ చుట్టూ అల్లుకున్న ఈ వ్యవహారం, ఇస్లామాబాద్ విశ్వసనీయతపై అంతర్జాతీయంగా చర్చకు దారితీసింది. దక్షిణాఫ్రికాకు చెందిన 'ద స్టార్' మీడియా సంస్థ తన కథనంలో ఈ అంశాన్ని విశ్లేషించింది. దాని ప్రకారం, ఈ ఒప్పందం కుదిరినప్పుడు ఇరు దేశాలు గొప్పగా ప్రచారం చేసుకున్నాయి. బయటి శక్తుల నుంచి ముప్పు వాటిల్లితే ఒకరికొకరు అండగా నిలవాలన్నది దీని ప్రధాన ఉద్దేశం. ఒకరిపై దాడి జరిగితే, అది ఇద్దరిపై జరిగినట్టుగా భావించి సంయుక్తంగా ప్రతిస్పందించే 'నాటో' తరహా కూటమిగా విశ్లేషకులు దీనిని అభివర్ణించారు. సంపన్న గల్ఫ్ దేశానికి, దక్షిణాసియా భాగస్వామి అయిన పాకిస్థాన్ భద్రతాపరంగా అండగా నిలుస్తుందనే భరోసా ఈ ఒప్పందం కల్పించింది.
అయితే, 2026 ఫిబ్రవరి 28న పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయి. ఇరాన్‌లోని సైనిక, రాజకీయ మౌలిక సదుపాయాలపై అమెరికా, ఇజ్రాయెల్ సమన్వయంతో దాడులు చేశాయి. దీనికి ప్రతీకారంగా ఇరాన్.. సౌదీ అరేబియాతో సహా పలు గల్ఫ్ దేశాలపై దాడులకు దిగింది. ఒప్పందం ప్రకారం, ఈ క్లిష్ట సమయంలో పాకిస్థాన్ సైనికపరంగా సౌదీకి మద్దతుగా నిలవాలి. కానీ, పాకిస్థాన్ నుంచి ఎలాంటి సైనిక సహాయం అందలేదు. దీంతో నమ్మకమైన భాగస్వామిగా పాక్ పాత్రపై సందేహాలు మొదలయ్యాయి. సౌదీ అరేబియాకు మద్దతు ప్రకటించాల్సింది పోయి, పాకిస్థాన్ తన సొంత సమస్య అయిన ఆఫ్ఘనిస్థాన్‌తో సరిహద్దు ఘర్షణపైనే పూర్తి దృష్టి సారించింది. ఈ ఉద్రిక్తతలను సాకుగా చూపి, సౌదీతో ఉన్న ఒప్పంద బాధ్యతల నుంచి తెలివిగా తప్పుకుంది. పాకిస్థాన్ తీసుకున్న ఈ వ్యూహాత్మక నిగ్రహం వెనుక దేశీయ రాజకీయ ఒత్తిళ్లు, అంతర్జాతీయ సైనిక భాగస్వామ్యాలపై దాని పునరాలోచన ధోరణి స్పష్టంగా కనిపిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు.
సంవత్సరాలుగా సౌదీ భద్రతకు తాము ఒక వ్యూహాత్మక అండగా ఉంటామని చెబుతూ వచ్చిన పాకిస్థాన్, తీరా అవసరం వచ్చినప్పుడు మాట తప్పడం గమనార్హం. ఇది సౌదీ అరేబియాకు తీవ్ర నిరాశ కలిగించే అంశం. ఈ ఒప్పందంపై సౌదీ దౌత్యపరంగా, వ్యూహాత్మకంగా ఎంతో పెట్టుబడి పెట్టింది. ప్రాంతీయ ముప్పులను ఎదుర్కోవడంలో పాక్ విశ్వసనీయతకు ఇదే నిదర్శనమని సౌదీ అధికారులు పదేపదే చెబుతూ వచ్చారు. కానీ ప్రస్తుత సంక్షోభం, పాక్ మద్దతు కేవలం మాటలకే పరిమితమని, చేతల్లో శూన్యమని తేల్చి చెప్పింది. పాకిస్థాన్ వైఖరి వల్ల సౌదీ తన రక్షణ భాగస్వామ్యాలపై పునరాలోచనలో పడింది. పాక్ నుంచి ఏర్పడిన లోటును భర్తీ చేసుకునేందుకు పశ్చిమ దేశాలతో సహా ఇతర భాగస్వాములతో సంబంధాలను బలోపేతం చేసుకునే అవకాశాలున్నాయి. మరోవైపు, ఈ పరిణామం పాకిస్థాన్ దౌత్య పరపతిని కూడా దెబ్బతీస్తుంది. భవిష్యత్తులో ఏదైనా సంక్షోభం వస్తే పాకిస్థాన్‌ను నమ్మవచ్చా లేదా అని ఇతర దేశాలు ప్రశ్నించే పరిస్థితి తలెత్తింది. ఇది ప్రాంతీయంగా దాని వ్యూహాత్మక పలుకుబడిని గణనీయంగా తగ్గిస్తుందని 'ద స్టార్' తన కథనంలో అభిప్రాయపడింది.





“ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అనేది కేవలం ఒక ప్రభుత్వ శాఖ మాత్రమే, ఒక ప్రభుత్వ శాఖ లేదా ప్రభుత్వం మరో ప్రభుత్వ శాఖ మీద లేదా ప్రభుత్వంపై ప్రాథమిక హక్కుల ఉల్లంఘునకు కేసు దాఖలు చేయడాన్ని అనుమతిస్తే అది దుష్ట సంప్రదాయమవుతుంది. అందు చేత ఈ వివాదాన్ని (ఇడిని దాని అధికారులను తమ విధులను నిర్వర్తించనీయకుండా అడ్డుకున్నందుకు పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వం మీద, ముఖ్యమంత్రి మీద సిబిఐ దర్యాప్తుకి ఆదేశించాలని కోరుతూ ఇడి దాఖలు చేసిన కేసు) ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనానికి అప్పగించాలి. ఏ ప్రభుత్వ సంస్థకు గాని, అధికారికిగాని ప్రాథమిక హక్కుల కింద రక్షణ కోరే అధికారం లేదు. అధికారులకు చట్టబద్ధ హక్కులుంటాయిగాని, ప్రాథమిక హక్కులుండవు. న్యాయస్థానంలో రిట్ పిటిషన్ ద్వారాగాక భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్) కింద మాత్రమే న్యాయాన్ని కోరే హక్కు వారికి ఉంటుంది.”

* – సుప్రీంకోర్టులో పశ్చిమ బెంగాల్ తరపు న్యాయవాదులు శ్యామ్ దివాన్, కపిల్ సిబల్

## వేమన పద్యం

**ఏమి గొంచువచ్చె నేమి తాగొనిపోవు**
**బుట్టువేళ నరుడు గిట్టువేళ**
**ధనము లెచటికేగు దానెచ్చటినేగు**
**విశ్వదాభిరామ! వినురవేమ**



## సంపాదకీయం

# ఎన్ సి ఇ అర్ టి మరో తప్పటడుగు

ఎనిమిదివ తరగతి పాఠ్య పుస్తకంలో న్యాయవ్యవస్థలో అవినీతి గురించి ప్రచురించిన పాఠాన్ని చేర్చినందుకు ఎన్ సి ఇ అర్ టి(జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ సంస్థ) భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం నుంచి చీవాట్లు తిని ఆ పాఠాన్ని ఉపసంహరించుకున్న ఉదంతం ఇటీవలే జరిగింది. ఇప్పుడు ఈ సంస్థ మరో వివాదంలో చిక్కుకుని, స్వీయాపరాధం తెలుసుకుని తప్పు దిద్దుకున్నది. రాజస్థాన్ లోని జైసల్మే ర్ సంస్థానాన్ని మరాఠా ప్రాంతంలో చేరుస్తూ ఒక పటాన్ని ఎనిమిదో తరగతి పాఠంలో చేర్చింది. 2025 జూలై లో విడుదలైన ఈ గ్రంధంలోని ఈ పటాన్ని జైసల్మేర్ సంస్థాన వారసులు గమనించి తీవ్ర అభ్యంతరం తెలియజేశారు. మరాఠా రాజులు సంస్థానాధీశులు తమ ప్రాంత ప్రజల నుంచి ఎప్పుడూ పన్నులు వసూలు చేసిన సందర్భం కూడా లేదని వారు స్పష్టం చేశారు.జరిగింది తప్పని గ్రహించిన ఎన్ సి ఇ అర్ టి ఆ మేరకు సవరణ, క్షమాపణ వంటివి ఏమీ వేయకుండా సడి చప్పుడు చేయకుండా డిజిటల్ పుస్తకం నుంచి ఆ పటాన్ని తొలగించింది.దేశంలో రాజకీయాధిపత్యం మారిపోయి, సెక్యులర్ సోషలిస్ట్ విధానం తెరమరుగై హిందుత్వ శక్తులది పైచేయి అయిన తర్వాత అన్ని సాంస్కృతికాది రంగాలన్నింటి మీద దాని ప్రభావం తీవ్రంగా పడుతున్నది. రవీంద్ర నాథ్ ఠాగూర్ స్వయంగా కుదించిన వందేమాతరం గీతం లోని దేవతా స్తుతికి సంబంధించిన చరణాలను తిరిగి చేర్చి మొత్తం గీతాన్ని జాతీయగీతంగా ఆలపించాలన్న నిర్ణయం ఎంతటి వివాదాస్పదమయిందో చూస్తూనే ఉన్నాము. ఎన్ సి ఇ అర్ టి పాఠ్య గ్రంధాల్లో అంతకు ముందున్న సెక్యులర్ అంశాలన్నింటికీ తిలోదకాలిస్తున్నారు. ముస్లిం పాలకుల హయాంలో అణు మాత్రం మంచి జరిగిందని చెప్పే ప్రస్తావన ఏదైనా ఉంటే దానిని తొలగించి వేస్తున్నారనే విమర్శ ఉన్నది. ఇంకా 2002 నాటి గుజరాత్ అల్లర్ల పాఠాన్ని తొలగించారు. మొఘుల్ కోర్థుల కు చెందిన అధ్యాయాలను 7,12 తరగతుల పుస్తకాల నుంచి పూర్తిగా తొలగించారు.బాబర్, అక్బర్, టిపు సుల్తాన్ లలో బొత్తిగా మంచి లేదని, వారి పాలన క్రూరమైనదని చెప్పే విధంగా కత్తిరింపులు, చేర్పులు చేశారని సమాచారం.వారి పేర్ల ముందు గ్రేట్ అనే ప్రస్తావనను తొలగించారు. అలాగే దళితులు, నక్సల్స్ ప్రస్తావనలను తుడిచిపెట్టారు. చరిత్ర రచన అశిధారా వ్రతం.ఎంతో అన్వేషణతో ఆధారాల అండతో చరిత్ర నిర్మాణం జరగాలి. అంతే గాని మన ఇష్టానిష్టాలను రుద్ద కూడదు. దేశంలో చరిత్ర అధ్యయనం అప్రతిష్ఠ పాలు కాకుండా చూడాలి. సుప్రీమ్ కోర్టు తనంత తానుగా విస్తృత ధర్మాసనం విచారణకు ఆదేశించి జరిగిన అపచారాలను సరిదిద్దాలి.


### రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.
voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020


# చట్టసభల చర్చలు మెరుగుపడేదెన్నడు?

చట్టసభలలో చర్చలు ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు వంటివని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అభిప్రాయపడ్డారు. చట్టసభలు కేవలం చట్టాలు ఆమోదించే వేదికలు మాత్రమే కావని అవి, ప్రజాస్వామ్యాన్ని కాపాడే అత్యున్నత వేదికలని ఆయన భావించారు. 12 వ శతాబ్దపు సంఘ సంస్కర్త బసవేశ్వరుడు కర్ణాటకలోని బసవ కల్యాణ్ లో స్థాపించిన అనుభవ మంటపం ప్రపంచంలోనే మొదటి ప్రజాభిప్రాయ చర్చవేదికగా కీర్తిపొందింది. అంత సుదీర్ఘ చరిత్ర ఉన్న మన దేశంలో, పార్లమెంటరీ చర్చలు మరెంతో అర్థవంతంగా ఉండాలని ప్రజలు ఆశిస్తారు. ఇందుకు రాజకీయ పార్టీలు ఏం చేస్తున్నాయన్నదే అసలు ప్రశ్న. పార్లమెంటులో స్వాతంత్ర్యోద్యమ తరం నాయకులు చేసిన ప్రసంగాలు ఇప్పటికీ పలు సందర్భాలలో మనకు మార్గదర్శకంగా నిలుస్తాయి.

చట్టసభలు ప్రజాస్వామ్య దేవాలయాలు. ప్రజల గొంతుకను బలంగా వినిపించాల్సిన వేదికలు. ప్రజల జీవితాలను మెరుగుపరిచే చట్టాలు , విధానాల రూపకల్పనకు కేంద్రాలు. అయితే చట్టసభలలో చర్చలు ఎంత నాణ్యతతో కూడుకుని ఉంటున్నాయన్నది అసలు సమస్య. కనీస హాజరుకాపాడుకుంటూ మొక్కుబడిగా సభకు హాజరయ్యేవారు కొందరైతే, సభకు హాజరైనా ఆయా అంశాలపై సభలో చర్చలలో క్రియాశీలంగా పాల్గొనకుండా ప్రేక్షకపాత్ర పోషించే వారు మరికొందరు. చట్టసభల పనితీరుపై అప్పుడప్పుడూ ఆయా సభల అధిపతులు, కొన్ని సందర్భాలలో సభ్యులే అసంతృప్తి వ్యక్తం చేసిన సందర్భాలున్నాయి. ఇటీవల, రాజ్యసభలో పదవీ విరమణ చేస్తున్న కొందరు సభ్యులకు వీడ్కోలు పలికే సందర్భంలో, రాజ్యసభలో ప్రతిపక్షనాయకుడు మల్లి కార్జున ఖర్గే కూడా చట్టసభల పనితీరు మెరుగుపడాల్సిన ఆవశ్యకత గురించీ, ప్రజాప్రాముఖ్యత కలిగిన అంశాలపై మరింత గంభీరంగా, లోతుగా చర్చించేందుకు వీలుగా మరింత ఎక్కువగా సభా సమావేశాలు జరగాలని, సభా కార్యక్రమాల నిర్వహణ నియమాలను సమీక్షించాలని, చట్టాల రూపకల్పనలో ప్రతిపక్ష సభ్యుల భాగస్వామ్యం మరింతగా ఉండాలని సూచించారు. అలాగే రాజ్యసభ కార్యకలాపాల నిర్వహణకు సంబంధించిన నియమావళిని కాలానుగుణంగా సమీక్షించుకోవాలని చెప్పారు. సభను మరింత అర్థవంతంగా మలచడానికి కొత్త కార్యక్రమాలు అవసరమని తాను గట్టిగా విశ్వసిస్తున్నట్టుకూడా చెప్పారు. మంచిదే, ఇటువంటి అంశాలపై విస్తృత చర్చజరగడం అవసరం. అలాగే, పార్లమెంటు సమావేశాలకు ముందు, రాష్ట్రాలలో శాసనసభ సమావేశాలకు ముందూ ఆయా ప్రభుత్వాధినేతలు సభా సమావేశాలు సజావుగా జరగడానికి ప్రతిపక్షాల తోడ్పాటును కోరుతుండడం మనం చూస్తూనే ఉంటాం. ఇక సభాపతులు సభ సమావేశాల సమయంలో సభా కాలాన్ని సద్వినియోగం చేసుకోవలసిందిగా సభ్యులను పదే పదే కోరుతుండడమూ మనం చూస్తూనే ఉన్నాం.

**ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు:**

చట్టసభలలో చర్చలు ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు వంటివని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అభిప్రాయపడ్డారు. చట్టసభలు కేవలం చట్టాలు ఆమోదించే వేదికలు మాత్రమే కావని అవి, ప్రజాస్వామ్యాన్ని కాపాడే అత్యున్నత వేదికలని ఆయన భావించారు. 12 వ శతాబ్దపు సంఘ సంస్కర్త బసవేశ్వరుడు కర్ణాటకలోని బసవ కల్యాణ్ లో స్థాపించిన అనుభవ మంటపం ప్రపంచంలోనే మొదటి ప్రజాభిప్రాయ చర్చవేదికగా కీర్తిపొందింది. అంత సుదీర్ఘ చరిత్ర ఉన్న మన దేశంలో, పార్లమెంటరీ చర్చలు మరెంతో అర్థవంతంగా ఉండాలని ప్రజలు ఆశిస్తారు. ఇందుకు రాజకీయ పార్టీలు ఏం చేస్తున్నాయన్నదే అసలు ప్రశ్న. పార్లమెంటులో స్వాతంత్ర్యోద్యమ తరం నాయకులు చేసిన ప్రసంగాలు ఇప్పటికీ పలు సందర్భాలలో మనకు మార్గదర్శకంగా నిలుస్తాయి.



**పరిస్థితి ఎలా ఉంది?** G గత ఏడాది జూలై 21నుంచి ఆగస్టు 21 వరకు పార్లమెంటు వర్షాకాల సమావేశాలు జరిగాయి. ముందుగా నిర్దేశించిన ప్రకారం పార్లమెంటు ఉభయసభలూ 21 రోజులు జరిగాయి. అయితే నిర్దేశిత సమయంలో మూడింట రెండువంతుల సమయం సభా కార్యకలాపాలకు అంతరాయం వల్ల ఏ చర్చకూ నోచుకోనిపరిస్థితి ఏర్పడిందని పి.ఆర్.ఎస్ లెజిస్లేటివ్ రిసెర్చ్ గణాంకాలు సూచిస్తున్నాయి. ఇక ఆ సెషన్లో నిర్దేశిత ప్రశ్నోత్తరాల సమయానికి వస్తే లోక్ సభ 23 శాతం సమయం పనిచేస్తే రాజ్యసభ 6 శాతం పనిచేసినట్టు పేర్కొంది. ఆ సెషన్లో ఎలాంటి చర్చ లేకుండానే పలు బిల్లులూ ఆమోదం పొందినట్టు కూడా పేర్కొంది.

**ప్రవర్తనా నియమావళి:**

సభా సమావేశాలకు అటంకం కలిగించకుండా చూసేందుకు సభ్యులకు పలు నియమాలూ ఉన్నాయి . సభ గౌరవాన్ని కాపాడాలని,చర్చలు సజావుగా సాగేలా సహకరించాలని సభాపతులు విన్నపాలపై విన్నపాలు చేస్తుండడమూ మనం చూస్తేనే ఉన్నాం. వీటన్నిటికీ తోడు చాలా సందర్భాలలో ప్రజలు వాస్తవంగా ఎదుర్కొంటున్న సమస్యల కన్న , వివాదాస్పద అంశాలపై విమర్శలు ,ప్రతివిమర్శలకే ఎక్కువ సమయగడిచిపోతుండడం గమినిస్తుంటాం. సభలో నినాదాలు చేయరాదని, ప్లకార్డులు ప్రదర్శించరాదని, డాక్యుమెంట్లు చించి నిరసన తెలపరాదని, కాసెట్లు వినిపించరాదని, సభ వెల్ లోకి దూసుకురారాదని, సభా గౌరవానికి భంగం కలిగించే ఎలాంటి చర్యలకూ పాల్పడరాదని ఎన్నో నియమాలుఉన్నప్పటికీ వాటినీ సభ్యులు పాటించేలా చేయడం సభాపతులకు పెద్ద సమస్యగా మారుతోంది. దీనితో పలు సందర్భాలలో ఎలాంటి చర్చకు నోచుకోకుండానే సభ గంటల కొద్దీ వాయిదాలు వేసుకుంటూ పోవలసిన పరిస్థితి. మరి అలాంటపుడు ఆయా బిల్లులపై సుదీర్ఘ చర్చ జరపడానికి ఆయాసెషన్ లలో సమయం ఎక్కడుంటుంది? 1952–57 మధ్య మొదటి, లోక్సభ కాలంలో సభ సగటున సంవత్సరానికి 135 రోజులు జరగగా 17 వ లోక్సభ నాటికి అది సగటున ఏటా 67 రోజులకు తగ్గిపోయిందని పిఆర్ఎస్ గణాంకాలు సూచిస్తున్నాయి. రాజ్యాంగ పనితీరుపై సమీక్షకు ఏర్పాటైన నేషనల్ కమిషన్, లోక్సభ ఏడాదికి కనీసం 120 రోజులు పనిచేయాలని , రాజ్యసభ ఏడాదికి 100 రోజులు పనిచేయాలని సూచించింది. 16 వ లోక్సభలో అంటే 2014–19 మధ్య సభ 16 శాతం సమయం సభలో అంతరాయాల వల్ల కోల్పోయిందట. పార్లమెంటు ఉభయసభల నిర్వహణకు సెషన్ జరిగే సమయంలో నిమిషానికి రెండున్నర లక్షల రూపాయలు ఖర్చు అవుతుందని ఎప్పుడో 2012లో అంచనా వేశారు. ఇప్పటి లెక్క ప్రకారం అది ఇంకా ఎక్కువే ఉంటుంది. మరి సభలో చర్చ జరగకుండా వాయిదాలకు వాయిదాలు పడితే ప్రజాధనం ఎంత వృధా అవుతుందో గమనించాలి.

**అధ్యయనం ఏదీ?**

చట్టసభలలో ప్రజల వాణిని వినిపించడంతోపాటు మెరుగైన చట్టాల రూపకల్పనకు, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలంటే ఆయా అంశాలపై లోతైన అధ్యయనం అవగాహన అవసరం. ఇందుకు ఆయా రాజకీయ పార్టీలు తగిన ప్రోత్సాహం శిక్షణ అందించాలి . యువ పార్లమెంటేరియన్ లను క్రియాశీలంగా చర్చలలో పాల్గొనేట్టు చేయాలి. ప్రతి చట్టసభల సెషన్ కు ముందు నియోజకవర్గ స్థాయిలో సమావేశాలు నిర్వహించి ప్రజా సమస్యలు, ప్రాధాన్యత అంశాలపై నివేదిక రూపొందించాల్సిందిగా ఆయా రాజకీయ పార్టీలు తమ పార్టీల సభ్యులకుసూచించాలి. చర్చలేకుండా బిల్లులు ఆమోదం పొందే విధానానికి స్వస్తి పలకాలి. ఓటు వేసి చట్టసభలకు పంపినా, తమ సమస్యలపై చర్చ జరగడం లేదన్న భావవన ప్రజలక రావడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. చర్చలు అర్థవంతంగా సాగేందుకు ఇందుకు అటు అధికార పక్షం, ఇటు ఇతర పక్షాలూ కృషి చేయాలి. అప్పుడే చట్టసభల చర్చలకు సార్థకత.



రేపూరు
ఉమామహేశ్వరరావు,
సీనియర్ జర్నలిస్ట్
9573794759

# వేసవి సెలవుల సద్వినియోగం ఎలా

పది మాసాల పాఠశాల లేదా కళాశాల విద్యా సంవత్సరం పూర్తి కావడం, ఆ తర్వాత పరీక్షలు కూడా పూర్తి అయిన తర్వాత మానసిక ఉల్లాసానికి ఆతిథ్యం ఇచ్చే వేసవి సెలవుల రాక కోసం విద్యార్థిలోకం ఎంతగానో ఎదురుచూడడం జరుగుతుంది. ఏడాదిలో ఒక్కసారి లభించే రెండు మాసాల వేసవి సెలవులు యువతకు ఎన్నో రకాల అనుభవాలను మూటకట్టి పెడతాయి. ఊపిరాడనంతగా ఒకే రకమైన యాంత్రిక జీవనశైలి గడిపిన విద్యార్థులు విద్యాలయ దిన చర్యకు దూరం జరిగి వేసవి సెలవుల్లో కొన్ని వారాల పాటు విశ్రాంతి, వినోద విరామాలను పొందుతూనే తమకు నచ్చిన పసందైన కార్యక్రమాలకు ప్రాణం పోసేందుకు యువత ఉవ్విళ్లూరుతూ ఉంటారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులతో స్వేచ్ఛగా, సరదాగా గడపడానికి వేదికలుగా వేసవి సెలవులు ఉపయోగపడతాయి. హోమం వర్క్, పరీక్షలు, తీరిక ఇవ్వని అకడమిక్ కార్యక్రమాలు, నోట్స్ రాయడం, బడి గంటలకు దూరంగా తమకు నచ్చిన రీతిలో వేసవి సెలవులు గడపడానికి పిల్లలు పథకాలు వేస్తూ ఉంటారు. మానసిక ఒత్తిడి నుంచి బయటపడి తమ అభిరుచులు, ఆసక్తి కలిగిన పనులు, ఆటపాటలు, ఆన్లైన్లో మునకలు, సినిమాలు, పర్యాటక ప్రయాణాలు, క్రీడా ప్రాంగణాలకు పరుగులు, అమ్మ చేతి వంట రుచులు, దర్శనీయ స్థలాల పయనాలు, వినోద విజ్ఞాన వేదికలు, ఆరోగ్యం కాపాడుకునే కార్యాలు, మానసిక ఉల్లాస విందులు, సృజన/విలక్షణ ఆలోచనలు, తమకు నచ్చిన ఫైన్ ఆర్ట్స్లో శిక్షణల కోరికలు లాంటి అనేక ప్రణాళికలను నిజం చేసుకునే సమయంగా వేసవి సెలవులు ఉపకరిస్తాయి.

**వినోద, విరామ, పునరుత్తేజం**

అవసరం మేరకు నిద్ర పోవడం, మెదడు చురుదనం పెంచడానికి కార్యక్రమాలు, మనసుకు నచ్చిన కార్యక్రమాలు చేస్తూ మానసిక ఒత్తిడిని తగ్గించే అంశాలకు సమయం ఇవ్వడం వేసవి సెలవుల్లో మాత్రమే జరుగుతుంది. తమకు నచ్చిన అంశాలకు చెందిన పుస్తకాలు చదవడం, విజ్ఞాన వినోదాత్మక సినిమాలు చూడడం, సుస్వర సంగీతం వినడం, ఆటపాటల్లో మునిగి తేలడం, కుటుంబ సభ్యులు లేదా మిత్రులతో కలిసి బయటకు వెళ్లడం లాంటివి మానసిక వికాసానికి, మనసును తేలిక పర్చుకోవడానికి ఉపకరిస్తాయి. మన ప్రేమను చూరగొన్న సమీప బంధువులు లేదా మిత్రుల వద్దకు వెళ్లడం, పిక్నిక్/జూ/సర్కస్/ఎగ్జిబిషన్లకు వెళ్లడం, మనకు నచ్చిన క్రీడలు లేదా కళల్లో శిక్షణ తీసుకోవడం, వ్యక్తిత్వ వికాస ఆన్లైన్ లేదా ఆఫ్లైన్ తరగతులకు హాజరుకావడం లాంటివి మంచి నిర్ణయాలు అవుతాయి. కొత్త ప్రదేశాలు, ప్రకృతి సహజ అందాల ఆస్వాదనలు, సాహస క్రీడలు, ప్రకృతిలో దాగిన అద్భుతాల ఆవిష్కరణలు, ఈత నేర్చుకోవడం, సైక్లింగ్ లేదా బైక్ నేర్చుకోవడం, మనకు నచ్చిన అభిరుచులను పెంచి పోషించుకోవడం, కుటుంబ సభ్యులతో సరదాగా గడపడం, అమ్మ ఒడిలో తల వాల్చడం, నాన్న చేయి వదలక ముందడుగు వేయడం, సామాజిక సంబంధాలను పటిష్ట పరుచుకోవడం, మానవ సంబంధాలను పెంచుకోవడం, సహకార భావనలతో పది మందితో కలిసి పని చేయడం లాంటి పలు కార్యక్రమాలకు వేసవి సెలవులు నెలవులు కావాలి. సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం లేదా హాజరు కావడం, వేసవిలో పార్ట్టైమ్ విద్య సంబంధ ఉద్యోగాలు చేయడం, ప్రయాణాలు చేస్తూ వినోద విజ్ఞానాలను పెంచుకోవడం, వ్యవసాయ క్షేత్రాల్లో గడపడం లాంటివి పిల్లల వ్యక్తిత్వాలను, అవగాహన శక్తులను మెరుగు పరుచుతాయి.

**ఆధునిక డిజిటల్ కాలపు నైపుణ్య వికాసం**

నేటి ఆధునిక డిజిటల్ యుగంలో పుట్టుకొస్తున్న శాస్త్రసాంకేతిక ప్రగతి ఫలాలను ఆస్వాదించడం లేదా నూతన నైపుణ్యాలను అవపోసన పట్టడం, సంగీతం/నాట్యం/పేయింటింగ్ నేర్చుకోవడం, సంగీత వాయిద్యాల్లో శిక్షణలు, కవిత్వం/వ్యాస రచన/కథలు రాయడంతో



సాహిత్య రంగంలో తొలి అక్షర అడుగులు వేయడానికి వేసవి సెలవులు ఎంతగానో ఉపయోగపడతాయి. ఆసక్తి కలిగిన వారు కొత్త భాషను నేర్చుకోవడం, డిజిటల్ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడం, ఆన్లైన్ కోర్సుల ద్వారా నైపుణ్యాలకు పదును పెట్టడం, జనరల్ నాలెడ్జి పెంచుకోవడం, దిన పత్రికలను చదవడం, పాఠ్యాంశాలకు సంబంధించిన అదనపు పరిజ్ఞానాలను పొందడం, మానసిక పరిపక్వతకు ఆజ్యం పోసే ఆధ్యాత్మిక కార్యక్రమాలకు హాజరు కావడం లాంటివి పిల్లలకు అందుబాటులో ఉంచాలి. నైపుణ్యాలు, విజ్ఞానం, సామర్థ్యాలకు పదును పెట్టడం లాంటివి మరువరాదు. సృజనశీల అంశాల్లో అడుగు పెట్టడంతో పాటు ఇన్నొవేటివ్ ఆలోచనలు చేయడం మన పిల్లల శారీరక మానసిక భావోద్వేగ వికాసానికి దోహదపడతాయి.
నేటి ఆరోగ్యమే రేపటి భవితకు పెట్టుబడి అని, ఆరోగ్యమే మహాభాగ్యం అని నమ్ముతూ వేసవి సెలవుల్లో ఆరోగ్యకర జీవనశైలిని అలవర్చుకోవాలి. తగినంత సమయం నిద్ర పోవడం, సమయానికి ఆహారం తీసుకోవడం, పరిమిత సమయం పాటు ఆటపాటలకు కేటాయించడం, ప్రతి రోజు కొంత సమయం వ్యాయామం/యోగా/ప్రాణాయామం/వాకింగ్/స్విమ్మింగ్/ట్రెక్కింగ్/మౌంటెనీరింగ్ చేయడం, సూర్యోదయాన్ని చూసి ఆనందించడం మరువరాదు. వీటికి తోడుగా తోట పనుల్లో నిమగ్నం కావడం, పర్యావరణ పరిరక్షణ సేవలు, నిస్వార్థ సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం, శ్రమదాన కార్యక్రమాలు చేయడం, అనాథాశ్రమాలను సందర్శించి వారికి చేతనైనంత తోడ్పాటు ఇవ్వడం, నేచర్ ట్రెజర్ హంట్ చేయడం, ఇష్ట దైవానికి పూజ చేయడం, దేవాలయాలు లేదా ప్రార్థనా స్థలాలను సందర్శించడం లాంటివి చేయడం ఉత్తమం అని భావించాలి.

**చేయగూడని కార్యక్రమాలు - తల్లితండ్రుల పాత్ర**

పిల్లలు వేసవి సెలవులను సమర్థవంతంగా, ప్రయోజనాత్మకంగా గడపడంలో తల్లితండ్రుల పాత్ర అధికమని గమనించాలి. వేసవి సెలవుల రూపంలో లభించిన రెండు మాసాల్లో పిల్లల దురలవాట్లు లేదా అనారోగ్యకర దినచర్యలకు అలవాటు పడకుండా చూసుకోవడం పెద్దల కనీస కర్తవ్యం అని తెలుసుకోవాలి. అధిక కాలం పాటు స్మార్ట్ఫోన్ వాడడం లేదా టివీ ముందు కూర్చోవడం మంచి అలవాటు కాదని వారించడం మరువరాదు. కరోనా లాక్డౌన్ వల్ల పిల్లలు స్మార్ట్ఫోన్ బానిసలుగా మారడం చూసాం. ఆన్లైన్ గేమ్స్కు బదులుగా అవుట్/ఇండోర్ డోర్ గేమ్స్ ఆడడం ఉత్తమమని నమ్మాలి. వేసవి ఎండలను గమనిస్తూ, గంటల తరబడి మైదానాల్లో ఆడకుండా, వడదెబ్బకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అతి నిద్ర లేదా అతిగా తినడం లేదా అతి గారాబానికి ఆస్కారం ఇవ్వకండి. డ్యాన్స్, ఫైన్ ఆర్ట్, స్విమ్మింగ్, సైక్లింగ్, మ్యూజిక్, ఆటలు లాంటివి నేర్పించండి. వేసవి సెలవులు పూర్తి స్వేచ్ఛకు నెలవులు కావని, వినోదంతో పాటు విజ్ఞానం, ఆటపాటలతో పాటు శారీరక మానసిక వికాసం, ఆన్లైన్లో సంచరిస్తూ దురలవాట్ల కోరల్లో పడకుండా రేపటి బాధ్యత కలిగిన పౌరులుగా మారడానికి నేటి పిల్లలకు వేసవి సెలవులు ఉపయుక్తం కావాలని కోరుకుందాం. పిల్లల అభిరుచులను గమనిస్తూ వేసవి సెలవుల్లో వారి వ్యక్తిత్వ వికాసం జరిగే విధంగా, విజ్ఞానవంతులుగా మారడానికి తల్లితండ్రులు పటిష్ట ప్రణాళికలు వేసి వాటిని పక్కాగా అమలు చేయాలి. వేసవి సెలవులను వ్యర్థం చేయవద్దు. సెలవుల కాలం సకల నైపుణ్యాలను వడ్డించే నెలవుగా మారాలని కోరుకుందాం.



మధుసూదన్ రెడ్డి
9949700037

# హ్యాపీటలిజం

ప్రతి సంవత్సరం మార్చి 20న ప్రపంచ వ్యాప్తంగా అంతర్జాతీయ సంతోష దినోత్సవం (International Day of Happiness) జరుపు కుంటారు. ప్రతి ఒక్కరి జీవితంలో సంతోషానికి ఉన్న ప్రాధాన్యతను గుర్తు చేస్తూ, ప్రజల శ్రేయస్సు కోసం ప్రపంచ దేశాలను చైతన్య పరచడం ప్రధాన ఉద్దేశంగా జరుపుకుంటారు. భూటాన్ దేశం, “స్థూల జాతీయ ఆనందం” అనే భావనను ముందుంచిన మొదటి దేశం. ఆ దేశం అభిప్రాయంతో ప్రేరితమై, ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ 2012 జూన్ 28న తీర్మానం A/RES/66/281ను ఆమోదించింది. దీని ప్రకారం మార్చి 20ను అంతర్జాతీయ సంతోష దినోత్సవంగా ప్రకటించింది. 2013 నుండి ఈ దినోత్సవాన్ని అధికారికంగా జరుపు కుంటున్నారు. ఈ దినోత్సవం ప్రాముఖ్యతను ప్రజల్లో విస్తృతంగా చైతన్యపరిచేలా ప్రభుత్వాలు, సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, వ్యక్తులు అందరూ భాగస్వాములు కావాలని ఐక్యరాజ్య సమితి పిలుపు నిచ్చింది. సంతోషంకు సంబంధించి, ప్రపంచ దేశాలలో భారత దేశం అట్టడుగున 136 వ స్థానం లో ఉండటం శోచనీయం. మనకంటే మన పొరుగు దేశాలైన శ్రీలంక, పాకిస్తాన్, నేపాల్, బంగ్లాదేశ్ లో కూడా ప్రజలు మనకంటే సంతోషంగా జీవిస్తున్నట్లు రిపోర్ట్ పేర్కొంది. ఫిన్ ల్యాండ్, డెన్మార్క్, స్విట్జర్లాండ్, ఐస్లాండ్, నెథర్లాండ్స్ దేశాలు వరుసగా టాప్ 5 లో ఉన్నాయి. భారత్ వంటి అత్యధిక జనాభా ఉన్న దేశంలో అసమానతలు, పేదరికం కూడా ఎక్కువే.. 161 దేశాల లో మన దేశం అసమానతల సూచీ లో 123 లో ఉండటం ఇందుకు నిదర్శనం. మన దేశం లో 22% దేశ సంపద 1% మందిచేతుల్లో ఉంది. 10% సంపన్నుల దగ్గర దేశంలో నే 57% సంపద ఉంది. దిగువ న ఉన్న 50% మంది దగ్గర 13% సంపద ఉందంటే ధనిక పేదల మధ్య ఎంత వ్యత్యాసం ఉందో తెలుస్తుంది. మనిషి స్వతహాగా అన్ని ఉన్నా సంతోషంగా గడపడం మరచిపోవడం, ఉరుకుల పరుగుల జీవితంలో సగటు నిత్యం పనిలో డబ్బు సంపాదన లో నిమగ్నం కావడం, సంతోషంగా కుటుంబంతో గడపక పోవడం ఇటీవల ఎక్కువైంది. మనకున్న కాలాన్ని వ్యర్థం చేసుకోకుండా.. ప్రతి క్షణాన్ని ఆనందమయం చేసుకునేందుకు ప్రయత్నించాలి. మనతో పాటు మన చుట్టూ పక్కల వారు కూడా ఆనందంగా ఉండేలా ప్రేరేపించాలి. సంతోషాన్ని ప్రాథమిక మానవ హక్కుగా గుర్తించాలి. ఆర్థిక అభివృద్ధితో పాటు మానసిక శ్రేయస్సు, సామాజిక సమానత, పర్యావరణ పరిరక్షణ కూడా సమానంగా కీలకమైన అంశాలుగా పరిగణించాలి. ప్రజల జీవితాల్లో ఆనందాన్ని పెంచే విధానాలపై దృష్టి పెట్టాలి. అన్ని వయస్సుల ప్రజలు ఈ కార్యక్రమంలో భాగమవ్వాలని ప్రోత్సహించాలి. అనేవి ప్రధాన లక్ష్యాలు. 2015లో ఐక్యరాజ్య సమితి ప్రారంభించిన 17 సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు ప్రపంచ ప్రజల జీవితాల్లో ఆనందం, శ్రేయస్సు కోసం కీలక పాత్ర పోషిస్తున్నాయి. వాటిలో ముఖ్యంగా: పేదరిక నిర్మూలన, అసమానతల తగ్గింపు, పర్యావరణ పరిరక్షణ ముఖ్యమైన అంశాలు. జేమ్ ఇలియన్ అనే వ్యక్తి “హ్యాపీటలిజం (Happytalism)” అనే భావనను ప్రతిపాదించారు. ఇది ఆనందం, ప్రజాస్వామ్యం మరియు శ్రేయస్సును ఆధారంగా చేసుకున్న సమగ్ర అభివృద్ధి సిద్ధాంతం. ఆయన ఐక్యరాజ్య సమితిలో ప్రచారం చేస్తూ, ఈ దినోత్సవ స్థాపనకు ప్రేరణగా నిలిచారు. ఈ రోజున.. కుటుంబం, స్నేహితులతో కలిసి ఆనందంగా గడిపే కార్యక్రమాలు, సంతోషం పంచే సామాజిక సేవా కార్యక్రమాలు, మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు, సామాజిక మాధ్యమాల్లో సంతోషాన్ని ప్రోత్సహించే ప్రచారాలు, విద్యార్థులకు, యువతకు సంతోష ప్రాముఖ్యతపై సదస్సులు, చర్చలు జరుగుతాయి. సంతోషానికి మార్గాలు: ధన్యవాద భావనను అలవాటు చేసుకోవడం, సానుకూల ఆలోచనలు పెంపొందించు కోవడం, సహాయం చేయడం, సేవా దృక్పథం అవలంబించడం, ఆరోగ్యాన్ని సంరక్షించుకోవడం బంధుత్వాలను మరింత బలపరచడం. సంతోషం అనేది వ్యక్తిగత స్థాయిలో ప్రారంభమై, కుటుంబం, సమాజం, దేశం వరకు వ్యాపించగల శక్తివంతమైన భావన. ఈ దినోత్సవం ద్వారా మనం సంతోషాన్ని మన జీవనశైలిలో భాగంగా చేసుకోవాలని, ఇతరులతో పంచుకోవాలని గుర్తించాలి. చిన్న విషయాల్లో ఆనందాన్ని వెతకడం, సానుకూలతను అలవడించడం ద్వారా మన సమాజం మరింత ఆరోగ్యకర మైనదిగా మారుతుంది.

సంగనబట్ల
9440595494



# గ్రేటర్ హైదరాబాద్



# అర్హత ఉన్న ప్రతి కుటుంబానికీ ఇల్లు

**చేవెల్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య**

**చేవెళ్ల, శంకర్‌పల్లి, మొయినాబాద్‌లో ఇందిరమ్మ ఇండ్లు ప్రారంభం**
**మూర్తోజిగూడలో సీసీ కెమెరాల ప్రారంభం**

**శంకర్‌పల్లి, మార్చి 19 (వుదయం) :** అర్హత ఉన్న ప్రతి కుటుంబానికీ ఇల్లు అందించడానికి కృషి చేస్తానని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. గురువారం చేవెళ్ల నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య పలు మున్సిపాలిటీల పరిధిలో నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించి లబ్ధిదారులకు అందజేశారు. పండుగ రోజున ప్రజలకు ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలను అందించడం ద్వారా ప్రభుత్వం ప్రజల పట్ల ఉన్న నిబద్ధతను మరోసారి చాటుకుందని స్థానికులు అభిప్రాయపడ్డారు. మొదటగా చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని 1 & 2వ వార్డులు (ఊరెళ్ల)లో నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం శంకర్ పల్లి మున్సిపాలిటీ 13వ వార్డు (శంకర్ పల్లి–చేవెళ్ల రోడ్)లో నిర్మించిన గృహాలను ప్రారంభించి లబ్ధిదారులకు తాళాలు అందజేశారు. ఈ ఇళ్లను పొందిన కుటుంబాలు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న తమ కల సాకరం తెలిపారు.

తదుపరి మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 25వ వార్డు (మొయినాబాద్), 18వ వార్డు (పెద్దమంగళారం)లో నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఇళ్ల తాళాలు అందుకున్న లబ్ధిదారులు ప్రభుత్వం పట్ల కృతజ్ఞతలు తెలియజేస్తూ, తమ జీవితాల్లో ఇది ఒక కీలక మలుపు అని పేర్కొన్నారు. పేదల జీవన ప్రమాణాలను మెరుగుపర్చే దిశగా ఇది ఒక పెద్ద అడుగు అని స్థానికులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య





మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నిజంగా అర్హులైన వారికి చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని వేగవంతం చేస్తున్నామని, ఎవరూ గృహహీనులుగా మిగలకుండా చూడడం ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు. అలాగే అభివృద్ధి పనులు కేవలం గృహ నిర్మాణంతో మాత్రమే పరిమితం కావడం లేదని, రహదారులు, పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్ వంటి ప్రాథమిక సదుపాయాలను కూడా సమానంగా అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల మధ్య ఉన్న వ్యత్యాసాలను తగ్గించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవాలతో పాటు మొయినాబాద్ మున్సిపాలిటీ 12వ వార్డు (మూర్తోజిగూడ)లో సీసీ కెమెరాలను కూడా ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల భద్రత కూడా ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమైన అంశమని, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి భద్రతా వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని తెలిపారు. సీసీ కెమెరాల ద్వారా నేరాల నియంత్రణకు తోడ్పాటు లభిస్తుందని చెప్పారు. సీసీ కెమెరాల ఏర్పాటు పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆయా కాలనీలోనాయకులు,యువకులు, ప్రజలు పాల్గొన్నారు.

# ఈనెల 23న భగత్ సింగ్ విగ్రహావిష్కరణ

- వర్ధంతి సభను జయప్రదం చేయండి
- కరపత్రాలను విడుదల చేసిన ఎమ్మెల్యే వి.శంకర్



**షాద్ నగర్, మార్చి 19 (వుదయం) :** షాద్‌నగర్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా ఈనెల 23 తేదీన షహీద్ భగత్ సింగ్ విగ్రహ ఆవిష్కరణ, భగత్ సింగ్ వర్ధంతి సభను జయప్రదం చేయాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. భగత్ సింగ్ వర్ధంతి సభను పురస్కరించుకుని గురువారం ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, వివిధ ప్రజా సంఘాల నాయకులతో కలిసి భగత్ సింగ్ విగ్రహావిష్కరణ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సభకు ప్రధాన వక్తలుగా వాగ్గేయ కారుడు శాసన మండలి సభ్యుడు గోరేటి వెంకన్న, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఆమంచి నాగేశ్వర్, వక్తలుగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్ల నాగరాజు, డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనగంటి వెంకటేష్ హాజరువుతున్నారని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా 23న జరిగే భగత్ సింగ్ విగ్రహావిష్కరణ సభకు విద్యార్థులు యువజన సంఘాలు ఉద్యోగ, ఉపాధ్యాయులు, కార్మిక కర్షకులు ప్రజలు ప్రజాస్వామికవాదులు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు ఎన్ రాజు, శ్రీను నాయక్ ఈశ్వర్, కుర్మయ్య పి.వెంకటరమణ, శ్రీకాంత్ యుటిఎఫ్ నాయకులు నర్సింలు, బిజిలి సత్యం మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్ జేఏసీ నాయకులు జనార్దన్ , బాలు నాయక్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కష్టాలు పరాభవం చెంది..
# అందరికీ శుభాలు కలగాలి

- మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్
- ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామ దేవాలయంలో ప్రత్యేక పూజలు



**షాద్ నగర్, మార్చి 19 (వుదయం) :** ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఎక్లాస్ ఖాన్ పేట గ్రామ దేవాలయంలో భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, అనంతరం గ్రామ ప్రజలకు సంప్రదాయ బద్ధంగా పంచాంగ శ్రవణం వినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గ ప్రజలకు కష్టాలు పరాభవం చెంది.అన్ని రంగాల్లో శుభాలు కలగాలని అన్నారు. ఈ పర్వదినం కొత్త ఆశలకు నాంది పలికే పవిత్ర సందర్భంగా పేర్కొంటూ, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యసంపదలతో సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ వేడుకలలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. గ్రామ దేవాలయాల అభివృద్ధికి నా సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు.

### ఆంజనేయ స్వామి దేవాలయానికి విరాళం...

గ్రామ దేవాలయాల అభివృద్ధికి ఎల్లప్పుడూ తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ తెలిపారు. కొందుర్గ్ మండలం టేకులపల్లి గ్రామంలో ఆంజనేయ స్వామి దేవాలయ నిర్మాణానికి రూ.1 లక్ష విలువ గల స్టీల్‌ను అందజేసి తన మాట నిలబెట్టుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధి ద్వారా ప్రజల్లో ఐక్యత, సంస్కృతి మరింత బలపడుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రజల ఆశీస్సులతో షాద్ నగర్ నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తానని స్పష్టం చేసిన అంజయ్య యాదవ్‌కు గ్రామస్థులు, పార్టీ కార్యకర్తలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పత్తి శ్రీశైలం, ఉప సర్పంచ్ నర్సమ్మ, నాయకులు పత్తి మల్లయ్య, నర్సింలు, తెలుగు మల్లయ్య, సుధాకర్ రెడ్డి, అయ్యప్ప, కరీం, సాధఖ్ తదితరులు పాల్గొన్నారు.





# సేవా స్ఫూర్తితో సాయి నగర్‌లో చలివేంద్రం

**కుత్బుల్లాపూర్, మార్చి 19,(వుదయం ప్రతినిధి ) :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నిజాంపేట్ సర్కిల్‌లోని ప్రగతి నగర్ డివిజన్ శ్రీ సాయి నగర్ కాలనీలో సేవా స్ఫూర్తి చాటుతూ చలివేంద్రం ఏర్పాటు చేశారు. కాలనీ వ్యవస్థాపకుడు స్వర్గీయ గజ్జెల్లి సాయిలు జ్ఞాపకార్థం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎండాకాలంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో దాహార్తి తీర్చే లక్ష్యంతో కాలనీ కమిటీ సభ్యులు ముందుకు వచ్చి కమిటీ హాల్ ఆవరణంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. తాగునీరు, మజ్జిగ, శీతల పానీయాలు అందుబాటులో ఉంచి ప్రజలకు ఉపశమనం కలిగిస్తున్నారు. ఈ కార్యక్రమానికి స్థానికులు యువకులు స్వచ్ఛందంగా పాల్గొని సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. వేసవి కాలంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు అవసరమని పలువురు అభిప్రాయపడ్డారు. సామాజిక బాధ్యతతో నిర్వహించిన ఈ చలివేంద్రం ఇతర ప్రాంతాలకు ఆదర్శంగా నిలవాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. ప్రజలకు సేవ చేయడమే ప్రధాన లక్ష్యమని, ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్తులో మరింత విస్తృతంగా నిర్వహిస్తామని వారు తెలిపారు.

# ప్రజల జీవితాల్లో నూతన వెలుగులు నింపాలి

- పరాభవ నామ సంవత్సరం శుభాకాంక్షలు
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి




**పటాన్ చెరు, మార్చి 19(వుదయం) :** తెలుగు ప్రజల తొలి పండుగ ఉగాది పరాభవ నామ సంవత్సరం ప్రజల జీవితాల్లో నూతన వెలుగులు నింపాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అభిలాషించారు. ఉగాది పర్వదినం పురస్కరించుకొని గురువారం సాయంత్రం పటాన్‌చెరు పట్టణంలోని చైతన్య నగర్ హనుమాన్ దేవాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పంచాంగ శ్రవణం కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ పురోహితులు రాశి ఫలాలను వివరించారు. మినీ ఇండియాగా పేరుందిన పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని ప్రజలందరికీ పరాభవ నామ సంవత్సరం విజయాలు, అష్ట ఐశ్వర్యాలు కలిగించి సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ప్రజలందరికీ ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

### దేవాలయాల సందర్శన...

ఉగాది పర్వదినం పురస్కరించుకొని పటాన్ చెరు డివిజన్ పరిధిలోని చైతన్య నగర్ హనుమాన్ దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం డివిజన్ పరిధిలోని కోదండ సీతారామస్వామి దేవాలయంలో ఏర్పాటు చేసిన శ్రీరామనవమి కళ్యాణ పత్రిక రూపకల్పన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈనెల 25వ తేదీ నుండి 29వ తేదీ వరకు శ్రీరామనవమి కళ్యాణ ఉత్సవాలు నిర్వహించబోతున్నట్లు తెలిపారు. భక్తులందరూ భారీ సంఖ్యలో హాజరై కార్యక్రమాలను దిగ్విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, పట్టణ పుర ప్రముఖులు, మాజీ ప్రజా ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.



# ఉగాది వేడుకలు

**జిన్నారం, మార్చి 19(వుదయం) :** జిన్నారం మండల వ్యాప్తంగా ఉగాది వేడుకలను ప్రజలు గురువారం వైభవంగా జరుపుకున్నారు. ఉగాది సందర్భంగా జిన్నారంలో హోటల్ నిర్వాకుడు విజయ్ ఉగాది పచ్చడి తయారు చేసి అందరికీ పంచి పెట్టాడు. సాయంత్రం మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు ఆలయాల వద్ద నిర్వహించిన పంచాంగ శ్రవణం కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వారి పేర్లతో రాశిఫలాలను అడిగి తెలుసుకున్నారు. ఊట్లలో నిర్వహించే శ్రీరామనవమి ఉత్సవాలకు శాశ్వత కళ్యాణం కోసం బి.బాలేష్ రూ.11 వేలు అందజేశారు.

# యువత సన్మార్గంలో నడుచుకోవాలి

**మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి**

**హయత్ నగర్, మార్చి 19(వుదయం) :** శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పండుగ సందర్భంగా గురువారం హయత్ నగర్ పాత గ్రామంలోని సీనియర్ సిటిజన్ భవనంలో నిర్వహించిన పంచాంగ శ్రవణ కార్యక్రమంలో స్థానిక తాజా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ శ్రీ పరాభవ నామ సంవత్సరం ప్రతి ఒక్కరికీ సుఖసంతోషాలు, ఐశ్వర్యం, ఆరోగ్యం తీసుకురావాలని ఆకాంక్షించారు. అందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. అలాగే యువత సన్మార్గంలో నడుచుకుంటూ సమాజ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. కార్యక్రమంలో శేఖర్ పంతులు, సీనియర్ సిటిజన్ అధ్యక్షులు నక్క దర్శన్, కార్యవర్గ సభ్యులు మల్లారెడ్డి, సహదేవ్, నక్క ప్రభాకర్, రామ్ సత్తయ్య, దీపావళి ప్రభాకర్ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





# నూతన బస్సు సౌకర్యం ప్రారంభం

చేవెళ్ల, మార్చి 19 (వుదయం) : ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని చేవెళ్ల నియోజకవర్గం శంకర్ పల్లి నుంచి వయా గంగ్యాడ మీదుగా వికారాబాద్ వరకు కొత్త బస్సు సౌకర్యాన్ని గురువారం కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గ ఇంచార్జ్ పామేన భీం భరత్ ప్రారంభించారు. ఈ కొత్త సర్వీస్ ప్రారంభంతో పూలపల్లి, నారేగూడ, గంగ్యాడ, అంతప్పగూడ గేట్, సంకేపల్లి పరిసర ప్రాంత ప్రజలకు ప్రయాణ సౌలభ్యం కలిగింది. ఈ సందర్భంగా భీం భరత్ మాట్లాడుతూ…"ప్రజల అవసరాల మేరకే ప్రజా ప్రభుత్వం పనిచేస్తుంది. ఈ బస్సు సౌకర్యాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుంటే, భవిష్యత్తులో మరిన్ని సర్వీసులను కూడా ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం" అని తెలిపారు. కార్యక్రమంలో నవాబుపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మేడిపల్లి వెంకటయ్య, గంగ్యాడ సర్పంచ్ దోసాడ మల్లేశం, పూలపల్లి సర్పంచ్ ఎలిమెల భాగ్యలక్ష్మి మహేందర్‌రెడ్డి, నారేగూడ సర్పంచ్ వెల్వర్తి దీపికా దశరథ్, పులిమామిడి సర్పంచ్ దాన నర్సింలు, యూత్ కాంగ్రెస్ నాయకులు భానూరి ఉపేందర్‌రెడ్డి, గణపురం ప్రసాద్ మాజీ సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి తిరుపతిరెడ్డి, ఉప సర్పంచులు హరీశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## ముడిమ్యాలలో
# వేగవంతంగా సీసీ రోడ్డు పనులు

**చేవెళ్ల, మార్చి 19 (వుదయం) :** చేవెళ్ల మండల పరిధిలోని ముడిమ్యాల గ్రామంలో అభివృద్ధి పనులు జోరుగా కొనసాగుతున్నాయి.గ్రామంలోని రామాలయం వద్ద (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రస్తుతం పురోగతిలో ఉన్నాయి.ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయంలో నిర్వహించిన పంచాంగ శ్రవణం అనంతరం, స్థానిక నాయకులు పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల నాణ్యత, వేగం పై సూచనలు చేశారు. కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ చైర్మన్ గోనె ప్రతాప్ రెడ్డి, సర్పంచుల సంఘం మాజీ మండల అధ్యక్షుడు పడాల ప్రభాకర్ సర్పంచ్ గౌడిచర్ల శ్రీనివాస్ ఉప సర్పంచ్ జంగారెడ్డి వార్డు సభ్యులు పాల్గొన్నారు. నాయకులు శేరి రాజు ఊరడి రాములు గోనె విశాల్ రెడ్డి యంజాల మల్లేష్ గుండాల నర్సిములు ఊరడి సత్తయ్య ప్రవీణ్ మాణిక్యం చాకలి గోపాల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఉగాది శుభాకాంక్షలు

**బీఆర్ఎస్ నాయకుడు మహమ్మద్ జహేద్**



**చేవెళ్ల, మార్చి 19 (వుదయం) :** ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని చేవెళ్ల ప్రాంత ప్రజలకు బీఆర్ఎస్ మైనార్టీ సెల్ నాయకుడు ఇబ్రహీంపల్లి మాజీ ఉపసర్పంచ్ మహమ్మద్ జహేద్ గురువారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. పరాభవ నామ సంవత్సరంలో ప్రతి కుటుంబం సుఖశాంతులతో ఐశ్వర్యంతో జీవించాలని ఆకాంక్షించారు. ప్రజల జీవితాల్లో ఆనందం నిండాలని ప్రాంతం అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని కోరుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ…ఉగాది పండుగ తెలుగు సంస్కృతికి ప్రతీకగా నిలుస్తుందని, కొత్త ఆశలకు నాంది పలికే పవిత్రమైన పర్వదినమని పేర్కొన్నారు. ప్రజలందరూ ఆరోగ్యంగా ఆనందంగా జీవించాలని ఆకాంక్షిస్తూ, ఈ ఉగాది ప్రతి ఒక్కరి జీవితంలో కొత్త వెలుగులు నింపాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుకు ఉగాది శుభాకాంక్షలు




**కుత్బుల్లాపూర్, మార్చి 19 (వుదయం) :** శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది సందర్భంగా మేడ్చల్ జిల్లా బీఅర్ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును భౌరంపేట్ మాజీ కౌన్సిలర్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బిఅర్ఎస్ పార్టీ నాయకులు వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలసి ఎమ్మెల్సీని శాలువాతో సన్మానించి తెలుగు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా గ్రంధాలయం సంస్థ మాజీ చైర్మన్ నాగరాజు యాదవ్, పాక్స్ చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, కొలుకుల జగన్, సురేష్ రెడ్డి, సీనియర్ నాయకులు ఎస్ వి . సురేందర్ రెడ్డి, బాలకృష్ణ రెడ్డి, ధర్మారెడ్డి, కె. రాము, మన్నె శేఖర్ ముదిరాజ్, మిద్దెల మల్లారెడ్డి, కటకం విరేష్ నేత తదితరులు పాల్గొన్నారు.



# ధరణి కాలనీలో గృహిణి అదృశ్యం

**మేడిపల్లి, మార్చి 19 (వుదయం) :** మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ధరణి కాలనీలో నివాసం ఉండే కేతావత్ నీలమ్మ (36) కూలి పని చేసుకుంటూ తన భర్త సోమ్లా, ఇద్దరు పిల్లలతో గత కొన్ని నెలలుగా నివాసం ఉంటున్నది. అయితే ఈ నెల 15వ తేదీన సోమ్లా నాయక్ మద్యం మత్తులో తన భార్యతో గొడవ పడగా, నీలమ్మ తన అన్న అయినా శ్రీనివాసులు ఇంటికి వెళ్తున్నానని తన ఇద్దరు పిల్లలకి చెప్పి వెళ్ళింది. కానీ నీలమ్మ తన అన్న ఇంటికి కూడా వెళ్లలేదు. దాంతో శ్రీనివాసులు మేడిపల్లి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మేడిపల్లి సీఐ శంకరయ్య కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



## ఓల్డ్ రామచంద్రపురంలో
# ఉగాది పంచాంగ శ్రవణం

**రామచంద్రపురం, మార్చి 19(వుదయం) :** ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం ఓల్డ్ రామచంద్రపురం హనుమాన్ దేవాలయంలో నూతన సంవత్సర పంచాంగ శ్రవణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ శాసన మండలి మాజీ ప్రోటెం చైర్మన్ భూపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, మాజీ సర్పంచ్ రాజేశ్వర్ రెడ్డి, పటాన్చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పండితుడు శ్రీకాంత్ పంచాంగ శ్రవణం నిర్వహించారు. శ్రీ పరాభవ నామ సంవత్సరం ప్రజలందరికీ శుభ ఫలితాలు అందించాలని ఆకాంక్షించారు. నియోజకవర్గ ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పుష్పానాగేష్, కుమార్‌గౌడ్, గ్రామ పెద్దలు, శ్రీనివాస్‌రెడ్డి, బలరాంరెడ్డి, బాలరాజ్, చంద్రశేఖర్, మురళీధర్ రెడ్డి, చిగురు శ్రీను, రవిగౌడ్, భాస్కర్, జానీ, దిలీప్ సింగ్, అమరేందర్‌రెడ్డి, రాములు యాదవ్ తదితరులున్నారు.



# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ ఉమ్మడి జిల్లాల వార్తలు

## ప్రభుత్వ కళాశాలల్లోనే ఉజ్వల భవిష్యత్తు

- ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**జనగాం/స్టేషన్ ఘనపూర్, మార్చి 19 (వుదయం ప్రతినిధి) :**



స్టేషన్ ఘనపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అడ్మిషన్ల బ్రోచర్ ఆవిష్కరణహన్మకొండ, స్టేషన్ ఘనపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 202627 విద్యాసంవత్సరానికి సంబంధించిన ప్రవేశాల బ్రోచర్‌ను వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి గురువారం ఆవిష్కరించారు. హన్మకొండ కనకదుర్గ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రభుత్వ కళాశాలల్లో చేరి తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని పిలుపునిచ్చారు. అన్ని వసతులకు కేరాఫ్ ప్రభుత్వ కళాశాలలు ఎంపీ కడియం కావ్య స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నత విద్యను చేరువ చేయడంలో ఈ కళాశాలలు కీలక పాత్ర పోషిస్తున్నాయని కొనియాడారు. విద్యార్థులు ప్రైవేటు సంస్థలకు దీటుగా ఇక్కడ లభించే అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ, స్టేషన్ ఘనపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని చెప్పారు. కళాశాలలో ఉన్న ప్రత్యేకతలను ఆయన వివరిస్తూ అనుభవజ్ఞులైన అధ్యాపకులచే బోధన.ఉచిత కంప్యూటర్ శిక్షణ, స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు. TSKC ద్వారా ఉపాధి అవకాశాల కల్పన.స్కిల్ డెవలప్మెంట్, పోటీ పరీక్షలకు ప్రత్యేక మార్గదర్శకత్వం.ప్రభుత్వ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ సౌకర్యం.విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి, ఉపాధి వేటలో రాణించడానికి కళాశాల ఇచ్చే శిక్షణ ఎంతో దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బత్తిని చంద్రమౌళి, అధ్యాపకులు నాగరాజు, సుమలత, అఖిల తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ తీరుపై చైర్మన్ కోడి శ్రీనివాసులు నిప్పులు

- వ్యక్తిగత గొడవలకు రాజకీయ రంగు పూస్తారా?
- రిమాండ్‌లో ఉన్న వారిలో 12 మంది బీఆర్ఎస్ వారే.. కాంగ్రెస్‌పై బురదజల్లడం మానుకోవాలి
- కళ్లు లేని కబోదుల్లా బీజేపీ నేతల వ్యవహారం నియోజకవర్గ దరిద్రం మనోహర్ రెడ్డి: మాజీ సర్పంచ్ కోడిగిరి బాబు

**చండూరు, మార్చి 19 (వుదయం విలేఖరి)**



నల్గొండ జిల్లా చండూరులో ఇటీవల జరిగిన ఘర్షణల నేపథ్యంలో స్థానిక రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. వ్యక్తిగత కారణాలతో జరిగిన వివాదాన్ని కావాలనే కాంగ్రెస్ పార్టీపై రుద్దేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గురువారం చండూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన బీజేపీ నాయకులపై ఘాటు వ్యాఖ్యలు చేశారు.అసలు నిందితులు ఎవరు?ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. గొడవ కేసులో రిమాండ్‌కు వెళ్లిన 16 మందిలో 12 మంది బీఆర్ఎస్ కార్యకర్తలేనని, కేవలం నలుగురు మాత్రమే కాంగ్రెస్‌కు చెందిన వారని స్పష్టం చేశారు. వాస్తవాలు ఇలా ఉంటే.. బీజేపీ నేతలు కాంగ్రెస్‌ను టార్గెట్ చేస్తూ 'కాంగ్రెస్ గుండాలు' అంటూ విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. బీఆర్ఎస్-బీజేపీల మధ్య ఉన్న అంతర్గత ఒప్పందం వల్లే బీఆర్ఎస్‌ను వదిలేసి, కాంగ్రెస్‌పై బురదజల్లుతున్నారని ఆరోపించారు. కంటి ఆపరేషన్లు చేయిస్తాం..ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఇప్పటివరకు 12 విడతల్లో 1970 మందికి కంటి ఆపరేషన్లు చేయించామని, ఇందులో 400 మందికి పైగా బీజేపీ సానుభూతిపరుల కుటుంబాలు కూడా ఉన్నాయని గుర్తు చేశారు. రాజగోపాల్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సేవలు కనిపించడం లేని బీజేపీ నేతలు 'కళ్లుండి చూడలేని కబోదులు'లా వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. కావాలంటే వారికి కూడా కంటి ఆపరేషన్లు చేయించేందుకు సిద్ధంగా ఉన్నామని వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

**పోలీసుల తీరుపై ఆగ్రహం..**

మాజీ సర్పంచ్ కోడిగిరి బాబు మాట్లాడుతూ.. బీజేపీ నేత డాక్టర్ జి. మనోహర్ రెడ్డిని నియోజకవర్గ దరిద్రంగా అభివర్ణించారు. తుమ్మలపల్లిలో జరిగిన చిన్న వివాదాన్ని పెద్దది చేసి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని విమర్శించారు. ఒక ఇసుక వ్యాపారి వ్యక్తిగత సమస్యను పార్టీలకు అంటగట్టడం సరికాదన్నారు. పోలీసులు కూడా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, దళితులపై దాడి జరిగినా కేసులు నమోదు చేయడం లేదని ఆరోపించారు. బాధితులకు న్యాయం జరగకపోతే చండూరు బంద్‌కు పిలుపునిస్తామని హెచ్చరించారు.ఈ ప్రెస్‌మీట్‌లో వైస్ చైర్మన్ భూతరాజు దశరథ్, కౌన్సిలర్లు కటకం రమేష్, వాసు, మాజీ కౌన్సిలర్ కోడి వెంకన్న,పున్న ధర్మేందర్, కల్లెట్ల మారయ్య, భీమనపల్లి శేఖర్,ఐయితరాజు మల్లేష్,బ్రహ్మం, డీలర్ వెంకన్న ఇరి వెంకటేశం, గజ్జల కృష్ణారెడ్డి,లతీఫ్ ఖలీల్,జన్ను, వెంకన్న, దశరథ, హైమద్ నాగరాజు,పందుల సత్యం,రవి,బోడ వెంకటేశం, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఇఫ్తార్ విందులో పాల్గొన్న సింగరేణి అధికారులు

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు: ఎండి. రజాక్

**భద్రాద్రి కొత్తగూడెం మార్చ్ 19 (వుదయం ప్రతినిధి):**



రామవరం జామియా మజీద్ ఇంతే జామియా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో సింగరేణి కొత్తగూడెం ఏరియా వర్క్ షాప్ డీజీఎం జై కిష్టఫర్, ఐఎన్టియుసి కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎండి రజాక్, వర్క్ షాప్ ఇంజనీర్స్ బి. శంకర్,టి.అనిల్ ,ఏ. ఉపేందర్ బాబు ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంజాన్ యొక్క ముఖ్య సందేశం ఆధ్యాత్మికత, స్వయం నియంత్రణ, దయ మరియు ఐక్యత ఉపవాసం ద్వారా పేదల ఆకలిని అర్థం చేసుకోవడం ఖురాన్ పఠనం ద్వారా దేవునికి దగ్గరవ్వడం, క్షమాపణ కోరడం, దానధర్మాలు చేయడం. ద్వారా సమాజంలో సోదర భావాన్ని పెంపొందించడం. ఈ పవిత్ర మాసం యొక్క ప్రధాన ఉద్దేశ్యం రంజాన్ యొక్క ముఖ్య ఉద్దేశాలు మరియు సందేశాలు ఆధ్యాత్మికత , ఆత్మ నియంత్రణ, ఉపవాసం ఉండటం ద్వారా కేవలం ఆహారానికి దూరంగా ఉండటమే కాకుండా, చెడు ఆలోచనలు, మాటలు, పనులను నివారించి మనస్సును నియంత్రించుకోవడం నేర్చుకుంటారు. సానుభూతి మరియు పేదరికంపై అవగాహన రోజంతా ఆకలి, దప్పికలతో ఉండటం ద్వారా పేదలు మరియు నిరుపేదలు ఎదుర్కొనే కష్టాలను ఆకలి వేదనను స్వయంగా అనుభవించి తెలుసుకుంటారు.దానధర్మాలు జకాత్ రంజాన్ మాసంలో దానధర్మాలు చేయడం చాలా ముఖ్యం సమాజంలో ఉన్న పేదవారికి సహాయం చేయడం కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవడం ద్వారా ఐక్యతను చాటుకుంటారు.దేవునితో అనుబంధం పవిత్ర ఖురాన్ అవతరించిన నెల కాబట్టి ఈ నెలలో ప్రార్థనలు తారావి నమాజ్ , ఖురాన్ పఠనం, దేవుణ్ణి స్మరించడం ద్వారా దైవ సాన్నిధ్యాన్ని పొందుతారు.క్షమాపణ మరియు సద్గుణాలు ఈ నెలలో అల్లాహ్ క్షమాపణలు ప్రసాదిస్తాడని నమ్మకం. క్రమశిక్షణ, సహనం , దయ వంటి సద్గుణాలను అలవర్చుకోవడానికి ఇది ఒక సువర్ణావకాశం సంక్షిప్తంగా రంజాన్ అనేది ఒక వ్యక్తి తనను తాను శుద్ధి చేసుకుని మానవాళికి సేవ చేసేలా ప్రేరేపించే ఆధ్యాత్మిక శిక్షణా కాలమే ఈ 30 రోజుల ఉపవాసం అని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జామియా మస్జిద్ అధ్యక్షులు ఎస్.కె.ఖమర్, మాజీ అధ్యక్షులు ఎండి సత్తార్ పాషా, హుస్సేన్ ఖురేషి, ఎండి మజీద్, మున్వర్, జానీ, మహమ్మద్ గౌస్, అస్లాం, కరీం పాష, షౌకత్ భాయ్,జానిమియా, కమిటీ సభ్యులు ఉపవాస దీక్షలో ఉన్న ప్రతి ఒక్కరూ ఇఫ్తార్ పార్టీలో పాల్గొనడం జరిగింది.

### కృత్రిమ పానీయాలు మానేద్దాం

## సహజ పానీయాలు సేవిద్దాం

బి చంద్రశేఖర్ నల్లగొండ జిల్లా కలెక్టర్

**నల్లగొండ, మార్చి 19(వుదయం)**



తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నల్లగొండ జిల్లా మరియు జ్ఞాన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నన్నూరి రమణారెడ్డి మరియు నర్రా శేఖర్ రెడ్డి అధ్యక్షతన జిల్లా గడియారం సెంటర్ వద్ద నిర్వహించిన ఉగాది పచ్చడి వితరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ గారు మాట్లాడుతూ ప్రకృతిలో సహజంగా దొరికే పానీయాలను తాగాలని కృత్రిమంగా తయారై పానీయాల వల్ల ఆరోగ్యం చెడి పోతుందని తెలుపుతూ ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని కృత్రిమ పానీయాలు మానేద్దాం సహజ పానీయాలు సేవిద్దాం అనే నినాదంతో ఉగాది పచ్చడి వితరణ కార్యక్రమాన్ని చేపట్టిన టీఎస్ యుటిఎఫ్ నల్లగొండ జిల్లా కమిటీని అభినందించారు. నల్లగొండ కార్పొరేషన్ మొదటి మేయర్ శ్రీమతి చైతన్య శ్రీనివాస్ రెడ్డి గారు మాట్లాడుతూ తెలుగు నూతన సంవత్సర మైన ఉగాది యొక్క విశిష్టతను కాలంలో వచ్చే మార్పులకనుగుణంగా మన శరీరానికి సరైన పోషకాలు ఇచ్చేటటువంటి సహజ పానీయాలను తాగాలనే మోటీవ్ ఇలాంటి కార్యక్రమం చేపట్టడం అభినందనీయమని అన్నారు. ఆ రాష్ట్ర సంఘ ఉపాధ్యక్షులు ఎం రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ టీఎస్ యుటిఎఫ్ అధ్యయనం అధ్యాపనం సామాజిక స్పృహలో భాగంగా సమాజంలో కృత్రిమ పానీయాల వల్ల జరిగేటటువంటి అనర్థాలను ప్రజలకు వివరించి సహజ పానీయాలను సేవించడం ద్వారా జరిగే లాభాలను ప్రజలకు వివరించడం మా సంఘ బాధ్యత అని అన్నారు. రాష్ట్ర కార్యదర్శి పెరుమాళ్ళ వెంకటేశం మాట్లాడుతూ యువత ఈనాడు శీతల పానీయాలను విచ్చలవిడిగా తాగుతూ తమ ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారని అందుకే గత కొన్ని సంవత్సరాలుగా నల్లగొండ జిల్లా కమిటీ జన విజ్ఞాన వేదిక కలిసి ప్రతి ఉగాది రోజున షడ్రుచులు కలిగినటువంటి ఉగాది పచ్చడిని పంపిణీ చేస్తూ శీతల పానీయాలతో జరిగేటటువంటి అనర్థాల పట్ల అవగాహన కల్పిస్తూ హక్కులతో పాటు బాధ్యతగా సమాజంలో కృత్రిమ పానీయాల వల్ల జరిగే అనర్థాలు తగ్గించడానికి తమ వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఉగాది పచ్చడి వితరణ కేంద్రాన్ని సందర్శించినటువంటి డిఎస్పి గారు మాట్లాడుతూ సామాజిక స్పృహ కలిగిన టీఎస్ యుటిఎఫ్ ఉపాధ్యాయ సంగం సహజ పానీయాల వల్ల కలిగే ఎటువంటి లాభాలను సమాజానికి తెలపడం ఎంతో మంచి పరిణామం అని అందరూ ఈ వేసవిలో కొబ్బరి నీళ్లు, మజ్జిగ, నిమ్మకాయ రసం, చెరుకు రసం వంటి సహజపానియాలే తాగాలని అన్నారు.మాజీ నల్లగొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి గారు మాట్లాడుతూ ఈరోజు నుండి తెలుగువారికి నూతన సంవత్సరం ప్రారంభం అవుతుందని పంచాంగం పఠనం చేసి రాబోయే సంవత్సర కాలంలో రాశులు, నక్షత్రాలు, కాలాల గురించి ఎలా ఉంటుందో తెలుసుకోవడం జరుగుతుందని ఇది హిందువులకు గొప్ప పండుగని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎఫ్ డబ్ల్యు ఎఫ్ రాష్ట్ర కోశాధికారి ఎడ్ల సైదులు జిల్లా కార్యదర్శులు గేర నరసింహ, ముఠలయ్య, నలపరాజు వెంకన్న కొమ్మరాజు సైదులు, మధుసూదన్, జన విజ్ఞాన వేదిక బాధ్యులు చంద్రశేఖర్, పిడి విమల, టాప్రా జిల్లా అధ్యక్షులు శ్యాంసుందర్, w అడ్వకేట్ శంకరయ్య, వివిధ మండలాల బాధ్యులు కార్యకర్తలు పాల్గొన్నారు.





### పరాభవ నామ సంవత్సరం అన్నీ పరాభవాలే

## వేద పండితులు వావిల లక్ష్మీనారాయణ

**కోదాడ ,మార్చి 19(వుదయం)**

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని కాపుగల్లు గ్రామంలోని అభయాంజనేయ స్వామి దేవాలయంలో పంచాంగ శ్రవణం కార్యక్రమం భక్తి, శ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా ప్రముఖ పండితులు వావిలాల లక్ష్మీనారాయణ శర్మ పంచాంగ శ్రవణం నిర్వహించి, నూతన సంవత్సరంలో గ్రహస్థితులు, రాశి ఫలితాలు, వర్షపాతం, వ్యవసాయం, ఆర్థిక పరిస్థితులు వంటి అంశాలపై వివరంగా విశ్లేషించారు. గ్రామ ప్రజలు ఆసక్తిగా పాల్గొని పంచాంగ శ్రవణాన్ని ఆలకించారు.కార్యక్రమం సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కొత్త సంవత్సరంలో సుఖసంతోషాలు, శాంతి, ఐశ్వర్యం కలగాలని ప్రార్థనలు చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దొంతగాని అప్పారావు, రెండవ వార్డు సభ్యుడు తొడేటి ఉపేందర్, ముత్యం వీరబాబు, ముత్తవరపు వీరయ్య, కాసాని రామారావు, పంగులూరి రమేష్, చిగురుపాటి వెంకటేశ్వర్లు తదితర ప్రముఖులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్యకు ఘన సన్మానం

### శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నేతలు.



**వరంగల్ మార్చి 19 (వుదయం ప్రతినిధి):**

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్యకు వరంగల్ నగరంలో ఘన సన్మానం జరిగింది. పోచమ్మ మైదాన్‌లోని ఆయన స్వగృహంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎమ్మెల్సీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సారయ్యను శాలువాతో సత్కరించి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.తన్ను కలిసిన అభిమానులను, కార్యకర్తలను బస్వరాజ్ సారయ్య ఆప్యాయంగా పలకరించి, కౌగిలించుకుని ఉగాది శుభాకాంక్షలు పంచుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ క్రోధినామ సంవత్సరంలో ప్రతి ఇంటా సుఖశాంతులు, ఆయురారోగ్యాలు వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీని కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కూచన ఏకాంబరం, నారగోని మురళీ గౌడ్, లక్ష్మణ్, కార్పొరేటర్ గుండేటి నరేందర్, జన్ను రవి, రడం కృష్ణమూర్తి, కొండా సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

## భారీగా నల్లబెల్లం పట్టివేత

**మహబూబాబాద్ ,మార్చి 19(వుదయం)**





మహబూబాబాద్ జిల్లాలో పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో భారీ స్థాయిలో నల్లబెల్లం స్వాధీనం చేసుకున్నారు.అక్రమ సారాయి తయారీకి వినియోగించే నల్లబెల్లాన్ని లారీ ద్వారా తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో టాస్క్ ఫోర్స్ మరియు కురవి పోలీసులు చర్యలు చేపట్టారు. కురవి శివారు సోమ్లా తండా వద్ద లారీని అడ్డగించి తనిఖీ చేయగా, అందులో సుమారు రూ.8 లక్షల విలువైన 70 క్వింటాళ్ల నల్లబెల్లం,10 క్వింటాళ్ల పట్టికను గుర్తించారు. వెంటనే వాటిని స్వాధీనం చేసుకుని, లారీని సీజ్ చేశారు.ఈ ఘటనలో గుగులోత్ సుమన్ మహబూబాబాద్ ఆరెపల్లి మధు, బొల్లా విజయ్ కుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు.ఈ ఆపరేషన్‌లో టాస్క్ ఫోర్స్ సీఐ హతీరామ్,ఎస్ఐ తాహేర్ బాబా, కురవి ఎస్ఐ గంద్రాతి సతీష్, ఎస్ఐ జయకుమార్‌తో పాటు పోలీస్ సిబ్బంది సమ్మయ్య, హరిబాబు, నరేష్, బద్రు, బాబు పాల్గొన్నారు.



మర్రి యాదవ రెడ్డి

## అందరి జీవితాల్లో వెలుగులు నింపాలి

**హనుమకొండ, మార్చి 19 (వుదయం ప్రతినిధి):**

శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది పర్వదినం ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలను, ఆనందాలను నింపాలని కుడా (KUDA) మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి ఆకాంక్షించారు. గురువారం సాయంత్రం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఉగాది వేడుకలను పురస్కరించుకుని పూజా కార్యక్రమాలు, పంచాంగ శ్రవణం ఘనంగా నిర్వహించారు.జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభం ముందుగా మర్రి యాదవ రెడ్డి ఇతర ముఖ్య నాయకులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. అనంతరం పండితులు శ్రీ ఐనవోలు సాయి కృష్ణ శర్మ సిద్ధాంతి పంచాంగ పఠనం చేశారు. ఈ ఏడాది వివిధ రాశుల వారికి ఉండబోయే ఆదాయ, వ్యయాలు, రాజపూజ్యం, అవమానాలు మరియు గ్రహగతులను ఆయన క్షుణ్ణంగా వివరించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు జోరిక రమేష్, ఉడతల సారంగపాణి, కుసుమ లక్ష్మీ నారాయణ, తండమళ్ళ వేణు, పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ పులి రజినీకాంత్, కన్వీనర్ తాళ్లపల్లి జనార్ధన్ గౌడ్, నార్లగిరి రమేష్, మిట్టపల్లి రమేష్, కమురున్నిసా, చందర్, రవి యాదవ్, శ్రీనివాస్, అనిల్ కుమార్, జానకి రాములు, రఘు, సరస్వతి, రజిత, విజయ్, సదాంత్, ఆర్ కే నరేంద్ర, తక్కళ్లపల్లి వినీల్ రావు, గుడికందుల వినోద్ కుమార్, సందీప్ యాదవ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులందరూ ఒకరికొకరు ఉగాది శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

## మురికి కాలువల శుద్ధీకరణకు శ్రీకారం

**వర్ధన్నపేట, మార్చి 19 (వుదయం ప్రతినిధి) :**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక "ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక"లో భాగంగా వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డులో మురికి కాలువల శుద్ధీకరణ పనులకు ముఖ్యఅతిథిగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు హాజరై మినీ జేసీబీ సహాయంతో కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూవర్ధన్నపేట నియోజకవర్గ ప్రజలకు పరాభవ నామ సంవత్సర ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపడుతున్న పరిశుభ్రత కార్యక్రమాలు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.వర్ధన్నపేట పట్టణాన్ని నిత్యం పరిశుభ్రంగా ఉంచేందుకు అహర్నిశలు కష్టపడుతున్న పారిశుద్ధ కార్మికులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని ఆయన పిలుపునిచ్చారు. వారి సేవలను గుర్తించి ప్రోత్సహించడం సమాజ బాధ్యత అని తెలిపారు.గతంలో మున్సిపాలిటీలో ఉద్యోగాల విషయంలో కొంతమంది వద్ద డబ్బులు తీసుకొని ఉద్యోగాలు ఇచ్చి తర్వాత తొలగించారనే విషయం తన దృష్టికి వచ్చిందని, ఈ అంశంపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అలాగే వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలో జనాభా ప్రాతిపదికన అవసరమైన పారిశుద్ధ కార్మికులను నియమించే అంశంపై చర్చలు జరుగుతున్నాయని తెలిపారు.ఓరుగల్లు నగర అభివృద్ధిపై రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు ప్రత్యేక దృష్టి సారించారని, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఆ పనులకు సంబంధించి 250 మంది కార్మికుల పోస్టులను మంజూరు చేయాలని ఇటీవల ముఖ్యమంత్రిని కలిసి వినతి పత్రం అందజేశామని తెలిపారు.పరిశుభ్రత అత్యంత ముఖ్యమని, పారిశుద్ధ కార్మికులతో సమావేశం నిర్వహించి వర్ధన్నపేటను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చారని, అసెంబ్లీ సమావేశాలు ముగిసిన వెంటనే స్వయంగా రైతులతో సమావేశమై సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలో మౌలిక వసతుల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను సమగ్రంగా అభివృద్ధి చేయడంతో పాటు ఓపెన్ జిమ్‌లు, వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.అదేవిధంగా త్వరలోనే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులు, ఆసుపత్రి నిర్మాణ పనులు ప్రారంభించబడతాయని, నిరంతరం ప్రజల కోసం కష్టపడుతూ వర్ధన్నపేటను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నానని ఎమ్మెల్యే నాగరాజు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి, వైస్ చైర్మన్ నేతవత్ శోభారాణి రాజేందర్, కౌన్సిలర్స్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ నరకుడు వెంకటయ్య, ఐనవోలు ఆలయ చైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, స్థానిక ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భట్టి చొరవ.. ఖమ్మం రహదారులకు మహర్దశ!

**ఖమ్మం మార్చి 19 (వుదయం జిల్లా ప్రతినిధి):**

జిల్లా వాసుల దశాబ్దాల కల నెరవేరబోతోంది. జిల్లా రవాణా వ్యవస్థలో సరికొత్త అధ్యాయం మొదలుకానుంది 3. మధిర నుంచి ఎర్రుపాలెం వరకు నాలుగు వరుసల రహదారి విస్తరణ. మధిర, ఎల్లెందులపాడు, దెందుకూరు, మీనవోలు మీదుగా ఎర్రుపాలెం వరకు నాలుగు వరుసల రహదారి విస్తరణ. ఈ రహదారి మొత్తం 18.40 కిలోమీటర్ల మేర రూ.110.40 కోట్ల నిధులు మంజూరు. 4. ఖమ్మం నుంచి బోనకల్ వరకు నాలుగు వరుసల రహదారి విస్తరణ. ఖమ్మం, కొత్తూరు, దంసలాపురం, గాంధీనగరం, రామకృష్ణాపురం, పందిళ్లపల్లి, జగన్నాథపురం, నాగులవంచ, ముష్టికుంట్ల మీదుగా బోనకల్ వరకు రహదారి విస్తరణ. మొత్తంగా 28.03 కిలోమీటర్ల మేర రహదారి విస్తరణకు రూ.157.23 కోట్ల నిధుల మంజూరు. 5. బోనకల్‌ఆళ్లపాడు, రాయన్నపేటవంగవీడు వరకు నాలుగు వరుసల రహదారి విస్తరణ. బోనకల్, ఆళ్లపాడు, రాయన్నపేట మీదుగా వంగవీడు వరకు రహదారి విస్తరణ. మొత్తంగా 15.72 కిలోమీటర్ల మేర రహదారికి విస్తరణకు రూ.94.32 కోట్ల నిధుల మంజూరు అయ్యాయి.

## హనుమాన్ ఆలయంలో పంచాంగ శ్రవణం

**- చందేపల్లిలో భక్తిశ్రద్ధలతో ఉగాది వేడుకలు**

**యాదాద్రి భువనగిరి / మార్చి వుదయం జిల్లా ప్రతినిధి** : మోటకొండూరు మండలంలోని చందేపల్లి గ్రామంలో ఉగాది పండుగ వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా జరిగాయి అనంతరం భక్తులకు షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది ప్రసాదాన్ని పంపిణీ చేశారు. అనంతరం సర్పంచ్ బోట్ల నగేష్ మాట్లాడుతూ.. గ్రామం అభివృద్ధి పథంలో నడవాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అంజి రెడ్డి, గ్రామ వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా ఎస్పీ జన్మదిన వేడుకలు

**జయశంకర్ భూపాలపల్లి మార్చి 19(వుదయం జిల్లా ప్రతినిధి):**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఇల్లంద క్లబ్ క్లబ్ హౌస్ లో గురువారం జరిగిన ఉగాది ఉత్సవ పురస్కారల కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. భూపాలపల్లి ఎమ్మెల్యే సత్యనారాయణ రావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఎస్పీ నీ శాలువాలతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాష్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, భూపాలపల్లి మున్సిపల్ కౌన్సిలర్లు, ఉగాది ఉత్సవ నిర్వహణ కమిటీ సభ్యులు గుజ్జ సారేశ్వరరావు, ములకల లక్ష్మారెడ్డి,మండల రాంబాబు,ఆకుతోట ప్రవీణ్ కుమార్,మంద జోవర్ధన్,లతో పాటు టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా నాయకులు కొంద్ర రమేష్, టి. దుర్గయ్య, దూలం కుమారస్వామి, జిల్లా విలేకరులు, డాన్స్ మాస్టర్లు,ఆయా పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ | అదిలాబాద్ | నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల వార్తలు

## మెల్లకుంట తండా అభివృద్ధిపై ఆందోళన

### సర్పంచ్ పనితీరుపై విమర్శలు



మెల్లకుంట తండా గ్రామపంచాయతీ భవనం



రామావత్ నీల్యా నాయక్
మౌలిక వసతుల కొరత



**మెల్లకుంట తండా అభివృద్ధిపై ఆందోళన**
**నాగిరెడ్డిపేట, వుదయం**

మండలంలోని మెల్లకుంట తండా అభివృద్ధి పనులు నిలిచిపోవడంతో గ్రామ ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ముఖ్యంగా సీసీ రోడ్ల నిర్మాణం, శ్రీశక్తి భవన నిర్మాణం వంటి ప్రాథమిక అవసరాలకు ఇప్పటివరకు నిధులు మంజూరు కాకపోవడం పట్ల ఆందోళన వ్యక్తమవుతోంది.ఈ సందర్భంగా గిరిజన శక్తి నాయకుడు మోహన్ నాయక్ మాట్లాడుతూ, తండాల అభివృద్ధి లక్ష్యంగా గ్రామపంచాయతీలు ఏర్పాటు చేసినప్పటికీ ఆ లక్ష్యం సాధ్యం కాలేదని విమర్శించారు. ప్రభుత్వం నుంచి నిధులు
అందకపోవడం వల్ల అభివృద్ధి పనులు పూర్తిగా నిలిచిపోయాయని తెలిపారు.

**మోహన్ నాయక్,**
**గిరిజన సంఘం నాయకులు**

**"రాజకీయ కార్యక్రమాలకే ప్రాధాన్యం"**

మెల్లకుంట తండా గ్రామ సర్పంచ్ పనితీరుపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. అభివృద్ధి పనులను పక్కనపెట్టి రాజకీయ కార్యకలాపాలు, పార్టీ మార్పులు, సమావేశాల నిర్వహణపై ఎక్కువగా దృష్టి సారిస్తున్నారని ఆరోపించారు. గ్రామంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం, పండుగల సమయంలో మాత్రమే చురుకుగా కనిపించడం తప్ప ప్రజా సమస్యల పరిష్కారంపై
శ్రద్ధ లేదని పేర్కొన్నారు.

మెల్లకుంట తండాలో తాగునీరు, రహదారులు, పారిశుధ్యం వంటి కనీస సదుపాయాలు సైతం సరైన స్థాయిలో లేవని గ్రామస్తులు వాపోతున్నారు. మాదేవునిగడ్డ తండాకు వెళ్లే రహదారి దారుణ స్థితిలో ఉండటంతో అత్యవసర సమయాల్లో అంబులెన్స్ సైతం చేరుకోవడం కష్టంగా మారిందని తెలిపారు.

**పార్టీలకు అతీతంగా అభివృద్ధి జరగాలి**

గ్రామాలను రాజకీయ పార్టీల ఆధారంగా విభజించడం సరికాదని, అన్ని గ్రామాలకు సమానంగా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి కార్యక్రమాలు రాజకీయాలకు అతీతంగా ప్రజల అవసరాల ఆధారంగా అమలు చేయాలని సూచించారు.

**త్వరిత చర్యలకై డిమాండ్**

ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి మెల్లకుంట తండాకు సీసీ రోడ్లు, భవన నిర్మాణాలకు నిధులు విడుదల చేయాలని గిరిజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టే అవకాశముందని హెచ్చరించారు.

## క్యాంపు కార్యాలయంలో ఘనంగా ఉగాది వేడుకలు



**వెంకటాచార్యులచే పంచాంగ శ్రవణం**
**ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి హాజరు**

**కరీంనగర్ మార్చి19(వుదయం ప్రతినిధి,**

తెలుగు సంవత్సరాది ఉగాది వేడుకలను గురువారం ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్ లోఘనంగా నిర్వహించారు.ఈ వేడుకలకు మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ ఎల్ఎండీ కాలనీలోని శ్రీ తాపాళ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ప్రధాన అర్చకులు గోవర్ధన వెంకటాచార్యులు వేద మంత్రోచ్ఛవాల మధ్య పరాభవనామ సంవత్సరపు పంచాంగ శ్రవణం ప్రారంభించారు. తొలుత ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ జాతకానికి సంబంధించిన రాశీ ఫలాలు తెలియజేశారు. అలాగే రాశుల వారీగా ఫలాలు, గోచార,గ్రహస్థితులను వివరించారు.ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని, ప్రజలంతా సుఖ శాంతులతో సంతోషంగా ఉన్నారని చెప్పారు.శాంతి భద్రల సమస్య లేకుండా ప్రజలు ప్రశాంతంగా ఉన్నారని, ఒక వైపు పంట దిగుబడులు పెరగడమే కాకుండా పండించిన ధాన్యానికి ప్రభుత్వపరంగా మద్దతు ధర రావడం, మరో వైపు రైతు భరోసా, బోనస్ డబ్బుల చెల్లింపులతో రైతుల కళ్లలో ఆనందం వెల్లివిరుస్తున్నదని చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పెద్ద సంఖ్యలో ఉద్యోగ నియామకాలు చేపట్టడంతో నిరుద్యోగ యువతీయువకులు ధీమాగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ ప్రజాపాలనలో ప్రజలకు మరింత మంచి జరగాలని, ఆయురారోగ్యాలు,అష్టైశ్వర్యాలు చేకూరాలని డాక్టర్ కవ్వంపల్లి ఆకాంక్షిస్తూ ప్రజలకు,కాంగ్రెస్ పార్టీశ్రేణులకు ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ వేడుకలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్, తిమ్మాపూర్ ఎంపీడీవో మల్హోత్ర, తహసీల్దార్ కర్ర శ్రీనివాస్ రెడ్డి, తిమ్మాపూర్, మానకొండూర్,శంకరపట్నం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బండారి రమేశ్, నందగిరి రవీంద్రచారి, గోపగోని బస్వయ్యగౌడ్, పార్టీ నాయకులు మోర రమణారెడ్డి, శ్రీగిరి రంగారావు, కుంట రాజేందర్ రెడ్డి, గోపు మల్లారెడ్డి,గోగూరి నర్సింహారెడ్డి, తాళ్లపల్లి సంపత్ గౌడ్, మామిడి అనిల్ కుమార్, గంకిడి లక్ష్మారెడ్డి, పొన్నాల సంపత్, కొత్త తిరుపతిరెడ్డి, బుధారపు శ్రీనివాస్, చింతల లక్ష్మారెడ్డి, చింతల తిరుపతిరెడ్డి, డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, కేతిరెడ్డి ఎల్లారెడ్డి, పులి రాము,రమేశ్, అసోద శ్రీనివాస్, మాచర్ల అంజయ్య,ఓదెలు యాదవ్, ముద్దసాని శ్రీనివాస్ రెడ్డి, రేమిడి శ్రీనివాస్ రెడ్డి, పెంచాల కిషన్ రెడ్డి, మీస సత్యనారాయణ,గొల్లెన కొమురయ్య, నాగిశెట్టి రాజయ్య, తోట శ్రీనివాస్, జువ్వాడి మదన్మోహన్ రావు, పులి రమేశ్, కాత మల్లేశం, గొట్టె మధు,నోముల అనిల్, ఎడ్ల శ్రీధర్ తోపాటు వివిధ గ్రామాల పార్టీ అధ్యక్షులు,నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

## జువ్వాడి భవన్లో పంచాంగ శ్రవణం...

**కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు**
**మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్**




**కోరుట్ల మార్చి 19**
**(వుదయం ప్రతినిధి)**

కోరుట్ల పట్టణ జువ్వాడి కృష్ణారావు స్వగృహం జువ్వాడి భవన్ లో ఉగాది పండుగ సందర్భంగా శ్రీ పరాభవ నామ నూతన సంవత్సర ఉగాది సందర్భంగా పంచాంగ శ్రవణం కార్యక్రమం చేపట్టారు పంచాంగ శ్రవణ కార్యక్రమం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి ఉగాది పచ్చడిని అందజేశారు అనంతరం జువ్వాడి కృష్ణారావు మాట్లాడుతూ ఈ సంవత్సరం సకాలంలో వర్షాలు సమృద్ధిగా కృషి ఆడి పంటలతో రాష్ట్రమంతా సుభిక్షంగా ఉండాలని ప్రతి ఒక్కరు ఆయురారోగ్యాలతో ఉండి తమ కుటుంబ సభ్యులతో సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో జువ్వాడి కృష్ణారావు తో పాటు కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ కోరుట్ల మార్కెట్ కమిటీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి మల్లాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పుష్పలత నర్సయ్య కోరుట్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొంతం రాజం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పెరుమాండ్ల సత్యనారాయణ యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ మాజీ అధ్యక్షులు ఏలేటి మహిపాల్ రెడ్డి కౌన్సిలర్లు ఎడ్ల జలజ రమేష్ తోట గంగాధర్ మోర్తాడ్ లక్ష్మీనారాయణ మేడిపల్లి శిరీష శేఖర్ మాజీ కౌన్సిలర్ జిందం లక్ష్మీనారాయణ ఆడెపు కమల మధు నాయకులు సంఘ లింగం మచ్చ కవిత సాయిబాబా దేవాలయ డైరెక్టర్లు కిరణ్ అరవింద్ నాయకులు నర్సయ్య కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు






## కొండగట్టు ఆలయ నూతన ఈవో అంజనా రెడ్డి భీమేశ్వర స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు

**వేములవాడ మార్చి19(వుదయం ప్రతినిధి):** శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం, వేములవాడ అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామివారిని దర్శించుకుని, శ్రీ కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయ నూతన ఈవో ఎస్. అంజనా రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం కొండగట్టులో బాధ్యతలు స్వీకరించిన అనంతరం, భీమేశ్వర స్వామివారి దర్శనం చేసుకున్నారు.అనంతరం స్వామివారి మండపంలో శేషవస్త్రం కప్పి, లడ్డు ప్రసాదాన్ని ఆలయ
ఈవో ఎల్. రమాదేవి అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఉద్యోగులు, వేద పండితులు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్‌లో ఘనంగా 'శ్రీ పరాభవ' నామ సంవత్సర ఉగాది వేడుకలు

- ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ
- ఉగాది పచ్చడి రుచుల సమ్మేళనమే కాదు.. మన సంస్కృతికి ప్రతీక
- పంచాంగ శ్రవణంలో పాల్గొన్న జిల్లా ఎస్పీ, ఏఎస్పీ





**కామారెడ్డి, మార్చి 19 (వుదయం ప్రతినిధి):**

కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ పరాభవ నామ సంవత్సర పంచాంగ శ్రవణం, ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ యం.రాజేష్ చంద్ర ముఖ్య అతిథిగా హాజరై, ప్రత్యేక పూజలు నిర్వహించి నూతన సంవత్సర పంచాంగ శ్రవణాన్ని ఆలకించారు. అనంతరం విచ్చేసిన వారందరికీ ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ఉగాది పచ్చడి అంటే కేవలం ఆరు రుచుల సమ్మేళనం మాత్రమే కాదని, అది మన భారతీయ సంస్కృతి యొక్క గొప్పదనానికి ప్రతీక అని పేర్కొన్నారు. జీవితంలో ఎదురయ్యే కష్టసుఖాలను, వివిధ అనుభవాలను సమానంగా స్వీకరించాలని ఉగాది పచ్చడి మనకు గుర్తు చేస్తుందని వివరించారు. మన గొప్ప సాంప్రదాయాలను గౌరవిస్తూ, వాటిని స్ఫూర్తిగా తీసుకుని ఈ నూతన సంవత్సరానికి ఉత్సాహంగా స్వాగతం పలకాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలందరికీ, వారి కుటుంబ సభ్యులకు ఎస్పీ మనస్ఫూర్తిగా ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు.
గత సంవత్సర కాలంలో జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు అందించిన సహకారాన్ని ఎస్పీ ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. "కామారెడ్డి పోలీసులు ఎప్పుడూ ప్రజలతోనే ఉంటారు. ప్రజల సంతోషాలను పంచుకోవడమే కాకుండా, కష్టకాలంలో కూడా వారికి వెన్నుముకగా నిలుస్తాం" అని ఆయన భరోసా ఇచ్చారు. ఈ నూతన సంవత్సరంలో అందరికీ ఆయురారోగ్యాలు కలగాలని, ఎలాంటి సమస్యలు ఎదురైనా వాటిని ధైర్యంగా ఎదుర్కొనే శక్తిని భగవంతుడు ప్రసాదించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో కామారెడ్డి ఏఎస్పీ బి.చైతన్యరెడ్డి, కామారెడ్డి టౌన్ ఎస్హెచ్ఓ నరహరి, రూరల్ సీఐ రామన్, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, పట్టణ ప్రజలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం ముగిసిన అనంతరం విచ్చేసిన వారందరికీ ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు.

## ముస్లిం సోదరులకు పవిత్ర మాసం "రంజాన్"



**ముస్లింల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది**
**మసీదు ప్రాంగణంలో వాటర్ షెడ్ ప్రారంభం**
**రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద**




**మంచిర్యాల / (వుదయం ప్రతినిధి)**

ముస్లిం సోదరులకు పవిత్ర మాసమైన రంజాన్ పండుగను పురస్కరించుకొని ప్రభుత్వం ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందుతో పాటు తోఫా అందిస్తుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. గురువారం జిల్లాలోని జైపూర్ మండలం ఇందారం గ్రామంలోని మసీదులో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు, తోఫా పంపిణీ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాబు రావు లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందుతో పాటు తోఫా అందిస్తుందని తెలిపారు. జైపూర్ మండలానికి 350 మంజూరు చేయగా ఇందారం గ్రామానికి 250 కేటాయించడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేసే దిశగా ప్రజా ప్రతినిధులు, అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలలో పారిశుధ్యం, త్రాగునీరు, ప్రభుత్వ కార్యాలయాలలో పెండింగ్ పైళ్ళ క్లియరెన్స్, ఇతర కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని, ఇందులో భాగంగా ప్రజా ప్రతినిధులకు కార్యక్రమం అమలుపై శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే విధంగా రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లు ఏర్పాటు చేసి పలు రకాల వృత్తి విద్యలో శిక్షణ అందించి ఉద్యోగ, వ్యాపార అవకాశాలు కల్పించేందుకు కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం ఈద్ కా తోఫా కార్యక్రమంలో భాగంగా ముస్లిం సోదరులకు కానుకలు అందజేసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. మసీదు సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ షెడ్ ను ప్రారంభించారు.అనంతరం క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని ఎ జోన్ లో గల బిలాల్ మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ముస్లిం మత పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి పల్లె కదిలేలా మహాశోభయాత్ర

**పదేళ్ళ శ్రీరామనవమి యాత్రకు భారీ ఏర్పాట్లు..**



**-హిందూవాహిని జిల్లా ఉపాధ్యక్షుడు ఉయ్యంకార్ సాయికుమార్..**
**పెద్దపల్లి మార్చి 19 (వుదయం ప్రతినిధి)**

ప్రతి పల్లె కదిలేలా శ్రీరామనవమి మహా శోభాయాత్ర చేపట్టనున్నట్లు హిందూవాహిని జిల్లా ఉపాధ్యక్షుడు ఉయ్యంకార్ సాయికుమార్ తెలిపారు. ఈనెల 27న చేపట్టబోయే శోభాయాత్రకు పెద్దకల్వల గ్రామంలో ప్రముఖులను కలిసి శోభయాత్రకు ఆహ్వానించారు అనంతరం సాయి మాట్లాడుతూ, హిందూవాహిని ఆద్వర్యంలో చేపడుతున్న శోభాయాత్ర పదేళ్ళు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా పదివేల మంది హిందువులతో మహాశోభాయాత్రకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. శ్రీలింగేశ్వర ఆశ్రమ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ పిట్ల కృష్ణమహారాజ్, హిందూశివంగి, ప్రముఖ నటి కరాటే కళ్యాణి హాజరవుతారని తెలిపారు. ఈనెల 27 శుక్రవారం సాయంత్రం 4గంటలకు కంచరబావి హనుమాన్ దేవాలయం నుండి శోభాయాత్ర ప్రారంభమవుతుందని, అన్ని వర్గాలకు చెందిన హిందువులు
పెద్దఎత్తున మహాశోభాయాత్రలో పాల్గొని శక్తి ప్రదర్శన చేయాలని సాయి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్దకల్వల సర్పంచ్ నర్ల కనకమ్మ పోలురాజ్, ఉపసర్పంచ్ పర్స లక్ష్మీ శంకర్, స్థానిక వార్డ్ మెంబర్స్, బిజెపి నాయకులు పర్స సమ్మయ్య, పయ్యావుల శ్రీనివాస్, నర్ల బాపు, బండి రాజశేఖర్, గుండెవేన గణేష్,నర్ల సాయి, తదితరులు



# మహబూబ్‌నగర్ | మెదక్ ఉమ్మడి జిల్లాల వార్తలు

## ఉగాది సందర్భంగా ఎడ్ల బండ్ల ఊరేగింపు



**జోగిపేట్ వుదయం** గురువారం ఆందోల్ నియోజకవర్గం లోని చౌటకు ర్ మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఉగాది పర్వదినం కొత్త సంవత్సరం కొత్త మలుపు తిరగాలని లింగంపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ బ్యాగరి రాజు ఆధ్వర్యంలో మొట్టమొదటిసారిగా కుల మతాలకు అతీతంగా ఉగాది సందర్భంగా గ్రామంలో దేవతలకు మొక్కులు తీర్చుకుంటూ ఎడ్లబండ్ల కార్యక్రమం. నిర్వహించడం జరిగింది గ్రామ సర్పంచ్ బ్యాగరి రాజు. మాట్లాడుతూ లింగంపల్లి గ్రామంలో ఆనాటి నుండి నేటి వరకు ఏ పండగ అయినా చుట్టూ పక్క గ్రామాలకు చూడడానికి వెళ్లే వాళ్ళం నేను సర్పంచ్ కావడం మా గ్రామంలో ఉగాది సందర్భంగాఎడ్లబండ్లు నిర్వహించడం నాకు ఎంతో గర్వకరణమని అన్నారు ఈ కార్యక్రమంలో ఎడ్ల బండ్లు ఊరేగింపు ఒకటో నెంబర్ తలారి మల్లేశం రెండో 2బండి దుర్గయ్య. మూడో బండి మాదిగ నరసింహులు నాలుగో బండి నన్నే మైపాల్ ఐదవ బండి బ్యాటరీ నర్సింలు ఆరో బండి బేగరి ప్రశాంత్ ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బ్యాగరి రాజు ఆధ్వర్యంలో ఎలాంటి అవంతి సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు ఉప సర్పంచ్ వార్డ్ మెంబర్లు గ్రామ పెద్దలు మహిళలు పాల్గొన్నారు

## బీకేఎస్ ఆధ్వర్యంలో ఘనంగా ఉగాది వేడుకలు



**మక్తల్ మార్చి 19(వుదయం ప్రతినిధి)** ఊట్కూరు మండలం పగిడి మారి, ఓబులా పురం గ్రామంలో భారతీయ కిసాన్ సంగ్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. బికేఎస్ పగటిమారి ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి సొంత పొలంలో ఉగాది పండుగ వస్తావని ఎద్దుల పూజ,భారత్ మాత పూజ పూజలను నిర్వహించారు.ఈ సంవత్సరం పంటలు బాగా పండాలని భగవంతుని ప్రార్థించారు.భారతీయ కిసాన్ సంగ్ తరపున రైతులందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

## కిడ్నాప్ కలకలం.. డీఎస్పీ వివరణ ?



**సంగారెడ్డి వుదయం :** సంగారెడ్డి పట్టణం లోని 12వార్డ్ బృందావనం కాలనీలో కిడ్నాప్ యత్నం జరిగిందన్న వార్తలు స్థానికంగా కలకలం రేపాయి. అయితే ఈ వార్తలను పోలీసులు పూర్తిగా ఖండించారు. ఈ ఘటనపై స్పందించిన డీఎస్పీ సత్యయ్య, అసలు విషయాన్ని వెల్లడించారు. డీఎస్పీ వివరాల ప్రకారం, నిఖిల్ అనే యువకుడు ఆటోలో ప్రయాణిస్తుండగా కాలనీలోని కొంతమంది పిల్లలతో మాటా మాట పెరిగింది. ఈ నేపథ్యంలో చిన్నపాటి అపార్థం చోటు చేసుకోవడంతో పరిస్థితి ఘర్షణకు దారితీసింది. అయితే ఇది కిడ్నాప్ యత్నం కాదని స్పష్టం చేశారు. ఇప్పటికే సంబంధిత ఆటోను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టినట్లు తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో ప్రచారం అవుతున్న కిడ్నాప్ వార్తలు పూర్తిగా నిరాధారమని పేర్కొన్నారు. ఇలాంటి పుకార్లు వ్యాప్తి చేసి ప్రజల్లో భయాందోళనలు సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ సత్యయ్య హెచ్చరించారు. ప్రజలు కూడా నిర్ధారణ లేని సమాచారాన్ని నమ్మకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## సామాజిక మాధ్యమాల్లో అనుచిత పోస్టులు చేయరాదు

### జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్



**నారాయణపేట టౌన్ మార్చి 19(వుదయం ప్రతినిధి)** నారాయణపేట జిల్లా పరిధిలో సామాజిక మాధ్యమాల్లో విద్వేషాలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు, దుష్ప్రచారం, ఇతరుల మనోభావాలు దెబ్బతీసే విధమైన పోస్టులు పెట్టేవారి పై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ ఒక ప్రకటనలో హెచ్చరించారు. పండగల సమయంలో కుల, మత, ప్రాంతీయంగాను ప్రజల భద్రతకు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవిగా ఉన్న వాటిని సామాజిక మాధ్యమాలలో షేర్ చేసిన చట్టప్రకారం తీవ్రమైన చర్యలు ఉంటాయని తెలిపారు. సామాజిక మాధ్యమాలు అయిన ఫేస్బుక్ ట్విట్టర్ ఇన్స్టాగ్రామ్, వాట్సప్ గ్రూపులలో ఇతరులకు ఇబ్బంది కలిగే విధంగా, ఒక వర్గానికి కించపరిచే విధంగా ఉన్న, తమకు తెలియని వీడియోలు, ఫోటోలు పోస్టులు చేసిన, వాటిని ఇతరులకు ఫార్వర్డ్ చేసిన ఆ గ్రూపు అడ్మిన్ నీ బాధ్యుడిగా చేస్తూ, ఫార్వర్డ్ చేసిన వారిపైన కేసులు నమోదు చేయబడుతాయి అని తెలిపారు. సామాజిక మధ్యమాలను మంచి పనులకు తప్ప వేరే రకంగా వినియోగించే వాళ్లపైన ప్రత్యేకంగ నిఘా వ్యవస్థ ఏర్పాటు చేయడం జరిగింది అని తెలిపారు. జిల్లాలో ఈ తరహా కార్యకలాపాలకు పాల్పడే వారిని అనుక్షణం పోలీసులు గమనిస్తూ ఉండాలని ఆదేశాలు ఇవ్వడం జరిగింది కావున ఈ తరహా నేరలకు పాల్పడే వారిని వెంటనే పట్టుకొని అట్టి వారిపై కేసులు నమోదు చేయాలని పోలీసులకు సూచించారు. పోలీసులు నిరంతరం 24/7 పరిశీలిస్తుంటారని తెలిపారు. సోషల్ మీడియాలో ఎవరైనా పోస్టులు చేసిన, ఫార్వర్డ్ చేసిన జాగ్రత్తగా గమనించి చేయాలని ఎస్పీ సూచించారు.

## సదాశివపేటలో మహిళ ఆత్మహత్యాయత్నం



**సంగారెడ్డి వుదయం** సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండల పరిధిలో గురువారం కలకలం రేగింది. మండలంలోని ఎంకేపల్లి గేటు సమీపంలో విజయలక్ష్మి (45) అనే మహిళ కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటనను గమనించిన స్థానికులు వెంటనే అప్రమత్తమై అత్యవసర సేవలకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సర్వీస్ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని, బాధితురాలిని త్వరితగతిన సంగారెడ్డి జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమెకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనతో స్థానికంగా ఉద్రిక్తత నెలకొంది. మహిళ ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. పోలీసులు ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.




## రామోజీ ఫైనాన్షియల్ సర్వీసెస్ కార్యాలయ ప్రారంభం

**సంగారెడ్డి వుదయం :** సంగారెడ్డి పట్టణం లోని 12వ వార్డు బృందావన్ కాలనీలో ఉగాది పర్వదినం సందర్భంగా రామోజి ఫైనాన్షియల్ సర్వీసెస్ కార్యాలయం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కౌన్సిలర్ రాజేందర్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి కార్యాలయాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్థానిక ప్రజలకు ఆర్థిక సేవలు సులభంగా అందుబాటులోకి రావడం ఎంతో ఉపయోగకరమని తెలిపారు.

రామోజి ఫైనాన్షియల్ సర్వీసెస్ ద్వారా వివిధ రకాల ఫైనాన్షియల్ సేవలు అందిస్తూ ప్రజల అవసరాలను తీర్చాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాలనీ నివాసులు, స్థానిక నాయకులు, సంస్థ ప్రతినిధులు పాల్గొని, కొత్త కార్యాలయ ప్రారంభాన్ని స్వాగతించారు.

## శక్తి పీఠం ఆధ్వర్యంలో ఉగాది ఉత్సవాలు



**నారాయణపేట మార్చి 19(వుదయం ప్రతినిధి)** నారాయణపేట జిల్లా కేంద్రం లోని శక్తి పీఠం ఆధ్వర్యంలో గురువారం స్వస్తి శ్రీ పరాభవ నామ సంవత్సర,చైత్ర శుద్ధ పౌడ్యమి సందర్భంగా ఉగాది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలు శక్తి పీఠం శ్రీ శారదాంబ కళ్యాణ మండపంలో, భక్తుల సమక్షంలో ఆధ్యాత్మిక వాతావరణంలో దిగ్విజయంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గోకర్ణ గౌరవాన్వితులు, శాక్తేయ సహస్ర కిరణ బిరుదాంకితులు, గౌరవ డాక్టరేట్ ను పొందిన టువంటి ,శక్తి పీఠం వ్యవస్థాపకులు పూజ్యశ్రీ డాక్టర్ స్వామి శాంతానంద పురోహిత్ పంచాంగ శ్రవణం చేసి భక్తులకు పరాభవ నూతన సంవత్సర ఫలితాలను వివరించారు. అనంతరం సాయంత్రం 7:30 గంటలకు సభా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఉగాది పురస్కారాల ప్రదాన కార్యక్రమం ఘనంగా ఏర్పాటు చేశారు.అనంతరం రాత్రి 8:30 ని॥ ల నుండి, సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు నిర్వహించారు.తదనంతరం రాత్రి 10:00 గంటలకు పచ్చడి ప్రసాద వితరణతో పాటు, భోజనాల ఏర్పాటుతో విజయవంతంగా ముగిసింది. ఈ ఉత్సవాలలో భక్తులు పాల్గొన్నారు.

## అత్తు ఇమామ్ ఎలా ఉన్నావ్



- మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ని మర్యాదపూర్వకంగా కలిసిన అత్తు ఇమామ్
- ఆప్యాయంగా పలకరించిన మంత్రి తుమ్మల

**వుదయం – సిద్ధిపేట బ్యూరో (మార్చి 19)** సిద్దిపేట జిల్లాలోని నంగునూరు మండలం నర్మెట్టలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ సందర్శనకు వచ్చిన మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ ను చూసి ఎలా ఉన్నావ్ అంటూ ఆప్యాయంగా పలకరించారు. ఈనెల 22న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి రాబోతున్నందున మంత్రులు పొన్నం ప్రభాకర్, గడ్డం వివేక్, తుమ్మల నాగేశ్వర్ రావు ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. సందర్శనకు వచ్చిన మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావును సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీకి రైతు సోదరులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు భారీ ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గయాజుద్దీన్, తప్పట శంకర్, విజయ, డానియల్, ఆత్మ రాములు,తదితరులు పాల్గొన్నారు.



## ఏప్రిల్ 3న పేటలో హిందూ సమ్మేళనం

**నారాయణపేట మార్చి 19(వుదయం ప్రతినిధి)** నారాయణపేట జిల్లా కేంద్రంలోని సింగర్ బేస్ శ్రీ సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో ఏప్రిల్ 3 న సాయంత్రం 6 గంటలకు హిందూ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని హిందూ సమ్మేళన కార్యక్రమ కమిటీ అధ్యక్షులు గుంపు బాలరాజ్ ప్రకటనలో తెలిపారు. హిందూ సమ్మేళన కార్యక్రమంలో భాగంగా పట్టణం లోని పది ఉప బస్తీల నుంచి ఆధ్యాత్మిక భజన సంకీర్తనలతో ఆధ్యాత్మికత ఉట్టిపడేలా కార్యక్రమానికి కాలినడకన హాజరు కావాల్సి ఉంటుందని తెలిపారు. కార్యక్రమ విజయవంతం పై కమిటీ సభ్యులు ప్రత్యేక సమావేశమయ్యారు. హిందూ సమ్మేళన కార్యక్రమం లో భాగంగా ముందుగా యజ్ఞ కార్యక్రమం, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రముఖ ముఖ్య వక్త సందేశం ఉంటుందని తెలిపారు. భారత దేశానికి ఆత్మ ప్రాణం హిందూధర్మం అని అటువంటి హిందూ సమాజాన్ని చైతన్య వంతం చేసి సమైక్యపరచి మన దేశాన్ని విశ్వ గురువుగా నిర్మాణం చేయాలనే లక్ష్యంతో రాష్ట్రీయ స్వయంసేవక సంఘ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని కొనసాగించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొని హిందూ ఐక్యతను సమర సతను చాటాలని కోరారు. అనంతరం ఆత్మీయ హిందూ సమ్మేళన కమిటీని పాలమూరు జిల్లా సహకార్య వాహ మ్యాడమ్ ప్రభాకర్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా గుంపు బాలరాజ్, ఉపాధ్యక్షులుగా దత్తు చిల్లాల్, రాజ్ కుమార్ దోత్రే, వినోద్, విజయలక్ష్మి ,కొండోళ్ల రాములు, కార్యదర్శిగా యశ్వంత్, సహకార దర్శులుగా ఉదయ్ కుమార్, చిన్నరఘు, కిరణ్ మరి కొంతమంది సభ్యులతో కమిటీని ఎన్నుకున్నారు.

## శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి దేవాలయంలో పంచాంగ శ్రవణం



**సంగారెడ్డి వుదయం :** స్థానిక శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి దేవాలయంలో జంగమ సమాజం ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా జ్యోతిష్యంలో పీజీ పట్టా పొందిన డాక్టర్ శ్రీ నాగ మల్లయ్య పంచాంగ శ్రవణం నిర్వహించి భక్తులకు భవిష్యత్ గ్రహచార ఫలితాలను వివరించారు. గ్రహాల స్థితిగతులు వ్యక్తుల జీవితంపై చూపే ప్రభావం, వాటి ఆధారంగా అనుసరించాల్సిన నివారణ ఉపాయాలు, శాంతి పూజలు వంటి అంశాలను ఆయన స్పష్టంగా వివరించారు. భక్తులు తమ తమ రాశుల ప్రకారం చేయాల్సిన పూజలు, అనుసరించాల్సిన ఆచారాలు గురించి తెలుసుకుని ఆసక్తిగా వినిపించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన డాక్టర్ నాగ మల్లయ్య గారికి ఆలయ కమిటీ మరియు భక్తులు కృతజ్ఞతలు తెలిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అలాగే ప్రతి సంవత్సరం లాగే హిందూ సేన ఆధ్వర్యంలో తెలుగు కాలమానం ప్రకారం ఉగాది నుండి ఉగాది వరకు ఉండే క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అందరూ పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. కార్యక్రమం ద్వారా భక్తుల్లో ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందించడమే కాకుండా, సంప్రదాయాల పట్ల మరింత అవగాహన కలిగిందని నిర్వాహకులు తెలిపారు.



## కలెక్టర్ ని మర్యాదపూర్వ కంగా కలిసిన ఆవాజ్ కమిటీ సభ్యులు



**గద్వాల మార్చి 19 (వుదయం ప్రతినిధి)** గద్వాల జిల్లా కేంద్రంలోని జిల్లా కలెక్టరేట్ లో ఇటీవల జిల్లా నూతన కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన గౌరవనీయులైన శ్రీ రిజ్వాన్ భాషా షేక్ గారిని శాలువ తో సన్మానించి, పుస్తకాన్ని అందజేసి అభినందన శుభాకాంక్షలు తెలియజేసిన కమిటీ సభ్యులు. ఈ సందర్భంగా ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో గద్వాల జిల్లా కేంద్రంలో తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ బాలుర పాఠశాల మరియు మైనారిటీ బాలికల డిగ్రీ కళాశాలను మంజూరు చేయాలని కలెక్టర్ గారికి వినతి పత్రం. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ విద్యార్థుల సాధికారత కోసం ప్రవేశపెట్టిన తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ (TMREIS) ఎంతోమంది పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తుంది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా వందలాది పాఠశాలలు, జూనియర్ కళాశాలలు విజయవంతంగా నడుస్తున్నాయి. అయితే జోగులాంబ గద్వాల జిల్లాలో బాలుర పాఠశాల మంజూరు చేయాలని 2018 సంవత్సరం నుంచి ప్రభుత్వానికి తెలియజేస్తూనే ఉన్నాము. కానీ ఇంత వరకు ప్రభుత్వం స్పందించలేదు. బాలుర కోసం రెసిడెన్షియల్ పాఠశాల లేకపోవడం వల్ల ఎంతో మంది విద్యార్థులు నాణ్యమైన విద్యకు దూరమవుతున్నారు. అదేవిధంగా ఇంటర్మీడియట్ పూర్తి చేసిన తర్వాత మైనార్టీ విద్యార్థులు ముఖ్యంగా బాలికలు ఉన్నత విద్యకు దూరమయ్యే పరిస్థితి కనిపిస్తుంది. దీనికి ప్రధాన కారణం ప్రత్యేక బాలికల డిగ్రీ కళాశాల లేకపోవడమే. ఇంటర్మీడియట్ పూర్తయిన తర్వాత ప్రైవేట్ కళాశాలలో ఫీజులు చెల్లించలేక లేదా సుదూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోలేక చదువులు మధ్యలోనే ఆపివేస్తున్నారు. పాఠశాల స్థాయి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యను ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యకు కొనసాగింపుగా డిగ్రీ కళాశాల ఉంటే విద్యార్థుల విద్యా ప్రస్థానం మధ్యలో ఆగదు. "నేటి విద్యార్థులే రేపటి పౌరులు" అనే నానుడిని నిజం చేయాలంటే మైనార్టీ విద్యార్థులకు, విద్యార్థినీలకు ఉన్నత విద్య అందని ద్రాక్షగా మారకూడదు. ప్రభుత్వం వెంటనే స్పందించి తల్లిదండ్రుల కోరిక మేరకు (2026 – 27) విద్యా సంవత్సరంలోనే మైనారిటీ బాలుర పాఠశాల మరియు ప్రత్యేక బాలికల డిగ్రీ కళాశాల లేని లోటును తీర్చడం, పేద మైనార్టీ విద్యార్థులకు ఉచిత వసతితో కూడిన నాణ్యమైన విద్యను అందించడం. ముఖ్యంగా గద్వాల జిల్లాలో మైనార్టీ జూనియర్ కళాశాల విద్యార్థినీలు రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధిస్తున్నారు. ఇంతటి ప్రతిభ ఉన్న విద్యార్థులు డిగ్రీ కోసం బయటకు వెళ్లాల్సి రావడం పెద్ద లోపం. "ప్రతిభ ఉన్నచోట సౌకర్యాలు లేవు" అన్నమాట మన జోగులాంబ గద్వాల జిల్లాకు రాకూడదు ప్రత్యేకంగా. ఈ సమస్యను పరిష్కరించి ప్రస్తుత విద్యా సంవత్సరం ( 2026–27 ) తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ బాలుర పాఠశాల మరియు డిగ్రీ కళాశాలను మంజూరు చేయాలని కోరుతూ గౌరవ జిల్లా కలెక్టర్ గారికి ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర సభ్యులు ముహమ్మద్ రహమతుల్లా వినతిపత్రం సమర్పించడం జరిగింది. గద్వాల జిల్లాలో మైనార్టీ జనాభా మరియు విద్యార్థుల అవసరాలను గుర్తించి గౌరవ కలెక్టర్ గారు సానుకూలంగా స్పందించారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి అందరి మద్దతు అవసరం. మన జిల్లా విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని ఆశిస్తున్నాం. ఇందుకోసం జిల్లా యంత్రాంగం తరఫున అధికారులు మరియు పాలకులు రాష్ట్ర ప్రభుత్వానికి మరియు మైనార్టీ సంక్షేమ శాఖకు తగిన ప్రతిపాదనలు పంపాలని ప్రార్థిస్తున్నాము. మా విన్నపాన్ని సానుకూలంగా పరిశీలిస్తారని ఆశిస్తున్నాము. ఈ కార్యక్రమంలో ఆవాజ్ మైనారిటీ సభ్యులు ఎండి చాంద్ పాషా, జావీద్, ఏజాస్, మహబూబ్, షరీఫ్, జునైద్, సాజిద్, పాల్గొన్నారు.



## ఆధ్యాత్మిక ఆనందాన్ని పొంది అమ్మవారి కృపకు పాత్రులయ్యారు

### చిన్న ఘనపూర్‌లో పంచాంగ శ్రవణం

**మెదక్ / కొల్చారం , మార్చి 19 (వుదయం):** మెదక్ జిల్లాలో కొల్చారం మండలం చిన్న ఘనపూర్ గ్రామంలో గురువారం పంచాంగ శ్రవణ కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమం గ్రామ ప్రజలకు ఒక ముఖ్యమైన ఆధ్యాత్మిక వేడుకగా నిలిచింది. గ్రామ సర్పంచ్ సందపురం మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద పండితులు సాంబ శివ శర్మ పంచాంగ శ్రవణాన్ని నిర్వహించిన పంచాంగ శ్రవణంలో హైదరాబాద్‌లోని ప్రముఖ యాడ్ ఏజెన్సీ శ్రీచరణ కమ్యూనికేషన్స్ అధినేత బుస్సా శ్రీనివాస్ గుప్తా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కొత్త పంచాంగం లోని శుభముహూర్తాలు, పండుగలు మరియు రాబోయే సంవత్సరానికి సంబంధించిన ఫలితాలను వివరించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొని విజయవంతం చేశారు.

## పారదర్శకంగా గ్యాస్ సిలిండర్ల సరఫరా

### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**గద్వాల మార్చి 19 (వుదయం ప్రతినిధి)** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ఎల్పిజి గ్యాస్ సిలిండర్ల పంపిణీ వ్యవస్థను మరింత పారదర్శకంగా మార్చడానికి, వినియోగదారుల భద్రతను పటిష్టం చేయడానికి ప్రభుత్వం, గ్యాస్ కంపెనీలు కొన్ని కీలక మార్పులు, నిబంధనలను అమలు చేస్తున్నాయని, వినియోగదారులు వీటిని గమనించి సహకరించవలసిందిగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జోగులాంబ గద్వాల జిల్లాలో గ్యాస్ సిలిండర్ల నిల్వలు వినియోగదారులకు సరిపోయేటన్ని ఉన్నాయని, ఎవరు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఒకసారి గ్యాస్ రీఫిల్ బుకింగ్ చేసుకున్న తర్వాత, తదుపరి సిలిండర్ కోసం బుక్ చేయడానికి కనీసం 45 రోజుల గడువు పాటించాలన్నారు. ఈ కాల పరిమితిలోపు బుకింగ్ చేయడానికి అనుమతి ఉండదన్నారు. 45 రోజుల వరకు ఒక్క సిలిండర్ ను పొదుపుగా వాడుకోవాలని సూచించారు. వినియోగదారులు తమ గ్యాస్ కనెక్షన్‌తో అనుసంధానమైన మొబైల్ నంబర్ నుంచి మాత్రమే బుకింగ్ చేయాలని పేర్కొన్నారు. ఇతర నంబర్ల నుంచి చేసే బుకింగ్‌లు పరిగణనలోకి తీసుకోబడవని, ఒకవేళ ఫోన్ నంబర్ మారినట్లయితే, వెంటనే మీ గ్యాస్ ఏజెన్సీని సంప్రదించి అప్డేట్ చేసుకోవాలని తెలిపారు. ఆయా కంపెనీల వారీగా గ్యాస్ సిలిండర్ లను బుకింగ్ చేసుకోవడానికి ఇండియన్ 7718955555, హెచ్.పీ గ్యాస్ : 9222201122, భారత్ గ్యాస్ : 7715012345 ఫోన్ నంబర్లకు కాల్ చేసి బుక్ చేసుకోవచ్చన్నారు.

సిలిండర్ డెలివరీ సమయంలో మీ రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌కు వచ్చే ఓటిపి నంబర్ ను డెలివరీ సిబ్బందికి తెలియజేసిన తర్వాతే సిలిండర్ ఇస్తారన్నారు. వినియోగదారులు రశీదుపై ఉన్న ధరను మాత్రమే డెలివరీ సిబ్బందికి చెల్లించాలన్నారు. అదనపు రుసుములు అడిగితే ఎన్ఫోర్స్ మెంట్ డిప్యూటీ తహసిల్దార్ 90103 10309 నంబర్ కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. గ్యాస్ లీకేజీ లేదా ఇతర ప్రమాద సమయాల్లో వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1906 కు సమాచారం అందించాలన్నారు. వినియోగదారులు ఈ నియమాలను పాటిస్తూ, సురక్షితమైన మరియు సులభతరమైన సేవలను పొందవలసిందిగా ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.



## దేవాలయం నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి

**గద్వాల మార్చి 19 (వుదయం ప్రతినిధి)** గద్వాల నియోజకవర్గంలో ధరూర్ మండల పరిధిలో ర్యాలంపాడు ఆర్ అండ్ ఆర్ సెంటర్ నందు శ్రీ పరాభావ నామ సంవత్సరం ఉగాది పండుగ సందర్భంగా శ్రీ ఆంజనేయస్వామి సీతారాముల సమేత, శ్రీ వెంకటేశ్వర స్వామి, శివాలయం దేవాలయ నిర్మాణానికి ఎమ్మెల్యే శ్రీ బండ్ల కృష్ణమోహన్ రెడ్డిగారు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు దేవాలయ నిర్మాణానికి ఎమ్మెల్యే గారు భూమి పూజ చేసి కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించడం జరిగింది ఎమ్మెల్యే గారికి గ్రామ సర్పంచ్ గ్రామస్తులు శాలువా కప్పి పుష్పగుచ్చం ఇచ్చి ఘనంగా స్వాగతం పలికారు ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో గుడి, బడి కచ్చితంగా ఉండాలి ర్యాలంపాడు నూతన ఆర్ఎంఆర్ సెంటర్ లో నూతనంగా నిర్మాణమైన గ్రామానందు దేవాలయం ఉండడంవల్ల గ్రామంలోని నివసించే ప్రజలకు ఎలాంటి ఆకంటాలు లేకుండా ఆ ఆ దేవుని రక్షణలో ఆశీస్సులు ఉండడం వల్ల గ్రామంలో ఎలాంటి సమస్యలు లేకుండా ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించడానికి సాధ్యమవుతుందని అని తెలపారు.

ప్రతి ఒక్కరూ గ్రామంలో కలిసి మెలిసి కలిసికట్టుగా దేవాలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలి అదేవిధంగా గ్రామ అభివృద్ధిలో కూడా ప్రతి ఒక్కరు కలిసిమెలిసి గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరారు ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ మాజీ చైర్మన్ బంబు రామన్ గౌడు, మున్సిపల్ చైర్ పర్సన్ తుమ్మల జయలక్ష్మి నరసింహులు యాదవ్, సర్పంచ్ వెంకట్రాంరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, కౌన్సిలర్ సత్యం, నాయకులు జనార్ధన్ రెడ్డి, శ్రీరాములు, నాగన్న, జిల్లా యువ నాయకుడు చిట్టెం పురుషోత్తం రెడ్డి, నాయకులు కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## ఉగాది పండుగ సందర్భంగా రామ్ మందిరంలో భక్తి సందడి

### జగ్గారెడ్డి ప్రత్యేక భజనలు



**సంగారెడ్డి వుదయం** ఉగాది పండుగ సందర్భంగా రామ్ మందిరంలో భక్తి పరవశం నెలకొంది. ఈ శుభదినాన్ని పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు, భజనలు ఘనంగా నిర్వహించారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఈ కార్యక్రమానికి హాజరై భక్తులతో కలిసి భజనలు చేస్తూ ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత ఉజ్వలంగా మార్చారు. ఉదయం నుంచే ఆలయంలో భక్తుల రద్దీ పెరిగింది. కొత్త సంవత్సర ఆరంభం కావడంతో భక్తులు కుటుంబ సమేతంగా ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి దేవుడికి ప్రత్యేక అర్చనలు నిర్వహించి రాష్ట్ర ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఉగాది పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖశాంతులు, ఐశ్వర్యాలు తీసుకురావాలని ఆకాంక్షించారు. సమాజంలో ఐక్యత, సోదరభావం పెంపొందాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. రామ్ మందిరం భక్తి గానాలతో మార్మోగుతూ పండుగ సందడిని తలపించింది.

# మతసామరస్యానికి ప్రతీకగా ఇఫ్తార్ విందు

## ★ఆర్మూర్ మహాలక్ష్మి కాలనీలో



ఆర్మూర్ ప్రతినిధి, మార్చ్ 19, (వుదయం ప్రతినిధి)
ఆర్మూర్ పట్టణంలోని మహాలక్ష్మి కాలనీలో ఉన్న శ్రీ సాయి గ్లోబల్ ఐ కేర్ హాస్పిటల్‌లో డాక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యం లో ఈరోజు మతసామరస్యానికి ప్రతీక గా ఇఫ్తార్ విందు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కాలనీలోని ప్రతి షాప్, హాస్పిటల్‌లలో పనిచేస్తున్న ముస్లిం సోద రులను ప్రత్యేకంగా ఆహ్వానించి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి హాజరైన ముస్లిం సోదరులు డాక్టర్ శ్రీనివాస్ సేవాభావాన్ని, సౌ హార్దతను ప్రశంసించారు. గత 810 సంవత్సరాలుగా హిందూముస్లిం ఐక్యతకు ప్రతీకగా ప్రతి చిన్న కార్య క్రమానికీ హాజరవుతూ సోదర భావాన్ని పెంపొందిస్తున్నారని తెలిపారు.ఇఫ్తార్ విందు ద్వారా ముస్లిం సోదరులతో మరింత సన్నిహిత సంబంధాలు ఏర్పడ టంతో పాటు డాక్టర్ శ్రీనివాస్ కి ప్రత్యేక గుర్తింపు లభించింది.ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్ మిత్రబృందం కూడా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఉగాది పండుగను స్వగ్రామంలో జరుపుకున్న ఎమ్మెల్యే



ఖానాపూర్, మార్చ్ 19(వుదయం విలేకరి)

ఖానాపూర్ నియోజకవర్గం, ఉట్నూర్ మండలంలోని కల్లూరి గూడ గ్రామంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఉగాది పండుగను తన స్వగ్రామంలో ఆదివాసీ సంస్కృతి సంప్రదాయా లకు అనుగుణంగా ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో కలిసి సంప్రదాయ పూజలు నిర్వహించరు. అలాగే ఆదివాసీ సంస్కృతిని ప్రతిబింబించే విధంగా గ్రామస్థుల తో కలిసి నేలపై కూర్చొని భోజనం చేసి, ఐక్యత మరియు సామూ హికతను చాటిచెప్పారు.ఈ వేడుకల్లో యువత, పెద్దలు పాల్గొని ఉగాది పండుగను ఆనందంగా జరుపుకున్నారు.మన సంప్రదా యాలను, సంస్కృతిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపల్లి నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలి

## నియోజకవర్గ ప్రజలందరికి ఉగాది శుభాకాంక్షలు...

## గౌరవ పెద్దపల్లి శాసనసభ్యులు శ్రీ. చింతకుంట విజయరమణ రావు గారు....



పెద్దపల్లి మార్చి 19 (వుదయం ప్రతినిధి)
శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని పెద్దపల్లి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాల యంలో నిర్వహించిన పంచాంగ శ్రావణ పఠాన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొ న్న గౌరవ పెద్దపల్లి శాసనసభ్యులు శ్రీ. చింతకుంట విజయరమణా రావు గారు... తదుపరి ఎమ్మెల్యే విజయరమణా రావు గారు పోలీస్ అధికారులకు, కౌన్సిలర్లకి ,సర్పంచ్ లకు కాంగ్రెస్ పార్టీ నాయకుల కు,కార్యకర్తలకు ఉగాది పచ్చడిని వితరణ చేశారు... ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజ యరమణా రావు గారు మాట్లాడుతూ... పెద్దపల్లి నియోజకవర్గ ప్రజలందరికీ పరాభవ నామ సంవత్సర ఉగాది శుభా కాంక్షలు తెలియజేస్తూ ఈ నూతన సంవ త్సరంలో పెద్దపల్లి పట్టణ ప్రజలందరూ సుఖ సంతోషాలతో,ఆయురారోగ్యాలతో ఉండాలని రైతులు సైతం పాడిపంటల తో సుభిక్షంగా ఉండాలని అన్నారు... ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య, కౌన్సిలర్లు,ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ ప్రవీణ్ కుమార్,సర్పంచులు,అర్చ కులు కొండపాక శ్రీనివాస చార్యులు,శివ మరియు కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధు లు,నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయంలో ఘనంగా ఉగాది వేడుకలు



కరీంనగర్, మార్చి 19, వుదయం ప్రతినిధి
కరీంనగర్ నగరపాలక సంస్థ ఎనిమిదో డివిజన్ అలుగునూరు పరిధిలోని శ్రీ వెం కటేశ్వర కాలనీలో గల శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయంలో ఉగాది పర్వదిన మహోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి.వేద పండితులు, ఆలయ అర్చకులు తిరునగి రి వెంకటాద్రి స్వామి, తిరునగిరి హర్ష వర్ధన్ ల ఆధ్వర్యంలో దేవాలయంలో శ్రీ పట్టాభి రామచంద్రస్వామి, పంచముఖ ఆంజనేయస్వామి దేవతలకు ప్రత్యేక పూజలు చేపట్టి, పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈ సందర్భంగా పండితులు తిరుమలగిరి వెంకటాద్రి స్వామి పంచాంగ శ్రవణం వినిపించి, ఉగాది, పరాభ నామ సంవత్సర విశిష్టత గురించి ఆధ్యాత్మిక సందేశాన్ని తెలియ జేశారు. 'పరాభవ' నామ సంవత్సరం వైఫల్యం నుంచి వైభవం వైపు ప్రయాణం చేసేలా కొనసాగుతుందన్నారు."తెలుగు వారి పండుగలలో ఉగాదికి ఒక ప్రత్యేక స్థానం ఉందనీ, ఇది కేవలం క్యాలెండర్ మారే రోజు మాత్రమే కాదు, మన ఆలోచ నలను, ఆశయాలను కొత్తగా నిర్దేశించు కునే సమయం అన్నారు."అయితే, 2026 మార్చి 19న ప్రారంభం కాబోయే కొత్త ఏడాదికి 'పరాభవ' అనే పేరు ఉండటం చాలా మందిలో ఆసక్తిని, మరికొందరిలో ఆందోళనను కలిగిస్తోందన్నారు. "సాధా రణంగా 'పరాభవం' అంటే అవమానం లేదా ఓటమి అని మనం భావిస్తాం "కానీ, ఈ పేరు వెనుక ఉన్న లోతైన ఆధ్యాత్మిక అర్థం తెలిస్తే, మనం ఈ ఏడాదిని ఎంత ఉత్సాహంగా ఆహ్వానించాలో అర్థమ వుతుందన్నారు.'పరాభవ' అనే పదాన్ని విడదీసి చూస్తే,పరా: అంటే అత్యున్నత మైన, గొప్పదైన లేదా అతీతమైన అని అర్థం అన్నారు.భవ: అంటే పుట్టుక, లేదా స్థితి అని అర్థం అన్నారు.అంటే, మనలోని అజ్ఞానాన్ని, అహంకారాన్ని, బలహీనతల ను ఓడించి (పరాభవం) ఒక ఉన్నతమైన స్థితిలో కొత్తగా జన్మించడమే ఈ ఏడాది యొక్క అసలు సందేశం అని తెలియజేశా రు.నేనుఅనే అహంకారాన్ని తగ్గించుకుని, వినయంతో కూడిన జ్ఞానాన్ని సంపాదిం చాలన్నారు.మార్పు ఎప్పుడూ చేదుగానే ఉంటుందని,ఉగాది పచ్చడిలో వేపపువ్వు చేదును కూడా మనం ఎందుకు ఇష్టంగా స్వీకరిస్తాం.. ఎందుకంటే, ఆ చేదు మన శరీరానికి ఆరోగ్యాన్ని ఇస్తుంది.. అలాగే, జీవితంలో వచ్చే కొన్ని కఠినమైన మార్పులు ప్రారంభంలో ఇబ్బందిగా అనిపించినా, అవి మనల్ని మరింత దృఢంగా మారుస్తాయి. 'విశ్వావసు' సం వత్సరంలో మనం నేర్చుకున్న పాఠాలను పునాదిగా చేసుకుని, ఈ 'పరాభవ' సంవ త్సరంలో మనల్ని మనం ఒక కొత్త వ్యక్తిగా మలుచుకోవాలన్నారు."2026 ఉగాది మనకు ఒక కొత్త ఆరంభం.2026 ఉగాది మనకు ఇచ్చే గొప్ప అవకాశం ఏమిటంటే మనల్ని మనం పునర్ నిర్మించుకోవడం. ఓటమిని చూసి కుంగిపోకుండా, దాన్ని గెలుపుకు మెట్టుగా మార్చుకోవడమే ఈ పరాభవ నామ సంవత్సర విశిష్టత. అని పండితులు వెంకటాద్రి స్వామి ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్ర మంలో పంచముఖ ఆంజనేయస్వామి ధర్మకర్తల సేవా సమితి అధ్యక్షులు చిందం నరసయ్య, కమిటీ బాధ్యులు గడప శేఖర్, సల్ల రాజయ్య, సిరిపురం శ్రీనివాస్, ఐతం వెంకన్న,బూట్ల కరుణాకర్, రాజేందర్ , సుధాకర్ రెడ్డి, రాజిరెడ్డి , బైరి లక్ష్మయ్య , యమా సాగర్, కొత్తూరి శ్రీనివాస్, చిందం అంజి , మృత్యుంజయం, రేవంత్ తదితరులు పాల్గొన్నారు.

# సేవ్ బర్డ్స్ రైతు నిష్ఠానికి ముప్పు

కరీంనగర్, మార్చి 19 (వుదయం ప్రతినిధి)
ఒకప్పుడు విరివిగా కనిపించే పిచ్చుకలు నేడు అరుదుగా కనిపిస్తున్నాయి.. పట్ట ణీకరణ ఎంత వేగంగా జరుగుతుందో అంతే వేగంగా పిచ్చుకల సంఖ్య తగ్గిపో వడం బర్డ్ లవర్స్ ని కలచివేస్తుంది.. జీవ వైద్యంలో పిచ్చుకదే ప్రముఖ పాత్ర..వాతా వరణ మార్పులు పిచ్చుకలపై బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగిస్తున్నాయి. తెలతెలవారుతుండ గా ఒకప్పుడు పక్షుల కిలకిలరావాలు పల్లెసీమలను అలరించేవి. పొలాల్లో పు రుగుపుట్రా తింటూ రైతుకు ఎంతో మేలు చేసేవి. శరవేగంగా మారుతున్న పట్టణీక రణ, సెల్‌టవర్ల తరంగాలు, పొలాల్లో విష పూరిత పురుగుమందుల వాడకం పక్షుల మనుగడకు ప్రతికూలంగా పరిణమిం చింది. పిచ్చుకలైతే దాదాపు అంతరించి పోతున్నాయి. ఈ తరుణంలో పిచ్చుకల సంరక్షణ కోసం నడుంకట్టాడు.కరీంన గర్ కిసాన్ నగర్ కు చెందిన అనంతుల రమేష్ . తన ఇంటి ఆవరణాన్ని పిచ్చుక లకు ఆవాసంగా మార్చారు.. పిచ్చుకల కోసం ఇంటి ఆవరణంలో కృత్రిమ గుళ్ళు, తినడానికి గింజలు, ఇంటి చుట్టు మట్టి చిప్పల్లో నీళ్లు ఇంటి చుట్టూ పచ్చని చెట్లు ఉండడంతో . వందలాది పిచ్చుకలు వచ్చి అక్కడ ఏర్పాటు చేసిన గూళ్ళ ఏర్పాటు చేసుకుని, గుడ్లు పెట్టి.. సంతానోత్పత్తి చే స్తున్నాయి. ఉదయం గుంపులుగా వచ్చే పక్షులు కిల కిల రావాలతో ఇంటిల్లి పాది నిద్ర లేస్తారు అక్కడికి వచ్చే పక్షులను చూడడానికి స్కూలుకు వెళ్లి చిన్న పిల్లలు చుట్టుపక్కల వారు వచ్చి పక్షుల కిలకిల రావాలని చూస్తూ ఆనందిస్తారు.."సొంత పిల్లల్లా చూసుకుంటాం"అనంతుల రమే ష్"ఉదయం పిచ్చుకల కిలకిల రావాల తోనే నిద్రలేస్తాం.. మా ఇంటికి విచ్చేసిన పిచ్చుకలు ఉదయం నుండి సాయంత్రం వరకు మా ఇంటి చుట్టూ ఉన్న పచ్చని చెట్ల పైన సందడి చేస్తాయి.. వాటికి అనువుగా ఉండేందుకు కృత్రిమ గుళ్లను , ప్రత్యేకమైన బర్డ్ ఫీడర్స్ ను ఏర్పాటు చేశాం..దీంతో మా పిల్లలు కూడా ఎంతో ఇష్టంగా వీటికి తిండి గింజలు మంచినీటి ని ఏర్పాటు చేస్తారు.
ప్రతిరోజు వచ్చి కిచకిచమంటూ సందడి పిచ్చుకలతో మా ఇంటి చుట్టుపక్కల వారు ఎక్కువ సమయం మా ఇంట్లోనే గడుపుతారు..

# ఎమ్మెల్యే శ్యామెల్ పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

## జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు రామగిరి బానేష్



లక్షెట్టిపేట, మార్చి19 (వుదయం ప్రతినిధి):
తుంగతుర్తి దళిత ఎమ్మెల్యే మందుల శ్యామెల్ పైన బీజేపీ చేసిన దాడిని తీవ్రంగా ఖండి స్తున్నట్లు గురువారం మంచి ర్యాల జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షు లు రామగిరి బానేష్ తెలిపారు. ఇటీవల ఎమ్మెల్యే సామెల్ మీద బీజేపీ నాయకులు కోడిగుడ్లతో దాడి చేసి అమానవీయంగా ప్రవర్తించారన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని లేనిపక్షంలో బండి సంజయ్ ను మంత్రి పదవీ నుంచి బీజేపీ అధిష్టానం తొలం గించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా దళిత ఎమ్మెల్యేల జోలికి వస్తే ఊరుకోమని హెచ్చరిం చారు. బీజేపీ నాయకులు ఖబర్దార్, కాంగ్రెస్ ఎదురు దాడి చేస్తే తట్టుకో లేరని హితవు పలికారు. సంబంధిత బీజేపీ నాయకులు వెంటనే దళిత ఎమ్మెల్యే సామెల్ ను క్షమాపణలు కోరని పక్షంలో రాష్ట్ర నాయకత్వం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమా లు చేపడుతామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షే మాన్ని ఓర్వలేకనే ఇలాంటి దాడులు చేయడం బీజేపీ పార్టీ ఎజెండాగా మారిందని, దళితుల జోలికి వస్తే సహించేది లేదని హెచ్చరించారు.

# రంజాన్ మాసం క్రమ-శిక్షణకు ప్రతీక

## జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర

## సోదరభావంతో ఐక్యమత్యంగా ఉండాలి ఎస్పీ పిలుపు



కామారెడ్డి, మార్చి 19 (వుదయం ప్రతినిధి)
కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ముస్లిం సోదరులు, పోలీస్ సిబ్బందికి ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, రంజాన్ మాసం క్రమశిక్షణ, దాతృత్వానికి ప్రతీక అని తెలిపారు. ప్రతి ఒక్కరూ సోద రభావంతో ఐక్యమత్యంగా ఉండి, శాంతి సామరస్యాలతో జీవించాలని సూచించారు. పోలీసు వ్యవస్థలో మత సామరస్యాన్ని పెంపొందించే దిశగా పండుగలను నిర్వహించడం జరుగు తుందని ఆయన పేర్కొన్నారు. ప్రార్థ నల అనంతరం ఉపవాస దీక్షలను విరమించారు.కామారెడ్డి జిల్లా మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంద ని ఎస్పీ తెలిపారు. ప్రజలకు, పోలీస్ సిబ్బందికి ముందుగానే రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజే శారు.ఈ కార్యక్రమంలో ఏఎస్పీ బి. చైతన్యరెడ్డి, పట్టణ ఎస్హెచ్ఓ నరహరి, ఎస్ఐలు, ముస్లిం సోదరులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. కామారెడ్డి ముస్లిం సోదరుల కోసం పోలీస్ స్టేష న్‌లో ఏర్పాటు చేసిన ఈ ఇఫ్తార్ విందు సోదరభావాన్ని ప్రతిబింబించింది.

# రానున్న లోక్ సభ ఎన్నికలలో సింగిల్ డిజిట్ స్థానాలకే కాంగ్రెస్



జన్నారం,మార్చి 19 (వుదయం ప్రతినిధి)
బీసీ రిజర్వేషన్ ల ప్రస్తావన రాహుల్ గాంధీ మానుకుంటే రానున్న లోక్ సభ ఎన్నికలలో సింగిల్ డిజిట్ స్థానాలకే కాంగ్రెస్ పార్టీ దేశంలో మొత్తానికే కాంగ్రెస్ పార్టీ పరిమితం అవుతుందని బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం తెలంగాణ రాష్ట్ర మహిళా విభాగం సీనియర్ నాయ కురాలు కుమ్మరి కోడూరి లీలావతి ప్రజాపతి అన్నారు.ఆమె మాట్లాడు తు... మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళల సబ్ కోటాకు కాంగ్రెస్ జాతీయ నాయకత్వం విస్మరిస్తుం దని,2027 లో అమలు చేయనున్న మహిళా రిజర్వేషన్ బిల్లును అందులో బీసీ మహిళలకు సబ్ కొటాగా అర్ధ శాతం అనగా 33% బీసీ మహిళ రిజర్వేషన్ బిల్లులో 16 1/2 % బీసీ మహిళలకు రిజర్వేషన్ సబ్ కోటాగా కేటాయించవలసిన అవసరం ఉన్నదన్నారు.2029లో ఎన్నికలలో బలమైన మెజారిటీ సాధించాలంటే స్వతంత్ర భారత దేశంలో గల 145 కోట్ల జనాభాలో బీసీ హక్కుల గురించి చట్టసభల్లో రిజర్వేషన్ల గురించి విద్య ఉద్యోగాలు ప్రమోషన్లలో రిజర్వేషన్ల గురించి పోరాడితేనే కాంగ్రెస్ పార్టీకి మనుగడ ఉంటుంది. లేకుంటే సింగిల్ డిజిట్ స్థానాలు గెలిచే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో అసెంబ్లీ సమావేశాలు,అ లాగే ఢిల్లీలో పార్లమెంటు సమావే శాలు జరుగుతున్నాయి.ఈ రెండు చోట్ల కాంగ్రెస్ పార్టీ క్రియాశీల పాత్ర తీసుకొని బీసీ రిజర్వేషన్ల సాధనకు కృషి చేయవలసిందిగా కోరారు.ఈ కార్యక్రమంలో బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం ఉమ్మడి ఆదిలాబా ద్ జిల్లా మహిళ విభాగం కన్వీనర్ మూల రేణుక భాస్కర్ గౌడ్, మండల మహిళా విభాగం బీసీ సంఘం అధ్య క్షురాలు ఫోతు విజయ శంకర్, తది తరులు పాల్గొన్నారు.

# రామ మందిరంలో ఉగాది పచ్చడి పంపిణీ చేసిన బి ఆర్ ఎస్ వి జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్



ఉట్నూర్, మార్చి 19 (వుదయం ప్రతినిధి)
పరాభవ నామ స్మరణతో షడ్రుచుల సమ్మేళనంతో శ్రీ పరాభవ నామ సంవ త్సరాన్ని పురస్కరించుకుని ఉట్నూర్ రామ మందిరంలో ఉగాది పచ్చడిని బి ఆర్ ఎస్ వి జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్ పంపిణీ చేశారు.ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ.. తెలుగు లోగిళ్లలో నూతన సంవత్సర శోభను తెస్తూ, కొత్త లక్ష్యాలకు, కొత్త ఆలోచ నలకు, ప్రతి ఒక్కరి ఉజ్వల భవిష్యత్తు కు, తద్వారా సమగ్రాభివృద్ధికి దోహ దపడాలన్నారు.సమృద్ధిగా వర్షాలు కు రువాలని, పంటలు బాగా పండాలని, రైతులు బాగుండాలని, సకల వృత్తుల వారు ఆనందంగా ఉండాలన్నారు. భక్తిశ్రద్ధలతో ఈ ఉగాది పండుగను బంధుమిత్రులకు, సోదర సోదరీమ ణులతో ఈ కొత్త సంవత్సర ఉగాది పండుగను ఆనందంగా జరుపుకోవా లని తెలంగాణ రాష్ట్ర ప్రజలు ఆయురా రోగ్యాలతో, సౌభాగ్య సంతోషాలతో కలిగి బాగుండాలని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ మళ్ళీ ముఖ్య మంత్రి కావాలని కోరుకుంటూ రాష్ట్ర న్ని మళ్ళీ ముందుకు తీసుకుపోవలని కోరుకుంటూ రాష్ట్ర ప్రజలందరికి శ్రీ పరాభవ నామ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు సంతోష్ దుబే తదితరులు పాల్గొన్నారు.

# పీసిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి పంపిణీ




జన్నారం, మార్చి 19 (వుదయం ప్రతినిధి)
పూర్ణచందర్ రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉగాది పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం జన్నారం మాసం రాజన్న పూజలు నిర్వహించారు.అనంతరం పచ్చడితోపాటు బూరెలను అందజేశారు.ఈ కార్యక్రమం లో పి సి ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ముడుగు ప్రవీణ్ కుమార్, పొనకల్ ఉపసర్పంచ్ అప్పాల జలపతి, పొనకల్ మాజీ ఎంపిటిసి రాగుల శంకర్, బిజెపి మండల మాజీ అధ్యక్షులు గోలిచందు, బిఆర్ఎస్ మండల ప్రధాన కార్య దర్శి సులువ జనార్దన్ , మాజీ కో ఆప్షన్ సభ్యులు మున్వర్ అలీ ఖాన్, కాంగ్రెస్ జిల్లా నాయకులు ముత్యం రాజన్న, ఫౌండేషన్ సభ్యులు బీన వేణి గంగన్న యాదవ్, చింతల సతీష్, తిరుపతి, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ గ్రామాన ముదిరాజ్ జెండా ఉగాది వేళ ఐక్యత గర్జన

## నాగిరెడ్డిపేట్లో ఘన ఆవిష్కరణ సంప్రదాయాల నడుమ ఉగాది సంబరాల



నాగిరెడ్డిపేట్,మార్చి 19 (వుదయం ప్రతినిధి)
గాది పర్వదినాన్ని పురస్కరించుకుని ముదిరాజ్ జాతి ఐక్యతకు ప్రతీకగా ప్రతీ సంవత్సరంలాగే ఈసంవత్సరం కూడా గ్రామ గ్రామాన జెండా ఎగురవేయాల న్న టిఎంఎంఎస్ తెలంగాణ ముదిరాజ్ మహాసభ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు బట్టు విఠల్ ముదిరాజ్ పిలుపు ఎల్లారెడ్డి లో కార్యరూపం దాల్చింది. నాగిరెడ్డిపేట్ మండలంలోని తాండూర్,జానకంపల్లి, ఆత్మకూర్,జలాల్పూర్, మాల్తుమ్మెద, బొల్లారం, మాసానిపల్లి, మాటూర్,త దితర గ్రామంలో ముదిరాజ్ సంఘం నాయకులు, సభ్యులు కలిసి ఘనంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వ హించారు.ఈ సందర్భంగా కుంకుమ, పసుపుతో ప్రత్యేక పూజలు నిర్వహించి ,కొబ్బరికాయలు కొట్టి జెండా ఆవిష్కర ణను శుభప్రదంగా ప్రారంభించారు. ''శ్రీ పరాభవ నామ సంవత్సరం''ఆరం భాన్ని పురస్కరించుకుని కులదేవత పెద్దమ్మ తల్లిని స్మరించుకుంటూ సంప్ర దాయ పద్ధతుల్లో వేడుకలు నిర్వహించ డం విశేషంగా నిలిచింది.అనంతరం ప్రతి సంవత్సరం లాగే ఈఏడాది కూడా ఆరు రుచులతో తయారు చేసిన ఉగాది పచ్చడి,జెండా ఆవిష్కరణ కార్యక్రమాని కి హాజరైన ప్రతి ఒక్కరికీ పంచిపెట్టారు. ఉగాది పచ్చడిలోని రుచుల మాదిరి గానే జీవితం సుఖదుఃఖాల సమ్మేళన మని,వాటిని సమానంగా స్వీకరించే సంస్కృతి మనదని నాయకులు వివరిం చారు.ఈ కార్యక్రమం ద్వారా సామాజిక బంధాలు మరింత బలపడాలని ఆకాం క్షించారు.ఈ సందర్భంగా మాట్లాడిన సంఘ నాయకులు... ముదిరాజ్ జాతి చారిత్రక సంప్రదాయాలను కాపాడుతూ కొత్త తరానికి అవగాహన కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.తెలంగాణ మూలవాసి జాతిగా ముదిరాజ్ సమాజం తన ప్ర త్యేకతను నిలబెట్టుకొని,గ్రామ గ్రామాన ముదిరాజ్ జెండా ఎగురవేసి జాతి గౌర వాన్ని పెంపొందించడమే కాకుండా... గ్రామ గ్రామాన నిర్వహించిన జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తం గా ముదిరాజ్ జాతి ఐక్యతకు నాంది పలికిందని నాయకులు అన్నారు.

# జిల్లా ఎస్పీ, ఏఎస్పీలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపిన మున్సిపల్ చైర్ పర్సన్



కామారెడ్డి, మార్చి 19 (వుదయం ప్రతినిధి):
కామారెడ్డి జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర, ఏఎస్పి చైతన్య రెడ్డిని కామారెడ్డి ము న్సిపల్ చైర్ పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, వైస్ చైర్మన్ కాసర్ల గోదావరి స్వామిలు గురువారం ఉగాది పర్వది నం పురస్కరించుకొని వారిని మర్యాద పూర్వకంగా కలిసి ఉగాది శుభాకాంక్ష లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ, ఏ ఎస్పి లకు మెమెంటో తో సత్కరించి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రస్తుత సమాజంలో పోలీస్ ల సేవలు వేల కట్టలేనివన్నా రు. ఉగాది పండుగను ప్రశాంతంగా జరిగేలా శాంతి భద్రతలు చేపట్టాలని వారు కోరారు.


# జిల్లా ఎస్పీ, ఏఎస్పీలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపిన మున్సిపల్ చైర్ పర్సన్





కామారెడ్డి, మార్చి 19 (వుదయం ప్రతినిధి)
కామారెడ్డి జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర, ఏఎస్పి చైతన్య రెడ్డిని కామారెడ్డి ము న్సిపల్ చైర్ పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, వైస్ చైర్మన్ కాసర్ల గోదావరి స్వామిలు గురువారం ఉగాది పర్వది నం పురస్కరించుకొని వారిని మర్యాద పూర్వకంగా కలిసి ఉగాది శుభాకాంక్ష లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ, ఏ ఎస్పి లకు మెమెంటో తో సత్కరించి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రస్తుత సమాజంలో పోలీస్ ల సేవలు వేల కట్టలేనివన్నా రు. ఉగాది పండుగను ప్రశాంతంగా జరిగేలా శాంతి భద్రతలు చేపట్టాలని వారు కోరారు.


# నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాలలో సత్తా చాటిన స్లేట్ విద్యార్థులు




జన్నారం, మార్చి 19 (వుదయం ప్రతినిధి)
జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్షలో స్లేట్ (గ్రూప్ ఆఫ్ స్కూల్స్ విద్యా ర్థులు అద్భుత విజయాన్ని సాధించార ని పాఠశాలల చైర్మన్ ఏనుగు శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.ఈ పరీక్షలో మొత్తం నలుగురు విద్యార్థులు ఎంపికై పాఠశా లకి గర్వకారణంగా నిలిచారని,ఇందు లో స్లేట్ - సీబీఎస్ఈ విద్యార్థులు ఎల్. సహస్ర,ఎల్ శైనిక,టీ.శ్రీ హర్షిణి,అలాగే స్లేట్ హై స్కూల్ కు చెందిన విద్యార్థి జె. రిషికేశ్ ఎంపికయ్యాడు. ఈ సందర్భం గా చైర్మన్ మాట్లాడుతూ..విద్యార్థుల విజయం పాఠశాల నాణ్యమైన బోధన, ఉపాధ్యాయుల అంకితభావం మరియు తల్లిదండ్రుల సహకారం ఫలితంగా సాధ్యమైందని మరీ ముఖ్యంగా సీబీఎ స్ఈ సిలబస్ వారికి సీటు రావడం లో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు.ఈ సందర్భంగా విజయం సాధించిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం అభినందిస్తూ, భవిష్య త్తులో మరింత ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉన్నారు.

# ఉగాది పండగ సందర్భంగా నల్ల పోచమ్మ ఆలయం వద్ద మజ్జిగ పంపిణీ..




నాగిరెడ్డిపేట్ మార్చి 19 (వుదయం ప్రతినిధి)
గాది పండగ పర్వదినాన్ని పురస్కరిం చుకొని నల్ల పోచమ్మ ఆలయం వద్ద ఆలయానికి విచ్చేసిన భక్తులకు ప్రజ లకు దాహార్తిని తీర్చే ఉద్దేశంతో కొండ మీరాతాయి ఉచిత మజ్జిగ పంపిణీ కార్య క్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భం గా ఆలయానికి వచ్చిన భక్తులు ప్రజలు ఆమెకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజే శారు.అలాగే చినూర్ గ్రామంలో గ్రామ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలనే ఉద్దేశంతో కొండ మీరాతాయి ఎవరి సహాయం లేకుండా తన సొంత ఖర్చుల తో గ్రామానికి సేవ చేయాలనే ఉద్దేశం తో ఎల్ఈడి రూప్ లైట్ పెట్టించడం జరిగింది.దీనితో గ్రామస్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్య క్రమంలో గ్రామస్తులు తదితరు పాల్గొ న్నారు.

# మహిళా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట...

**– మహిళా సమైక్య సంఘం నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన...**
**– ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**



కోరుట్ల మార్చి 19 (వుదయం ప్రతినిధి) మహిళా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తున్నట్లు ప్రభుత్వ విప్ వేములవాడ నియోజకవర్గ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ అన్నారు జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలంలో ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ గురువారం పర్యటించారు మండలంలోని పోశానిపేట చింతకుంట గ్రామాల్లో 30 లక్షలతో నిర్మిస్తున్న మూడు మహిళా సమైక్య సంఘాల నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు అనంతరం రాజారాం తండా గ్రామంలో నూతన గ్రామపంచాయతీ బిల్డింగ్ ను ప్రారంభించారు తదుపరి దగ్గర గ్రామంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి కళ్యాణ మహోత్సవంలో తుర్తి గ్రామంలో పాత హనుమాన్ జాతర మహోత్సవంలో ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ అభివృద్ధిలో మహిళల పాత్ర అత్యంత కీలకమని మహిళా సమైక్య సంఘాల బలోపేతం ద్వారా కుటుంబాల ఆర్థిక స్థితి మెరుగుపడుతుందని తెలిపారు ప్రభుత్వం మహిళల స్వయం సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ ఇటువంటి మౌలిక సదుపాయాలను అందించేందుకు కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల సంక్షేమ ధ్యేయంగా ముందుకు పోతుందని తెలిపారు కథలాపూర్ మేడిపల్లి భీమారం మండలాల వరద ప్రదాయిని కలికోట సూరమ్మ రిజర్వాయర్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు ఇప్పటికే కుడి ఎడమ కాలువల నిర్మాణానికి భూసేకరణ పూర్తయినట్లు తెలిపారు కొందరి రైతుల ఖాతాల్లో భూసేకరణ డబ్బులు మంజూరు అయ్యాయని ఈ సందర్భంగా గుర్తు చేశారు గత సంవత్సరం రాళ్లవాగు నుండి వ్యవసాయానికి సాగునీటిని విడుదల చేసుకున్నామని ప్రస్తుతం కూడా రైతుల కోసం నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు కథలాపూర్ మండలంలోని పలు గ్రామాలకు లింకు రోడ్లు మంజూరు అయి టెండర్ దశలో ఉన్నాయని పేర్కొన్నారు గతంలో గిరిజనులకు ఇందిరమ్మ హయాంలోనే పోడు భూములకు పట్టాలని పంపిణీ చేసినట్లు తెలిపారు అలాగే ఇందిరమ్మ రాజ్యంలోనే పేద ప్రజలకు పక్కా ఇళ్లు మంజూరు చేశామన్నారు గత పాలకుల లాగ మాట ఇచ్చి తప్పేవాడిని కాదన్నారు ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తో పాటు కథలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుంద్ర నారాయణరెడ్డి కథలాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాయితి నాగరాజు జిల్లా మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు చెదలు సత్యనారాయణ కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు ఆయా గ్రామాల మహిళా సంఘాల సభ్యులు గ్రామ ప్రజలు యువకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# భట్టి చొరవ.. ఖమ్మం రహదారులకు మహర్దశ!

**– డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రత్యేక కృషితో రూ.594 కోట్లు మంజూరు**
**– నాలుగు వరుసల రోడ్లుగా ఆధునికీకరణ.. మారనున్న రవాణా ముఖచిత్రం**
**– ఉగాది పండుగ పూట ఖమ్మం ప్రజలకు తీపి కవరు**

ఖమ్మం వుదయం బ్యూరో మార్చి 19జిల్లా వాసుల దశాబ్దాల కల నెరవేరబోతోంది. జిల్లా రవాణా వ్యవస్థలో సరికొత్త అధ్యాయం మొదలుకానుంది. మారుమూల గ్రామాల నుంచి పట్టణాలకు మహర్దశ కల్పిస్తూ, జిల్లా సమగ్రాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అసాధారణ చొరవ చూపారు. ఆయన పట్టుదలతో జిల్లాలోని ఐదు ప్రధాన రహదారుల విస్తరణకు (జీవో ఎంఎస్ 15 /16-03-2026) ఏకంగా రూ.594 కోట్ల భారీ నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధులతో కీలక మార్గాలను నాలుగు వరుసల (ఫోర్ లేన్) రహదారులుగా అభివృద్ధి చేయనున్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తొలి రోజు నుంచే జిల్లా అభివృద్ధిపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హామ్) పద్ధతిలో ఈ రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించడంలో ఆయన పాత్ర కీలకం. ఈ రహదారుల వల్ల గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు సౌకర్యవంతమైన రాకపోకలను కల్పించడం, వ్యవసాయ ఉత్పత్తుల రవాణాను సులభతరం చేయడం లక్ష్యంగా ఈ రహదారుల విస్తరణను ప్రభుత్వం చేపడుతోంది.హా ఈ రదారుల విస్తరణ వల్ల ఖమ్మం, వైరా, మధిర నియోజకవర్గంలో కనెక్టివిటీ పెరగండతో పాటు స్థానికంగా ఆర్థిక వ్యవస్థకు ఊతం లభించనుంది. రవాణా ఖర్చులు తగ్గడంతో రైతులు, వ్యాపారులకు ప్రయోజనం చేకూరనుంది.రహదారులు విస్తరణ 1.హా వైరా నుండి జగ్గయ్యపేట వరకు హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారిని కలుపుతూ నాలుగు వరుసల రహదారిగా విస్తరణ జగ్గయ్యపేట, బోనకల్ , రావినూతల, ముజఫర్ నగర్, జానకీపురం, పెద్దబీరవల్లి, పాలడుగు, సీతానగరం, గొల్లపూడి, రెబ్బవరం, తాటిపూడి, జింకల తాండా. సోమవరం మీదుగా వైరా వరకు. ఈ రహదారి మొత్తం 25.2 కిలోమీటర్ల రహదారి విస్తరణకు రూ.151.20 కోట్ల నిధుల మంజూరు. 2. మధిర నుంచి తూటికుంట్ల వరకు నాలుగు వరుసల రహదారిగా విస్తరణ. మధిర, జిలుగుమాడు, ఆత్కూరు, కిష్టాపురం, సిరిపురం, కలకోట, బ్రాహ్మణపల్లి మీదుగా తూటికుంట్ల వరకు విస్తరణ. ఈ రహదారి మొత్తం 13.50 కిలోమీటర్ల మేర రహదారి విస్తరణకు రూ. 81 కోట్ల నిధుల మంజూరు. 3. మధిర నుంచి ఎర్రుపాలెం వరకు నాలుగు వరుసల రహదారి విస్తరణ. మధిర, ఎల్లెందులపాడు, దెందుకూరు, మీనవోలు మీదుగా ఎర్రుపాలెం వరకు నాలుగు వరుసల రహదారి విస్తరణ. ఈ రహదారి మొత్తం 18.40 కిలోమీటర్ల మేర రూ.110.40 కోట్ల నిధులు మంజూరు. 4. ఖమ్మం నుంచి బోనకల్ వరకు నాలుగు వరుసల రహదారి విస్తరణ. ఖమ్మం, కొత్తూరు, దంసలాపురం, గాంధీనగరం, రామకృష్ణాపురం, పందిళ్లపల్లి, జగన్నాథపురం, నాగులవంచ, ముష్టికుంట్ల మీదుగా బోనకల్ వరకు రహదారి విస్తరణ. మొత్తంగా 28.03 కిలోమీటర్ల మేర రహదారి విస్తరణకు రూ.157.23 కోట్ల నిధుల మంజూరు. 5. బోనకల్-ఆళ్లపాడు, రాయన్నపేట-వంగవీడు వరకు నాలుగు వరుసల రహదారి విస్తరణ. బోనకల్, ఆళ్లపాడు, రాయన్న పేట మీదుగా వంగవీడు వరకు రహదారి విస్తరణ. మొత్తంగా 15.72 కిలోమీటర్ల మేర రహదారికి విస్తరణకు రూ.94.32 కోట్ల నిధుల మంజూరు అయ్యాయి.



# సీనియర్ సిటిజెన్స్ ఆధ్వర్యంలో ఉగాది సంబరాలు...



జగిత్యాల మార్చి 19 (వుదయం ప్రతినిధి) తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో పరాభవ నామ ఉగాది పండుగ సంబరాలు నిర్వహించారు గురువారం సీనియర్ సిటిజన్స్ జిల్లా కార్యాలయంలో ఈ సందర్భంగా ఉగాది పచ్చడి బూరెలు పంపిణీ చేశారు జిల్లాలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న 20 మంది సీనియర్ సిటిజన్లకు ఉగాది పురస్కారాలు మాజీ మున్సిపల్ చైర్మన్ జీఆర్ దేశాయ్ రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ కే కృష్ణా రెడ్డి సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ ల చేతుల మీదుగా అందించి సన్మానించారు హరి అశోక్ కుమార్ మాట్లాడుతూ చెడు లక్షణాల ఓటమే పరాభవ నామ సంవత్సర సందేశమన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి హన్మంత్ రెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు బొల్లం విజయ్ పూసాల అశోక్ రావు ఎండి యాకూబ్ కోశాధికారి వెల్ముల ప్రకాష్ రావ్ జగిత్యాల క్లబ్ మెంబర్ పుప్పాల నర్సింగరావు కొక్కుల నారాయణ నాయకులు కొయ్యడ సత్యనారాయణ మానాల కిషన్ సింగం గంగాధర్ జిల్లా డివిజన్ మండలాల సీనియర్ సిటిజన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు

# ఎమ్మెల్యే సంజయ్ ని మర్యాదపూర్వకంగా కలిసిన ఎరుకల సంఘం నూతన కార్యవర్గం..



జగిత్యాల మార్చి 19 (వుదయం ప్రతినిధి) జగిత్యాల అర్బన్ మండలం మోతే గ్రామ ఏరుకల సంఘం నూతన కార్యవర్గ సభ్యులు గురువారం జగిత్యాల నియోజకవర్గం శాసనసభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్ ని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలవగా ఎరుకల సంఘం నూతన కార్యవర్గ సభ్యులను అభినందించి శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్ ఈ కార్యక్రమంలో సర్పంచ్ సంగీత మహేష్ మాజీ ఉపసర్పంచ్ వెంకటేష్ నాయకులు శ్రీరామ్ బిక్షపతి అధ్యక్షులు దాసరి పోచయ్య ఉపాధ్యక్షులు శ్రీరామ్ రాజన్న ప్రధాన కార్యదర్శి గంగాధర్ సంఘ సభ్యులు దాసరి తిరుపతి పోచయ్య ఎల్లయ్య

# అన్నపూర్ణ అమావాస్య అన్నదానం...

**– మెట్పల్లిలో అమ్మా చారిటబుల్ ట్రస్ట్ సేవలు...**



మెట్ పల్లి మార్చి 19 (వుదయం విలేఖరి) మెట్పల్లి పట్టణంలోని పాత మండల పరిషత్ కార్యాలయంలో అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నపూర్ణ అమావాస్య సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ట్రస్ట్ అధ్యక్షులు పుల్ల జగన్ గౌడ్ అధ్యక్షత వహించారు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మైలారపు లింబాద్రి హాజరయ్యారు పుల్లా జగన్ గౌడ్ పుల్లా శ్రీనివాస్ గౌడ్ లను శాలువాలతో సన్మానించి అన్నదాన కార్యక్రమాన్ని రాంబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజ సేవలో భాగంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు ట్రస్టు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలకు తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో పట్టణ ప్రజలు అమ్మ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులను అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు

# మున్నూరు కాపులు అన్ని రంగాల్లో రాణించాలి...

**– మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్**
**– జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్**



జగిత్యాల మార్చి 19 (వుదయం ప్రతినిధి) మున్నూరు కాపులు ఐకమత్యంతోనే అన్ని రంగాల్లో రానించాలని జగిత్యాల జిల్లా పరిషత్ మాజీ చైర్పర్సన్ దావ వసంత సురేష్ జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ లు పిలుపునిచ్చారు జగిత్యాల పట్టణంలోని మున్సిపల్ కాంప్లెక్స్ ఆవరణలో గురువారం మున్నూరు కాపు వర్తక సంఘం అధ్యక్షులు దీటి అంజయ్య పటేల్ కార్యదర్శి జంగిలి రవి ఆధ్వర్యంలో పరాభవ నామ ఉగాది సమ్మేళనం నిర్వహించారు ఈ సందర్భంగా ఉగాది పచ్చడి బూరెలు పంపిణీ చేశారు ఈకార్యక్రమంలో మున్నూరు కాపు సంఘము రాష్ట్ర సెక్రటరీ జనరల్ హరి అశోక్ కుమార్ తపస్ రాష్ట్ర అధ్యక్షులు వొడ్నాల రాజశేఖర్ గౌరవ సలహాదారు బండారి రాజ్ కుమార్ టిజివో జిల్లా అధ్యక్షులు కందుకూరి రవి బాబు బిజెపి నాయకుడు పుప్పాల శ్రీనివాస్ మున్సిపల్ కౌన్సిలర్లు కొక్కు అనిత గంగాదర్ కూతురు రాజేష్ పిట్ట ధర్మరాజు చీటీ లక్ష్మి నారాయణ కూతురు శేఖర్ జర్నలిస్ట్ వంగల రమేష్ అత్తినేని శ్రీనివాస్ అడప గంగారామ్ హరి కిరణ్ చిట్ల రవీందర్ పాము సత్యం జంగిలి మల్లికార్జున్ అరిగెల అశోక్ మాసం రమేష్ బత్తుల శంకర్ కొలగాని మధు సూదన్ తుంగూరి సురేష్ ముస్కె శ్రీనివాస్ చుక్క సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# కోరుట్ల పట్టణంలో వీర హనుమాన్ శోభాయాత్ర...



కోరుట్ల మార్చి 19 (వుదయం ప్రతినిధి) కోరుట్ల పట్టణ వేములవాడ రోడ్డులో గల హనుమాన్ జంక్షన్ ఆంజనేయస్వామి దేవాలయం నుండి వీర హనుమాన్ శోభాయాత్ర గురువారం నిర్వహించారు శోభాయాత్ర హనుమాన్ జంక్షన్ ఆంజనేయస్వామి దేవాలయం నుండి ప్రారంభమై నంది చౌక్ పాత బస్టాండ్ గీతా భవన్ మీదుగా తిరిగి గాంధీ రోడ్ వెంకటేశ్వర దేవాలయం పోలీస్ స్టేషన్ మీదుగా మళ్లీ వేములవాడ రోడ్డు కుండా హనుమాన్ జంక్షన్ ఆంజనేయస్వామి దేవాలయం కు చేరుకుంది ఈ సందర్భంగా భక్తులు రామనామ స్మరణతో భక్తి పారవశ్యంతో చిందులు వేస్తూ రథయాత్రను కొనసాగించారు ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు నీలి ఆంజనేయులు ప్రధాన కార్యదర్శి బండారి శ్రీనివాస్ కార్యవర్గ సభ్యులు హనుమాన్ దీక్ష స్వాములు తదితరులు పాల్గొన్నారు.

# ఉగాది వేడుకలు పంచాంగ శ్రవణం...

**– శివాలయ నిర్మాణానికి 1 లక్షల 11 వేల 111 రూపాయల విరాళం**



కోరుట్ల మార్చి 19 (వుదయం ప్రతినిధి) ఉగాది వేడుకలను పురస్కరించుకొని స్థానిక శ్రీ అయ్యప్ప జ్ఞాన సరస్వతి మాత ఆలయంలో ఉగాది వేడుకలను నిర్వహించారు ఆలయ ప్రధానార్చకులు పాలెపు రాము శర్మ వైదిక నిర్వహణలో ఉదయం స్వామివార్ల మూల విరాట్ లకు పంచామృతాలతో అభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం పంచాంగ శ్రవణం నిర్వహించారు ద్వాదశ జ్యోతిర్లింగ సహిత శివాలయానికి స్థానిక వాస్తవ్యులు స్వర్గీయ డాక్టర్ అందే వెంకటరాజం నరసమ్మ ల జ్ఞాపకార్థం వారి కుమారుడు ప్రభుత్వ ఉపాధ్యాయులు అందే శివప్రసాద్ మాధవి దంపతులు 1 లక్షల 11 వేల 111 రూపాయలు విరాళంగా సమర్పించారు ఈ సందర్భంగా ఆలయ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ గురు స్వామి మాట్లాడుతూ త్వరలో మూడు కోట్ల దెంతో నిర్మిస్తున్న శివాలయానికి భక్తులు ధన వస్తువు పైన సహకరించి ఆ పరమశివుని కృపకు పాత్రులు కావాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఆలయ శాశ్వత గౌరవాధ్యక్షులు చిదురాల నారాయణ గురు స్వామి ప్రధాన కార్యదర్శి తోటరాజు కోశాధికారి జుంబర్తి రమేష్ శ్రీరాముల శ్రీనివాస్ కాసు క్రాంతి చలిగంటి వినోద్ ఆడెపు శంకర్ గాజంగి లక్ష్మీపతి రాచమడుగు శ్రీనివాసరావు కల్లూరి సాయి మరిపల్లి శంకర్ గౌడ్ పిన్నంశెట్టి రాము భక్తులు తదితరులు పాల్గొన్నారు

# గోవులను అక్రమంగా తరలించకుండా చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలి...

**– సబ్ ఇన్స్పెక్టర్కు వినతిపత్రం సమర్పించిన బిజెపి నేతలు**



కోరుట్ల మార్చి 19 (వుదయం ప్రతినిధి) భారతీయ జనతా పార్టీ కథలాపూర్ మండల శాఖ అధ్యక్షులు మల్యాల మారుతి ఆధ్వర్యంలో రంజాన్ పండగ సందర్భంగా మండలం నుండి అక్రమంగా గోమాతలను తరలించకుండా ప్రతి సంవత్సరం లాగా ఈ సంవత్సరం కూడా మండల శివారు గ్రామలైన కలికోట సిరికొండ గ్రామాల వద్ద చెక్ పోస్ట్లు ఏర్పాటు చేసి అక్రమంగా గోమాతలు తరలించకుండా ప్రశాంతమైన వాతావరణం కల్పించాలని కథలాపూర్ సబ్ ఇన్స్పెక్టర్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గాందారి శ్రీనివాస్ కాసోజీ ప్రతాప్ అల్గొట్ ప్రమోద్ కోడిపెల్లి అనీల్ రెడ్డి అరెల్లి సాయి ముంజ వెంకటేష్ కల్లెడ ప్రసాద్ పెంట భూమేష్ పాల్గొన్నారు.

# బి కే ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా ఉగాది వేడుకలు



మక్తల్ మార్చి 19(వుదయం ప్రతినిధి): ఊట్కూరు మండలం పగిడి మారి, ఓబులాపురం గ్రామంలో భారతీయ కిసాన్ సంగ్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. బికేఎస్ పగటిమారి ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి సొంత పొలంలో ఉగాది పండుగ వస్తావని ఎద్దుల పూజ,భారత్ మాత పూజ పూజలను నిర్వహించారు.ఈ సంవత్సరం పంటలు బాగా పండాలని భగవంతుని ప్రార్థించారు.భారతీయ కిసాన్ సంగ్ తరపున రైతులందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

# వెలమ సంక్షేమ సంఘంలో పంచాంగ శ్రవణం...

**– ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్**



జగిత్యాల మార్చి 19 (వుదయం ప్రతినిధి) జగిత్యాల వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉగాది పండుగ సందర్భంగా తీగుళ్ళ విశ్వనాథ శర్మ చే శ్రీ పరాభవ నామ నూతన సంవత్సర ఉగాది పంచాంగ శ్రవణం కార్యక్రమం నిర్వహించారు ఇట్టి పంచాంగ శ్రవణ కార్యక్రమంలో పాల్గొని పూజలు నిర్వహించి ఉగాది పచ్చడి స్వీకరించి ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపిన జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్ అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ఏడాది సకాలంలో వర్షాలు పడాలని పాడిపంటలతో రాష్ట్రం అంతా సుభిక్షంగా ఉండాలని ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో ఉండి తమ కుటుంబ సభ్యులతో సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు మన ధర్మాన్ని మనం కాపాడుకుంటూ ఇతర మతాలను గౌరవించాలన్నారు అనంతరం వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన వెలమ కౌన్సిలర్ సభ్యులను సత్కరించారు.

ఈ కార్యక్రమంలో వెలమ సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులు సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




## ఏఐలో భారత్‌ది ప్రత్యేక స్థానం

కృత్రిమ మేధ (ఏఐ) విభాగంలో భారత్ ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉంటుందని కాగ్నిజెంట్ ముఖ్య ఏఐ అధికారి బాబక్ హాడ్జాట్ అన్నారు. లోతైన సాంకేతికత మూలాలకు తోడు డిజిటల్ వ్యవస్థలు, ప్రాసెస్‌లను అర్థం చేసుకోగలిగే వాళ్ల సంఖ్య భారత్‌లో ఎక్కువగా ఉండటం ఇందుకు కారణమని తెలిపారు. 'ఏఐటూల్స్‌తో కోడ్‌లను రూపొందించడం బాగా పెరిగినా.. మాడ్యులర్ సిస్టమ్‌లను అభివృద్ధిచేయాల్సిన అవసరమైతే డెవలపర్‌లకు ఉంటుంది. ఏఐ రూపొందించిన ఉత్పత్తుల నాణ్యతనూ పరిశీలించాల్సిందే'నని పీటీఐ వార్తా సంస్థతో మాట్లాడుతూ ఆయన చెప్పారు. అయితే ఏఐను వాడే నాన్‌కోడర్‌లతో పోలిస్తే ఏఐనివాడే కోడర్‌లే ముందంజలో ఉంటారని తెలిపారు.




# స్టాక్ మార్కెట్ భారీ పతనం.. సెన్సెక్స్ 2200 పాయింట్లు డౌన్

దేశీయ మార్కెట్లు గురువారం భారీ నష్టాల్లో కొనసాగుతున్నాయి. పశ్చిమాసియాలో కీలక గ్యాస్, చమురు క్షేత్రాలను లక్ష్యంగా చేసుకొని ఇరాన్ దాడులు జరపడం ఇంధన ధరలు పెరిగాయని పేర్కొంటూ యూఎస్ ఫెడ్ వడ్డీరేట్లను యథాతథంగా ఉంచింది. దీంతో అమెరికా మార్కెట్లు బుధవారం నష్టాల్లో ముగిశాయి. ఈ ఎఫెక్ట్‌తో



అంతర్జాతీయ మార్కెట్లపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తోంది. సరఫరా అంతరాయాలపై నెలకొన్న ఆందోళనల కారణంగా బ్రెంట్ క్రూడ్ ఒక బ్యారెల్‌కు మూడు శాతం పెరిగి 111 డాలర్లకు చేరింది. దీంతో మన సూచీలు భారీ నష్టాలతో కదలాడుతున్నాయి. సెన్సెక్స్ 2200 పాయింట్లకు పైగా నష్టపోయింది. మధ్యాహ్నం 2.45 గంటల సమయంలో సెన్సెక్స్ 2,289.22 పాయింట్ల నష్టంతో 74,397.52 పాయింట్ల వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ సైతం 655 పాయింట్ల నష్టంతో 23,122.30 వద్ద కొనసాగుతోంది. రూపాయి జీవనకాల కనిష్ఠాలకు పడిపోయింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 92.89గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో అన్ని స్టాక్స్ నష్టాల్లో కొనసాగుతున్నాయి. ఎటర్నల్, ఎల్అండ్‌టీ, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్ స్టాక్స్ ప్రధానంగా నష్టాల్లో ట్రేడవుతున్నాయి. మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ దాదాపు రూ.7 లక్షల కోట్ల మేర ఆవిరైంది. ఇరాన్ యుద్ధం వల్ల గురువారం ట్రేడింగ్‌లో ఆసియా మార్కెట్లు నష్టాల్లో జారుకున్నాయి. జపాన్ నిక్కీ 2.74 శాతం, దక్షిణ కొరియా కొస్పి 2.50 శాతం పతనమయ్యాయి.

మదుపర్లు కొనుగోళ్లు చేపట్టడంతో గత మూడు రోజులుగా సూచీలు లాభాల్లో కొనసాగాయి. నేటి ట్రేడింగ్‌లో లాభాల స్వీకరణకు మొగ్గుచూపడం కూడా నష్టాలకు దారితీసింది. ప్రి ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 1900 పాయింట్లకు పైగా కుంగింది.

ఖతార్‌లోని అత్యంత కీలకమైన రస్ లాఫాన్ ఇండస్ట్రియల్ సిటీపై ఇరాన్ క్షిపణితో దాడి చేసింది. ఇది ఖతార్ ఆర్థికవ్యవస్థకు పునాది. ఈ దాడిలో భారీస్థాయిలో ఇది దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. ఈ దాడి ఉద్రిక్తతలను మరింత పెంచనుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. రస్ లాఫాన్ గ్యాస్ క్షేత్రం నుంచి అత్యధికంగా ఫర్టిలైజర్స్, సీఎన్‌జీ, పీఎన్‌జీ అవసరాల కోసం భారత్ ఆధారపడుతుంది. భారత్ కొనుగోలు చేసే లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్‌లో 47శాతం ఖతార్ నుంచే లభిస్తుంది.

# హెచ్‌డీఎఫ్‌సీ ఛైర్మన్ అనూహ్య రాజీనామా..

హెచ్‌డీఎఫ్‌సీ పార్ట్ టైం ఛైర్మన్, స్వతంత్ర డైరెక్టర్ అయిన అతాను చక్రబర్తి అనూహ్య రాజీనామాతో ఆ బ్యాంక్ షేర్లు భారీగా కుంగాయి. గురువారం నాటి ట్రేడింగ్‌లో ఒక దశలో 9 శాతం మేర పతనమయ్యాయి. బ్యాంక్ నిఫ్టీ 3 శాతం మేర పడిపోయింది. బ్యాంకులో గత రెండేళ్లలో జరిగిన కొన్ని సంఘటనలు, ధోరణులను అంగీకరించలేకపోతున్నానని అతాను వెల్లడించడం ప్రభావం చూపిస్తోంది. "ఆయన నిర్దిష్ట కారణం మాత్రం వెల్లడించలేదు. విశ్వసనీయమైన చర్యలు తీసుకునేవరకు ఇప్పుడు ఏర్పడిన అభిప్రాయమే ప్రభావం చూపిస్తుంది" అని జేపీమోర్గాన్ విశ్లేషకులు అనుజ్ సింగ్లా పేర్కొన్నారు. తాజా పరిణామాలతో దేశంలోనే అతిపెద్ద ప్రైవేటు బ్యాంకులో




మదుపర్ల సంపద లక్ష కోట్లకు పైగా తుడిచిపెట్టుకుపోయింది. చక్రబర్తి రాజీనామా తక్షణం అమల్లోకి రావడంతో కేకీ మిస్త్రీని మధ్యంతర పార్ట్ టైం ఛైర్మన్‌గా బ్యాంకు నియమించింది. "ఈ రాజీనామా వెనక బ్యాంక్‌లో ఎలాంటి తీర్చలేని సమస్యలు లేవు. చిన్న అంశాలపై అభిప్రాయ భేదాలు వస్తుంటాయి. అవి సాధారణమే తప్ప, ఆందోళన కలిగించేవి కావు" అని ఇన్వెస్టర్ కాల్‌లో మిస్త్రీ భరోసా ఇచ్చారు. తన రాజీనామా లేఖలో లేవనెత్తిన ఆందోళనలపై చక్రబర్తి నుంచి బోర్డ్‌కు పూర్తి వివరాలు అందలేదని పేర్కొన్నారు. బ్యాంకుపై మదుపర్ల విశ్వాసాన్ని బలోపేతం చేసేలా చర్యలు తీసుకుంటామని హెచ్‌డీఎఫ్‌సీ సీఈఓ శశిధర్ జగదీషన్ వాటాదారులతో వెల్లడించారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో చోటుచేసుకుంటున్న తాజా పరిణామాలపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్పందించింది. బ్యాంక్ గవర్నెన్స్‌కు సంబంధించి ఎలాంటి తీవ్రమైన ఆందోళనలు లేవని పేర్కొంది. బ్యాంక్ వద్ద తగినంత మూలధనం ఉందని, దాని ఆర్థిక స్థితి సంతృప్తికరంగా ఉందని తెలిపింది.

# గల్ఫ్ దేశాల నుంచి దిగుమతులకు స్థానిక కరెన్సీల్లోనే చెల్లింపులు

గల్ఫ్ దేశాలకు వాణిజ్య చెల్లింపులను ఆయా దేశాల స్థానిక కరెన్సీల్లోనే చేసేందుకు ఉన్న మార్గాలను భారత్ అన్వేషిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత భౌగోళిక రాజకీయ ఆందోళనల నేపథ్యంలో చమురు సహా ఇతర వస్తువుల దిగుమతుల బిల్లు పెరగకుండా చూడాలన్నదే దీని వెనక ప్రభుత్వ ఉద్దేశంగా కనిపిస్తోంది. 'అంతర్జాతీయ అనిశ్చితుల వల్ల సరఫరాపరమైన అవరోధాలు ఏర్పడుతున్నాయి. చమురు, పెట్రోలియం ఉత్పత్తులు సహా పలు వస్తువుల దిగుమతుల బిల్లు పెరుగుతోంది. అందుకే అంతర్జాతీయ అనిశ్చితులు ఎప్పుడు తలెత్తినా.. ఆ ప్రభావం నుంచి దిగుమతుల బిల్లును కాపాడుకోవాలని భారత్ అనుకుంటోంద'ని ప్రభుత్వ అధికారి ఒకరు వెల్లడించినట్లు ఓ ఆంగ్ల వార్తా కథనం తెలిపింది. పశ్చిమాసియా ప్రాంతంలో ఉద్రిక్తతల కారణంగా బ్రెంట్ ముడిచమురు బ్యారెల్ ధర 70 డాలర్ల నుంచి పెరిగి ఏకంగా 110 డాలర్లను మించిన సంగతి తెలిసిందే. భారత్ తన ముడి చమురు అవసరాల్లో 85 శాతం వరకు దిగుమతులపైనే ఆధారపడుతున్నందున.. ఇటీవలి ధరల పెరుగుదల వల్ల భారత్‌కు దిగుమతి బిల్లు భారీగా పెరగనుంది. ఈ ప్రభావం వాణిజ్య లోటు, ద్రవ్యోల్బణం మీద కనిపించనుంది. మరోవైపు 2024–25లో భారత్ మొత్తం చమురు దిగుమతుల్లో



గల్ఫ్‌దేశాల నుంచే 28% ఉన్నాయి. ఈ నేపథ్యంలో స్థానిక కరెన్సీల్లో వాణిజ్య చెల్లింపులు చేస్తే.. దిగుమతి బిల్లుపై పడే భారాన్ని కొంతైనా తగ్గించుకోవచ్చన్నది ప్రభుత్వ ఆలోచనగా కనిపిస్తోంది.

# ప్యాకేజ్డ్ ఆహారానికి పెరిగిన గిరాకీ



పశ్చిమాసియా ఉద్రిక్తతల ప్రభావంతో వంటగ్యాస్ (ఎల్‌పీజీ) సరఫరాలో ఏర్పడిన అంతరాయం భారతీయుల ఆహారపు అలవాట్లను అనూహ్యంగా మారుస్తోంది. గ్యాస్ సిలిండర్ల లభ్యత తగ్గడంతో గంటల తరబడి వంట చేసే పని లేకుండా నిమిషాల్లో సిద్ధమయ్యే 'రెడీ–టు–ఈట్' ఆహార పదార్థాలకు గిరాకీ ఒక్కసారిగా పెరిగింది. భారత్ తన వంటగ్యాస్ అవసరాల్లో దాదాపు 60 శాతం దిగుమతులపైనే ఆధారపడుతోంది. ప్రస్తుతం పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో కీలకమైన హర్మూజ్ జలసంధి ద్వారా జరిగే రవాణా ఇబ్బందుల్లో పడింది. దీంతో గత 15 రోజుల్లోనే దేశీయ ఎల్‌పీజీ వినియోగం గతేడాదితో పోలిస్తే 17.7 శాతం మేర క్షీణించింది. ఫిబ్రవరితో పోలిస్తే ఈ తగ్గుదల ఏకంగా 26.3 శాతంగా ఉండటం పరిస్థితి తీవ్రతను ప్రతిబింబిస్తోంది. గ్యాస్ కొరత దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం గృహ వినియోగదారులకు ప్రాధాన్యం ఇస్తోంది. దీంతో హోటళ్లు, రెస్టారెంట్లు వాడే వాణిజ్య సిలిండర్లపై భారీగా కోత పడింది. హోటళ్లలో రేట్లు పెరగడం, లభ్యత తగ్గడంతో మధ్య తరగతి ప్రజలు ప్యాకేజ్డ్ పులిహోర, ఉప్మా, బిర్యానీ వంటి 'హీట్ అండ్ ఈట్' ఉత్పత్తులను ఆశ్రయిస్తున్నారు. వీటితోపాటు ప్రముఖ సంస్థలు ఉత్పత్తి చేసే మిల్లెట్ ఆహార ఉత్పత్తులకూ గిరాకీ అధికం అవుతోంది. వంటగ్యాస్ కొరత ప్రభావంతో ఇన్‌స్టంట్ నూడుల్స్, ప్యాకేజ్డ్ మీల్స్, స్నాక్స్ విభాగంలో 15 శాతం పైగా వృద్ధి నమోదైందని ఇ–కామర్స్ దిగ్గజం అమెజాన్ పేర్కొంది. హైదరాబాద్, ముంబయి వంటి మెట్రోలకే పరిమితం కాకుండా, చిన్న నగరాలు, పట్టణాల్లోనూ ఈ ధోరణి కనిపిస్తోందని పేర్కొంది. పెరుగుతున్న గిరాకీ తగ్గట్టు ఆయా సంస్థలూ ఉత్పత్తిని పెంచతున్నాయని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి.




## పదవీకాలం పొడిగించమని అజిత్ అగార్కర్ బీసీసీఐని కోరాడా?




భారత క్రికెట్ జట్టు చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ (Ajit Agarkar) తన పదవీకాలాన్ని పొడిగించమని బీసీసీఐని (BCCI) కోరినట్లుగా వార్తలు వస్తున్నాయి. వన్డే వరల్డ్‌కప్ 2027 వరకు తనకు అవకాశం కల్పించమని కోరుతున్నట్లు తెలుస్తోంది. ఐపీఎల్ (IPL) 2025కు ముందు ఓ సంవత్సరం పాటు అగార్కర్ పదవీకాలాన్ని పొడిగించిన విషయం తెలిసిందే.

టీమ్‌ఇండియా టీ20 వరల్డ్ కప్ 2026 గెలిచిన వెంటనే అగార్కర్ ఈ మేరకు బీసీసీఐని అభ్యర్థించినట్లు సమాచారం. అయితే ఈ విషయాన్ని బీసీసీఐ కానీ, అజిత్ అగార్కర్ కానీ అధికారికంగా ధ్రువీకరించలేదు. అగార్కర్ 2023 నుంచి భారత చీఫ్‌సెలక్టర్‌గా వ్యవహరిస్తున్నాడు. ఈ మూడేళ్లలో టీమ్‌ఇండియా నాలుగు ఐసీసీ (ICC) ఈవెంట్లలో ఫైనల్స్ ఆడితే, వాటిలో మూడింట్లో విజేతగా నిలిచింది. 2023 వన్డే వరల్డ్‌కప్‌లో ఫైనల్స్‌కు చేరుకుంది. టీ20 వరల్డ్ కప్ 2024, ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025, టీ20 వరల్డ్ కప్ 2026లో భారత జట్టు విజేతగా నిలిచిన విషయం తెలిసిందే.

# అతడి తర్వాత టీమ్‌ఇండియా పరిస్థితి ఏంటి?: రవిచంద్రన్ అశ్విన్




టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ . బుమ్రా తర్వాత భారత జట్టు పరిస్థితి ఏంటని ఆసక్తికరమైన ప్రశ్నను లేవనెత్తాడు. బుమ్రా రిటైర్మెంట్ అనంతరం టీమ్‌ఇండియా ఇబ్బందిపడుతుందని అశ్విన్ అభిప్రాయపడ్డాడు. జట్టులో బ్యాటింగ్ విభాగం బలంగా ఉందని, బౌలింగ్ విభాగం మాత్రం అంత బలంగా లేదన్నాడు. వైట్ బాల్ క్రికెట్‌లో బ్యాటింగ్ పరంగా టీమ్‌ఇండియాకు భవిష్యత్తులోనూ ఇబ్బంది లేదు. రానున్న దశాబ్దంలో భారత జట్టు ఈ ఫార్మాట్లో పలు ట్రోఫీలూ గెలుచుకుంటుంది. ఈ విషయంలో నాకు ఎలాంటి సందేహమూ లేదు. బ్యాటింగ్ విభాగంలో భారత జట్టు చాలా బలంగా ఉంది' అని అశ్విన్ అన్నాడు. 'కానీ బుమ్రా తర్వాత ఏంటి? ఈ విషయంలో నాకు ఆందోళనగా ఉంది. బ్యాటింగ్ ఉన్నంత ఆకర్షణీయంగా బౌలింగ్ ఉండటం లేదు. దీంతో రాబోయేతరంలో పిల్లలు బౌలింగ్ ఎంచుకోకపోవచ్చు. ఎందుకంటే.. బ్యాటర్లు కొట్టే సిక్స్‌లు, ఫోర్లు వారిని అలరిస్తాయి. బౌలింగ్‌తోనూ మనం టోర్నమెంట్లు, సిరీస్‌లు గెలవొచ్చని ఎవరు గ్రహిస్తారు?' అని అశ్విన్ విశ్లేషించాడు.

# ఈసారి కప్పు గెలిచేది ఆ జట్టే..: ఏబీ డివిలియర్స్



మరికొన్ని రోజుల్లో ఐపీఎల్ (IPL) 2026 ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో దక్షిణాఫ్రికా మాజీ క్రికెటర్ ఏబీ డివిలియర్స్ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశాడు. డిపెండింగ్ ఛాంపియన్స్‌గా బరిలోకి దిగనున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఈసారీ విజేతగా నిలుస్తుందన్నాడు. 'విరాట్ కోహ్లీ ఒక్కడి పైనే భారం పడబోదు. జట్టులో పోరాట యోధులున్నారు. వారంతా ట్రోఫీని సొంతం చేసుకోవాలనే లక్ష్యంతో ముందుకుసాగుతున్నారు. ఆర్సీబీ జట్టులో పెద్దగా మార్పులు ఉండకపోవచ్చు. వారు మరోసారి ఈ సీజన్‌లో విజేతలుగా నిలిచే అవకాశముంది' అని ఏబీ డివిలియర్స్ అన్నాడు. అలాగే విరాట్ కోహ్లీ.. డ్రెస్సింగ్ రూమ్‌లో తరచుగా ఏం చెప్పేవాడో డివిలియర్స్ వివరించాడు. 'మనం ఒక కప్పు గెలిస్తే.. రెండు, మూడు, నాలుగు ఇలా మరిన్ని కప్పులు గెలుస్తాం.. అని విరాట్ తరచూ చెబుతుండేవాడు. నేను దాన్ని నిజమని నమ్ముతున్నా. ఆర్సీబీ దుమ్ము రేపడం ఖాయం. వరుసగా రెండు, మూడు కప్పులు తప్పకుండా గెలుస్తుందనే నమ్మకం నాకుంది' అని ఏబీ డివిలియర్స్ తన అభిప్రాయాన్ని వెల్లడించాడు.

# ఇంతకంటే అందమైన స్టోరీ ఇంకేముంది?:

సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఇషాన్ కిషన్‌ను తాత్కాలిక సారథిగా నియమిస్తూ ఫ్రాంచైజీ యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. పాట్ కమిన్స్ గైర్హాజరీతో కొన్ని మ్యాచులకు ఇషాన్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఎస్ఆర్‌హెచ్ నిర్ణయంపై టీమ్‌ఇండియా మాజీ ఆటగాడు, క్రికెట్ విశ్లేషకుడు ఆకాశ్ చోప్రా స్పందించాడు. యాజమాన్య నిర్ణయం బాగుందని ప్రశంసించాడు. ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని మరీ ఇషాన్ ఈ స్థాయికి చేరాడని చోప్రా తెలిపాడు. నిలకడైన ప్రదర్శన ఇస్తోన్న ఆటగాడిపై నమ్మకం ఉంచడం అభినందించదగ్గ విషయమన్నాడు. "ఇప్పుడు ఇషాన్ కిషన్ సారథి అయ్యాడు. ఇంత కంటే అద్భుతమైన, అందమైన స్టోరీ ఇంకేం ఉంటుంది? వినయంగా ఉంటూ కఠిన శ్రమ చేసిన ఓ ప్లేయర్‌కు ఇలాంటి అవకాశం ఇవ్వడం బాగుంది. నా వ్యక్తిగత అభిప్రాయం ప్రకారం.. ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యం సరైన నిర్ణయం తీసుకుంది.అతను ఝార్ఖండ్ తరఫున ఆడాడు. భారీగా పరుగులు చేశాడు. తన జట్టును గెలిపించాడు. ఆ తర్వాత భారత జట్టులోకి వచ్చి ఎలా రాణించాడో మనమంతా చూశాం. సవాళ్లను అధిగమించి ప్రతిభ ప్రదర్శించాడు. ఎక్కడ ఆడించినా పరుగులు చేశాడు. ఇప్పుడు అతి పెద్ద ఫ్రాంచైజీకి సారథిగా మారాడు అని ప్రశంసించాడు.



# పాక్ దాడి బాధితులను పరామర్శించిన అఫ్గాన్ క్రికెటర్లు



అఫ్గానిస్థాన్ రాజధాని కాబుల్‌లోని ఓ ఆసుపత్రిపై పాక్ జరిపిన వైమానిక దాడిలో దాదాపు 400 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో వందల సంఖ్యలో సామాన్యులు గాయపడ్డారు. ప్రస్తుతం ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారిని అఫ్గానిస్థాన్ జాతీయ క్రికెట్ జట్టులోని పలువురు క్రికెటర్లు పరామర్శించారు. అఫ్గానిస్థాన్ వన్డే, టెస్ట్ జట్టు కెప్టెన్ హస్మతుల్లా షాహిది, గుల్బాదిన్ నైబ్, ఖైస్ అహ్మద్, వజీర్ అక్బర్ ఖాన్ బాధితులు, వారి కుటుంబాలకు సంఘీభావం తెలిపారు.

# ఏఐ డీప్‌ఫేక్ వీడియోల నుంచి రక్షణ కల్పించండి: దిల్లీ హైకోర్టుకు గంభీర్



కృత్రిమ మేధ (ఏఐ)తో సృష్టించిన డీప్‌ఫేక్ వీడియోల వల్ల తన పరువు ప్రతిష్ఠలకు భంగం వాటిల్లుతోందని భారత క్రికెట్ జట్టు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ దిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఆన్‌లైన్‌లో తన గుర్తింపు దుర్వినియోగం చేయడంపై రక్షణ కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. ఆన్‌లైన్‌లో తన పేరు, ముఖం, గొంతును ఉపయోగించి నకిలీ వీడియోలు, అనధికారిక కంటెంట్ విపరీతంగా పెరిగిపోయిందని అందులో పేర్కొన్నారు. ఐపీఎల్ 2026: అదిరిపోతున్న సోషల్ మీడియా ఆట.. వీడియోలు చూశారా? దిల్లీ హైకోర్టులో దాఖలు చేసిన సివిల్ దావాలో గంభీర్ తన వ్యక్తిత్వ పరిరక్షణతోపాటు రూ. 2.5 కోట్ల నష్టపరిహారం ఇప్పించాలని కోరారు. అటువంటి డీప్ ఫేక్ కంటెంట్‌ను తక్షణమే తొలగించేలా ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. "ఇది కేవలం వ్యక్తిత్వ హననం మాత్రమే కాదు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగిస్తున్న సమయంలో చట్టం, గౌరవానికి సంబంధించిన అంశంగా పరిగణించాలి. నా గుర్తింపు, నా పేరు, నా గొంతుకను ఆయుధాలుగా ఉపయోగించి అనధికారిక ఖాతాల్లో తప్పుడు సమాచారం వ్యాప్తి అవుతోంది. నా పేరు వినియోగించి ఆదాయం ఆర్జించడం జరుగుతోంది" అని గంభీర్ తెలిపారు. గంభీర్ మాట్లాడినట్లు డీప్ ఫేక్ వీడియోలతో సోషల్ మీడియాలో కంటెంట్‌ను పలువురు క్రియేట్ చేశారు. గంభీర్ తన ప్రధాన కోచ్ పదవికి రాజీనామా చేసినట్లు ఓ వీడియో వైరల్ అయింది. దానిని దాదాపు 29 లక్షల మంది వీక్షించారు. సీనియర్ క్రికెటర్లపై తాను అసభ్యకరంగా మాట్లాడినట్లు వచ్చిన డీప్ ఫేక్ వీడియో కూడా 17 లక్షల వ్యూస్‌ను సాధించడం గమనార్హం. దీంతో దాదాపు 16 మందిని ప్రతివాదులుగా చేరుస్తూ హైకోర్టులో గంభీర్ పిటిషన్ దాఖలు చేశారు. ఇందులో పలు సోషల్ మీడియా ఖాతాలు, ఇ–కామర్స్ ప్లాట్‌ఫామ్స్ ఉన్నాయి.

# వుదయం సినిమా

MOVIE TIME!

## "ఖైగల్" ఫస్ట్ లుక్ విడుదల

పవిత్రమైన ఉగాది పండగ సందర్భంగా, 'ఖైగల్' చిత్ర బృందం ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. జై సిద్ధార్థ్ 'దేవ' గా హైవోల్టేజ్ సినిమాటిక్ అనుభూతిని కలిగిస్తుంది. ఈ ఫస్ట్ లుక్‌లో, అగ్ని మరియు గందరగోళం మధ్య రక్తసిక్తమైన యోధుడు ఒక శక్తివంతమైన తిరుగుబాటుకు ప్రతీకగా నిలుస్తూ కనిపిస్తున్నాడు.ఈ చిత్రంలో సతీ పాత్రలో సుష్మిత సింగ్, నందిని పాత్రలో వాంశీ ఉదయ్ నటిస్తున్నారు. దీనికి యశ్విన్ దర్శకత్వం వహించారు. గీతా రమేష్, అక్షర జి.ఆర్, మరియు సంతోష్ అబ్రహం నిర్మించిన ఈ చిత్రాన్ని, జి.ఆర్ ప్రొడక్షన్స్ మరియు #ఖైగల్ వారి యర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ ప్రాజెక్ట్ భారీ స్థాయిలో రూపొందించబడింది.ఈ చిత్రం గురించి దర్శకుడు యశ్విన్ మాట్లాడుతూ, "జై సిద్ధార్థ్‌కు 6'2" ఎత్తుతో ఆకట్టుకునే స్క్రీన్ ప్రెజెన్స్ మరియు ప్రత్యేకంగా నిలిచే శక్తివంతమైన బాస్ వాయిస్ ఉన్నాయి. ఈ రెండూ కలిసి దేవ పాత్రకు ఒక ప్రత్యేకమైన అనుభూతి తీసుకువస్తాయి.హీరో నటన ప్రేక్షకుకు నిజంగా ఆకట్టుకునే లాగ ఉంటుంది. ఈ చిత్రం యొక్క బలమైన సాంకేతిక బృందం సినిమాటోగ్రాఫర్ దేవ్ దీప్ కుండు, ప్రొడక్షన్ డిజైనర్ అరుణాచల నాని, ఆర్ట్ డైరెక్టర్ రవి కొండ మరియు యాక్షన్ కొరియోగ్రఫీని యోగానంద డిసి అందించారు. సంగీతాన్ని ప్రియేష్ మోతుకూరి స్వరపరచగా, ఎడిటింగ్ బాధ్యతలను ప్రీతమ్ గాయత్రి నిర్వహించారు. పాత్రల వాస్తవికతను, లోతును జోడిస్తూ దుస్తులను ఆయేషా మరియం డిజైన్ చేశారు.

## ఉస్తాద్ భగత్ సింగ్.. పవన్‌కల్యాణ్ కొత్త చిత్రం మెప్పించిందా?

నల్లమలకు సమీపంలో ఓ గూడెం అది. అక్కడకు పాఠాలు బోధించేందుకు చంద్రశేఖర్ రావు (కె.ఎస్.రవి కుమార్) అనే మాస్టారు వస్తారు. అక్కడి జనం కోసం తన జీతాన్ని, జీవితాన్ని అంకితం చేస్తాడు. కూలీ పనులకు వెళ్లే పిల్లలు మళ్లీ చదువుల కోసం బడి బాట పట్టేలా చేస్తారు. ఆ ఊళ్లోనే పుట్టి పెరిగి అనాథగా ఉన్న చిన్నయ్యని చేరదీసి అతనికి సంరక్షకుడిగా మారి చదువు చెప్పిస్తాడు. ఆ కుర్రాడి భావాలు, అతనిలోని ఆవేశం గ్రహించి భగత్‌సింగ్ అని పేరు పెడతాడు. తన తండ్రిని ఉస్తాద్ అని పిలిచేవారని తన పూర్తి పేరును ఉస్తాద్ భగత్‌సింగ్ అని చెప్పుకొంటాడు ఆ కుర్రాడు. ఆ తర్వాత సేవాగుణం ఉన్న మాస్టారు రాజకీయాల్లోకి అడుగుపెట్టి ముఖ్యమంత్రి అవుతారు. చిన్నప్పటి ఉస్తాద్ భగత్‌సింగ్ పెద్దయ్యాక ఏసీపీ



(పవన్‌కల్యాణ్) అవుతాడు. ముఖ్యమంత్రి అయిన తన గురువుకు ఎప్పుడూ రక్షణగా ఉంటుంటాడు. అయితే అసాంఘిక శక్తులతో సంబంధాలున్న చెదలమర్రి నల్లనాగప్ప (పార్తిబన్) ముఖ్యమంత్రి పీఠంపై కన్నేస్తాడు. చంద్రశేఖర్‌రావుని అంతం చేయాలని పథకం రచిస్తాడు. మరి నల్లనాగప్పని ఏసీపీ ఉస్తాద్ భగత్‌సింగ్ ఎలా ఎదుర్కొన్నాడు? ఉస్తాద్‌ని దెబ్బ కొట్టేందుకు నాగప్ప ఏం చేశాడు?ఉస్తాద్ జీవితంలోకి వచ్చిన లీల (శ్రీలీల), శ్లోక (రాశీఖన్నా) ఎవరు? అన్నది చిత్ర కథ.

పవన్ కల్యాణ్ – హరీశ్ శంకర్ కలయికలో సినిమా అనగానే ప్రేక్షకులు 'గబ్బర్‌సింగ్'ని గుర్తు చేసుకుంటారు. పవన్‌కల్యాణ్‌ని ఎలా చూపిస్తే ఆయన అభిమానులకూ, సామాన్య ప్రేక్షకులకు నచ్చుతుందో పక్కాగా అలాగే చూపించారు. చాలా సంవత్సరాల తర్వాత ఆ ఇద్దరూ కలిసి సినిమా చేస్తున్నప్పుడు మళ్లీ అదే స్థాయి అంచనాలు ఏర్పడటం సహజం. ఆ విషయాన్ని దృష్టిలో ఉంచుకునే దర్శకుడు హరీశ్ శంకర్ కథపై కంటే కూడా, పవన్‌కల్యాణ్ మార్క్ అంశాలపైనే ప్రధానంగా దృష్టిపెట్టి ఈ సినిమాని తెరకెక్కించారు. లుక్ మొదలుకొని పవన్ మేనరిజమ్స్, సంభాషణలు, పొలిటికల్ ఇమేజ్ ఇలా ఇంచుమించు గబ్బర్‌సింగ్‌లాగే దమ్ము చూపించే పోలీస్ పాత్ర, ఎలివేషన్స్‌ని పక్కాగా మేళవించి సినిమాని తెరకెక్కించారు.



కథ, కథనం పరంగా చూస్తే సగటు తెలుగు కమర్షియల్ సూత్రాలకు తగ్గట్టే సాగుతుంది. ఏమాత్రం కొత్తదనం కనిపించదు. సాధారణ ప్రేక్షకులు ఆ విషయంలో కాస్త అసంతృప్తి చెందుతారేమో కానీ, అభిమానులకు మాత్రం ఇందులోని పవన్‌కల్యాణ్ మరింతగా నచ్చేస్తాడు. ఇటీవల వచ్చిన 'ఓజీ' కూడా అభిమానుల్ని మెప్పించే అంశాలతోనే రూపొందినా... ఆ నేపథ్యం, అందులో కనిపించిన పవన్‌కల్యాణ్ వేరు. ఈ సినిమాలో చాలా రోజులుగా అభిమానులు చూడని వింటేజ్ పవన్‌కల్యాణ్‌ని చూపించారు హరీశ్ శంకర్. భగత్ సింగ్‌గా పవన్ తెరపై కనిపించినప్పటి నుంచి అసలు వినోదం, డ్రామా మొదలవుతాయి. డ్యాన్స్ ఎపిసోడ్, కాలరే ఎత్తరా పాట, మరోవైపు అడవిలోకి వచ్చిన నల్ల నాగప్ప గ్యాంగ్ నేపథ్యంలోని సన్నివేశాలతో సినిమా సరదాగా, అదే సమయంలో ఆసక్తిని రేకెత్తిస్తూ ముందుకు సాగుతుంది. 'సినిమాతో మంచి చెప్పే అవకాశం వచ్చిందంటే నేను అస్సలు వదులుకోను' అని చెప్పే దర్శకుడు హరీశ్ శంకర్ ఇందులో డిప్రెషన్, దేశభక్తి, సోషల్ మీడియానే జీవితం అనుకుంటూ నలిగిపోయే జీవితాల గురించీ మరిన్ని సంభాషణలు రాసి పవన్‌కల్యాణ్‌తో చెప్పించారు.

ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్ మొదలవడంతో కథలోని అసలు సిసలు మాస్ కోణం బయటికొస్తుంది. ఖాకీ డ్రెస్‌లో గబ్బర్‌సింగ్‌ని గుర్తు చేస్తూ పవన్ సందడి చేస్తారు. రథయాత్ర ఎపిసోడ్, విలన్‌కి వార్నింగ్ ఇచ్చే సన్నివేశాలు కథలో వేడిని పెంచుతాయి. ద్వితీయార్ధం సినిమాకి మరింత బలం. పాత బస్తీ ఎపిసోడ్‌తోపాటు, పవన్‌కల్యాణ్, శ్రీలీల మధ్య సాగే సరదా సన్నివేశాలు, ఈ మనసే.. రీమిక్స్ గీతం, అది తెరకెక్కించిన విధానం, అదే ఎపిసోడ్‌లోని భావోద్వేగ కోణం సినిమాకి హైలైట్. పతాక సన్నివేశాలూ మెప్పిస్తాయి. కథ, కథనాలు చాలా వరకూ ఊహకు తగ్గట్టుగానే సాగినా.. పవన్‌కల్యాణ్ హీరోయిజం, ఆయన మాస్ హంగామా, ఆయన ప్రజాజీవితాన్ని, అభిమాన బలాన్ని గుర్తు చేసేలా సంభాషణలు కట్టిపడేస్తూ మిగతా విషయాలేవీ గుర్తుకు రాకుండా చేయడం ఈ సినిమా ప్రత్యేకత.

ఈ కథ, పాత్రల్లో కొత్త కాకపోయినా పవన్‌కల్యాణ్ (Pawan Kalyan) శైలి వినోదం, మాస్ అంశాలు ఇందులో పుష్కలంగా ఉండటంతో ఆయన మరింత హుషారుగా నటించారు. సాధారణ సన్నివేశాల్ని సైతం మరో స్థాయికి తీసుకెళ్లారు. రాశీఖన్నా సందడి ప్రథమార్ధంలోనే. శ్రీలీలకి ప్రాధాన్యమున్న పాత్ర దక్కింది. ఆమె మనసే పాటలో కనిపించిన విధానం ఆకట్టుకుంటుంది. సెకండాఫ్‌లో ఆమె పాత్ర నేపథ్యంలో వచ్చే కీలక మలుపు భావోద్వేగాల్ని పంచుతుంది. ప్రధాన ప్రతినాయకుడిగా పార్తిబన్ కనిపించిన తీరు బాగుంది. నల్లనాగప్ప పాత్రపై ఆయన బలమైన ప్రభావమే చూపించారు. కె.ఎస్.రవికుమార్, రావు రమేశ్ కీలకమైన పాత్రల్లో కనిపిస్తారు. గౌతమి, సత్యం రాజేశ్, ప్రభాస్ శ్రీను, ప్రవీణ్ తదితరులు అలవాటైన పాత్రల్లో కనిపిస్తారు. దేవిశ్రీప్రసాద్ పాటలు బాగున్నాయి. తమన్ నేపథ్య సంగీతం సినిమాపై బలమైన ప్రభావం చూపించింది. ఎడిటింగ్‌తో పాటు ఇతర విభాగాలూ మంచి పనితీరునే కనబరిచాయి. దర్శకుడు హరీశ్ శంకర్ ఒక ఫక్తు కమర్షియల్ కథకే తనదైన మార్కు సంభాషణలు, హీరో పాత్రకు ఎలివేషన్లు డిజైన్ చేసి సినిమాను ఆవిష్కరించారు.

## అనుష్క పెళ్లి రూమర్స్.. క్లారిటీ ఇచ్చిన టీమ్

గత కొన్ని రోజులుగా నటి అనుష్క పెళ్లి వార్త సోషల్ మీడియాలో చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. ఈ ఏడాది ఆమె ఓ వ్యాపారవేత్తతో పెళ్లిపీటలెక్కనున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. దీనిపై ఆమె టీమ్ స్పందించింది. ఆ వార్తలను ఖండిస్తూ ప్రకటన విడుదల చేసింది. ''ఒకరి వ్యక్తిగత జీవితాన్ని రోజువారీ ముఖ్యాంశాలుగా మార్చే ముందు కనీసం అది అధికారికమా, కాదా.. అని కూడా చూడడం లేదు. ఊహించడం, అంచనా వేయడం, అనధికారిక సమాచారాన్ని పదే పదే ప్రచురించడం సరైన పద్ధతి కాదు. అన్నిటి కంటే నిరాశ కలిగించే విషయం ఏమిటంటే.. ఆమె వయసుపై అనవసరమైన శ్రద్ధ చూపడం. ప్రతి పోస్ట్‌లోనూ '44' అనే నంబర్‌ను ఏదో వివాదాస్పదమైన అంశంలా ఎందుకు హైలైట్ చేస్తున్నారు? వయసు అంత పెద్ద సమస్య అయితే.. హీరోల వయసు విషయంలో కూడా ఇదే ఉత్సాహం ఎందుకు కనిపించడం లేదు? మహిళల విషయంలోనే ఈ కథనం ఎందుకు భిన్నంగా ఉంటుంది?'' అని టీమ్ ప్రశ్నించింది. ''అనుష్క శెట్టి తన కెరీర్‌ను గౌరవం, ప్రతిభతో హుందాగా నిర్మించుకున్నారు. ఆమె ఎప్పుడూ పీఆర్ స్టంట్స్‌పై ఆధారపడలేదు. తన వ్యక్తిగత జీవితాన్ని గోప్యంగా ఉంచుకోవాలని కోరుకునే వ్యక్తిని ఇలా టార్గెట్ చేయడం అన్యాయం. ప్రతిఒక్కరూ తమ జీవితంలో జరిగే విషయాలను అందరికీ చెప్పాలని అనుకోరు. ఆ నిర్ణయాన్ని గౌరవించాలి. వివాహం అనేది వ్యక్తిగత విషయం. ఇది బ్రేకింగ్ న్యూస్ కాదు, ట్రెండ్ కాదు, కేవలం వ్యూస్ కోసం సెన్సేషనలైజ్ చేయాల్సిన విషయం అంతకంటే కాదు. ఇకనైనా బాధ్యతగా వ్యవహరించండి. హద్దుల ను గౌరవించండి. ప్రచురించే ముందు నిజాన్ని నిర్ధరించుకోండి. ముఖ్యంగా హీరోయిన్‌లను కూడా హీరో లతో సమానంగా గౌరవంగా చూడండి'' అని టీమ్ పేర్కొంది.





## ఇది ఉస్తాద్ ఉగాది

''ఒక స్టార్ హీరో నుంచి అన్ని హంగులతో కూడిన వాణిజ్య ప్రధానమైన సినిమా వచ్చి చాలా కాలమైంది. అభిమానులు మాత్రమే కాకుండా... సాధారణ ప్రేక్షకులు కూడా ఆస్వాదించేలా, పవన్‌కల్యాణ్ సినిమా నుంచి ఏమేం కోరుకుంటారో అవన్నీ ఇందులో చూపిస్తున్నాం. అదే ఓ దర్శకుడిగా ప్రేక్షకులకు నేనిచ్చే భరోసా'' అన్నారు హరీశ్‌శంకర్. ఆయన దర్శకత్వంలో... పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా తెరకెక్కిన చిత్రం 'ఉస్తాద్ భగత్‌సింగ్'. శ్రీలీల, రాశీఖన్నా కథానాయికలు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మించారు. ఉగాది పండుగని పురస్కరించుకుని ఈ చిత్రం ఈరోజు ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో చిత్రబృందం విలేకర్ల సమావేశం నిర్వహించింది. నవీన్ ఎర్నేని మాట్లాడుతూ..''పవన్‌కల్యాణ్‌తో సినిమా చేయాలనేది మా కల. అది 'ఉస్తాద్ భగత్‌సింగ్' సినిమాతో నెరవేరింది. ప్రేక్షకులకు నచ్చే అన్ని అంశాలూ ఇందులో ఉంటాయి. తెలంగాణలో సాధారణ ధరలకే టికెట్‌లు లభిస్తాయి. దాంతో ప్రేక్షకుల సంఖ్య కూడా పెరుగుతుంది'' అన్నారు. ''ఈ ఉగాది... ఉస్తాద్ ఉగాది. పూర్తిస్థాయి పవన్‌కల్యాణ్ సినిమా చూశామన్న సంతృప్తినిస్తుందీ చిత్రం'' అన్నారు హరీశ్‌శంకర్. శ్రీలీల మాట్లాడుతూ..''తెలుగు నూతన సంవత్సరాది కానుకగా ఓ మంచి తెలుగు సినిమా అయిన మా 'ఉస్తాద్ భగత్‌సింగ్' విడుదల అవుతుండడం మాకెంతో ప్రత్యేకం'' అని చెప్పింది. ''ఈ సినిమా విడుదల కోసం ఎంతో ఉత్సాహంగా ఎదురు చూశా. ఈ ఏడాదిలో నా తొలి సినిమా కావడం, అది కూడా ఉగాదికి వస్తుండడం, పైగా పవన్‌కల్యాణ్‌తో కలిసి నటించడం... ఇలా చాలా రకాలుగా ఈ సినిమా నాకు ప్రత్యేకం'' అంది రాశీ.

## పండగ వేళ.. చిరంజీవి కీలక నిర్ణయం..

ఉగాది పండగ వేళ చిరంజీవి కీలక నిర్ణయం తీసుకున్నారు. బ్లడ్ బ్యాంక్, ఐ బ్యాంక్.. ఇలా ఇప్పటికే పలు సేవా కార్యక్రమాలతో మంచి మనసు చాటిన ఆయన సరికొత్త సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. భవిష్యత్తులో పేద పిల్లలకు ఉచిత విద్య అందించడమే లక్ష్యమని తెలిపారు. పండగని పురస్కరించుకుని పాల్గొన్న ఓ కార్యక్రమంలో వివరాలు వెల్లడించారు. ''కుటుంబంలోని ఒక వ్యక్తి విద్యావంతుడైతే.. ఆ ఫ్యామిలీ అంతా బాగుపడుతుంది. ఆ దిశగానే ఆలోచిస్తున్నా. చిరంజీవి



స్ఫూర్తితోనే 'అగరం ఫౌండేషన్' స్థాపించి, పేద పిల్లలకు ఉచితంగా ఉన్నత విద్య అందిస్తున్నానని నటుడు సూర్య చెబుతుంటాడు. విద్యాదానం నన్నెంతగానో మోటివేట్ చేసింది. ఒకప్పుడు నేను నీకు ఇన్‌స్పిరేషన్.. ఇప్పుడు నువ్వు నాకు స్ఫూర్తి అని సూర్యతో అన్నాను. తెలుగు రాష్ట్రాల పిల్లలకే కాదు అవసరం ఉన్న అందరికీ ఉచితంగా విద్యను అందించాలనుకుంటున్నా'' అని అన్నారు.

## డిజిటల్ వేదికల్లోని కంటెంట్‌ను సీబీఎఫ్‌సీ ధ్రువీకరించదు



ది డెవిల్' చిత్రం నుంచి విడుదలైన ''సర్కే చునార్'' పాట వివాదాల్లో చిక్కుకుంది. ఈ పాటలోని అసభ్యకర సాహిత్యంపై నెట్టింట తీవ్ర విమర్శలు చెలరేగడం.. లోక్‌సభలోనూ దీనిపై చర్చ జరగడం.. ఈ క్రమంలోనే ఈ గీతాన్ని నిషేధిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. సమాజ్‌వాద్ పార్టీ ఎంపీ ఆనంద్ భదౌరియా ఈ వివాదాస్పద పాట అంశాన్ని ప్రస్తావించగా.. కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పందించారు. భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ హద్దుల్లోనే ఉండాలని, అందుకే పాటను బ్యాన్ చేస్తున్నట్లు తెలిపారు. దీనిపై జాతీయ మానవ హక్కుల కమిషన్, సమాచార – ప్రసార మంత్రిత్వ శాఖ సెన్సార్ బోర్డుకు నోటీసు జారీ చేశాయి. అయితే పాట యూట్యూబ్‌లో విడుదలైనందు వల్ల ఈ విషయంలో తమకు సంబంధం లేదని.. అది తమ పరిధిలోకి రాదని బదులిచ్చింది. డిజిటల్ వేదికల్లోని కంటెంట్‌ను సీబీఎఫ్‌సీ సర్టిఫై చేయదని.. ''సర్కే చునార్'' పాటకు సంబంధించి ఆ చిత్ర సంస్థ నుంచి సర్టిఫికేషన్ కోసం ఎలాంటి అప్లికేషన్ రాలేదని స్పష్టత ఇచ్చింది.

నా అనుమతి తీసుకోలేదు : నోరా ఫతేహి: తాను నటించిన 'సర్కే చునార్'' పాటకు సంబంధించి హిందీ వెర్షన్‌లో చోటు చేసుకున్న మార్పుల గురించి తనకేం తెలియదని నటి నోరా ఫతేహి తెలిపింది. ఈ విషయంలో తన అనుమతి తీసుకోలేదని పేర్కొంది. ''కన్నడ వెర్షన్ పాట చిత్రీకరణ మూడేళ్ల క్రితం జరిగింది. పెద్ద సినిమా కావడం.. సంజయ్ దత్‌తో కలిసి నటించే అవకాశం రావడంతో అంగీకరించా. హిందీ పాట 'ఖల్ నాయక్ హు మే'ని రీమేక్ చేస్తున్నారనుకున్నా. అప్పుడు నాకు కన్నడ అర్థం కాదు కాబట్టి వాళ్లు చెప్పిన దానిపైనే ఆధారపడాల్సి వచ్చింది. ఆ సమయంలో ట్రాన్స్‌లేట్ చేస్తున్నప్పుడు అసభ్యకరంగా ఉన్నట్లు అనిపించలేదు'' అని నోరా తన ప్రకటనలో తెలిపింది. ఇక తాను ఆలపించిన ఈ వివాదాస్పద పాట పట్ల గాయని మంగ్లీ కూడా క్షమాపణలు తెలిపారు. ఇది అనుకోకుండా జరిగిన పొరబాటని.. ప్రజల మనోభావాల్ని గౌరవిస్తూ అన్ని ప్లాట్‌ఫామ్స్ నుంచి ఆ గీతాన్ని తొలగించినట్లు తెలిపారు.

Printed, Published & Owned by Sirikonda Maria, Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-3-95,Padmashali Street, Karimnagar-505001 Telangana. Editor : Sirikonda Maria, RNI No. TELTEL/2013/65079, E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.